www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## 'ఖజానా'లో కాల్పులు

హైదరాబాద్‌లోని చందానగర్‌లో పట్టపగలే దోపిడీ
ఖజానా జువెలరీ తెరవగానే లోపలికి దొంగల చొరబాటు
లాకర్, గల్లాపెట్టె తాళాలు ఇవ్వాలంటూ రివాల్వర్ చూపి బెదిరింపులు.. ఇవ్వనందుకు సిబ్బందిపై కాల్పులు
వెండి ఆభరణాలను దోచుకుని పరారైన దుండగులు 14
12 ప్రత్యేక బృందాలతో గాలింపు: సీపీ అవినాశ్‌మహంతి


సీసీ కెమెరాలో రికార్డయిన చోరీ ఘటన

బుధవారం | 13-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 136 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: చవితి ఉ.6:36 తదుపరి పంచమి, తె. 4:23 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.10:32 తదుపరి రేవతి, వర్జ్యం: రా.9:49-11:19, దుర్ముహూర్తం: ఉ.11:54-12:45, అమృతఘడియలు: ఉ.6:50-8:20, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:01, సూర్యాస్తమయం: 6:38 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వరంగల్ నగరంలోని హంటర్‌రోడ్ సంతోషిమాత ఏరియాలో నివాస ప్రాంతాల్లోకి భారీగా చేరిన వరద నీరు

## ఓరుగల్లు..
# అతలాకుతలం!

### భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం.. ఇద్దరి మృతి.. ఇద్దరు గల్లంతు

ఎడతెరిపిలేని వానతో స్తంభించిన జనజీవనం
వరంగల్ నగరంలో ఇంట్లోకి చొచ్చుకొచ్చిన వరద నీటిలో మునిగి ఓ వృద్ధురాలు మృతి
జనగామ పెద్దవాగులో కొట్టుకొచ్చిన మృతదేహం
నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు
ఐదు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు
హైదరాబాద్‌లో ఉదయం తరగతులు మాత్రమే
ఐటీ ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం.. హైడ్రా సూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షంతో ఓరుగల్లు అతలాకుతలమైంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత మొదలైన వానతో వరద ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాకపోకలు నిలిచిపోయి.. జనజీవనం స్తంభించింది. ఇళ్లలో నిత్యావసరాలు, సామగ్రి తడిసిపోయాయి. వరంగల్ నగరంలోని కాశికుంట వాంబే కాలనీలో ఇంట్లోకి చొచ్చుకువచ్చిన వరద నీటిలో మునిగి.. పసునూటి బుచ్చమ్మ అనే వృద్ధురాలు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి మొదలైన కుంభ వృష్టి సుమారు మూడు గంటల పాటు కొనసాగింది. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు చెరువుల్లా మారాయి. వరద అంతకంతకూ పెరిగిపోతుండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో

మిగతా 13వ పేజీలో...

### అప్రమత్తంగా ఉండండి

ఆస్తి, ప్రాణ, పశు నష్టం జరగనివ్వొద్దు
సిద్ధంగా అంబులెన్స్‌లు, హెలికాప్టర్లు
క్లౌడ్ బరస్ట్‌ను ఎదుర్కొనేలా వ్యూహాలు
ఉద్యోగులకు సెలవులు రద్దు.. టోల్‌ఫ్రీ నంబర్లు పెట్టండి.. కలెక్టర్లతో సీఎం 13
అమ్రాబాద్, కవ్వాల్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకులు పెరిగేలా చర్యలు
అటవీశాఖపై సమీక్షలో రేవంత్ ఆదేశం 14

## ఓట్ల చోరీపై..
# సినిమా ఇంకా ఉంది!

'ఒక వ్యక్తికి ఒక ఓటు' విధానం రాజ్యాంగానికి మూలస్తంభం
ఈసీ అమలు చేయడం లేదు
అందుకే మేం రాజ్యాంగ రక్షణకు పోరాడుతున్నాం: రాహుల్ గాంధీ
లోక్‌సభను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి: అభిషేక్ బెనర్జీ
ఎస్ఐఆర్‌పై సుప్రీం విచారణ
చనిపోయారని ఈసీ పేర్కొన్న ఇద్దరిని కోర్టుకు తెచ్చిన యోగేంద్ర



'124 ఏళ్ల ఓటరు' మింతాదేవి ఫొటో ఉన్న టీ షర్టులతో ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఎన్నికల కమిషన్ (ఈసీ)పై ఓట్ల చోరీ ఆరోపణలను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరింత తీవ్రతరం చేశారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు' అనేది రాజ్యాంగానికి మూల స్తంభమని.. ఈ వ్యవహారంలో ఈసీ తన విధి నిర్వర్తించడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం ఈసీ ప్రధాన కార్యాలయానికి పాదయాత్రగా బయల్దేరిన ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా ఇంకా ఉంది (పిక్చర్ అబీ బాకీ హై)' అని హెచ్చరించారు. కేవలం ఒక్క నియోజకవర్గంలోనే ఓట్ల చోరీ జరుగలేదని.. చాలా ఓట్ల ఇలా జరిగిందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో ఓ పద్ధతి ప్రకారం చేశారని.. ఇది ఈసీతో పాటు తమకూ తెలుసని చెప్పారు. 'గతంలో ఇందుకు ఆధారాల్లేవు. ఇప్పుడు సాక్ష్యాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి ఒకే ఓటు అనేది

మిగతా 2వ పేజీలో...

# అభిశంసన ప్రక్రియ షురూ

జస్టిస్ వర్మ తొలగింపు అంశంలో ముగ్గురితో కమిటీ వేసిన లోక్‌సభ స్పీకర్
న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబడాలి
మచ్చలేని వ్యక్తిత్వం, నిజాయితీలే పునాది
అవినీతికి వ్యతిరేకంగా యావత్ దేశం, పార్లమెంటు ఒక్కటవ్వాలి: ఓంబిర్లా

న్యూఢిల్లీ, ఆగస్టు 12 : నివాసంలో భారీగా నగదు బయటపడిన వ్యవహారంలో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు సంబంధించిన ప్రక్రియను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రారంభించారు. ఆయనపై వచ్చిన అభియోగాలపై విచారణ జరపడానికి ముగ్గురు సభ్యులతో ఆయన ఒక కమిటీని నియమించారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం - 1968లోని సెక్షన్ 3(2) కింద ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీలో

మిగతా 2వ పేజీలో...

## 'హ్యామ్'లో మార్పులు..
## ఫైల్ మళ్లీ క్యాబినెట్‌కు!

చిన్న కాంట్రాక్టర్లు రూ.కోట్ల పనులు ఎలా చేయగలరు?
సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లించకుంటే తంటాలే 12
బ్యాంకులు రేటింగ్ తగ్గిస్తామంటే ఒప్పుకోం: కాంట్రాక్టర్లు
ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు, బ్యాంకర్ల సమావేశం



## అమ్మవారికి
## కుంకుమార్చన ఉద్రిక్తం

బంజారాహిల్స్‌లోని ఆలయంలో బోనం సమర్పించేందుకు బీజేపీ నాయకుల యత్నం
అడ్డుకున్న పోలీసులు.. పలువురు నేతల అరెస్టు
రాంచందర్‌రావు గృహ నిర్బంధం
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఒక వర్గం ఓట్ల కోసమే కాంగ్రెస్ సర్కారు అక్రమ అరెస్టులు: బండి సంజయ్
దేశభక్తి కార్యక్రమం చేపట్టడం నేరమా?: డీకే అరుణ

బంజారాహిల్స్/తార్నాక/హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన, అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బీజేపీ, హిందూ సంఘాల నేతలు చేసిన ప్రయత్నం ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం ఆలయం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును

మిగతా 12వ పేజీలో...

## ఏసీబీ వలలో ముగ్గురు


జూనియర్ అసిస్టెంట్లు సుజాత, శ్రీనివాసులు; సర్వేయర్ సునీల్

కలెక్టరేట్ నుంచి తహసీల్దార్‌కు ఫైలు పంపేందుకు రూ.15 వేలు లంచం
పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్
భూమి హద్దులు నిర్ణయించేందుకు ఫోన్ పే ద్వారా రూ.10 వేలు లంచం 14
పెద్దపల్లిలో సర్వేయర్ అరెస్టు
డీఏ బకాయిల ఫైలుకు 6 వేల లంచం
పీహెచ్‌సీ జూనియర్ అసిస్టెంట్ అరెస్టు




## ఏపీలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు

468 కోట్లతో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
ఒడిశా, పంజాబ్‌లలో మరో మూడు ప్లాంట్లు
తిరుపతి ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌లో ప్రాజెక్టు నిర్మాణం 10
ఏటా 9.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి చేసే సామర్థ్యం


## భూగర్భ జలాల్లో భారీగా ఫ్లోరైడ్

రాష్ట్రంలోని 28 జిల్లాల్లో అత్యధికం!
భూగర్భ జలాల నివేదిక-2024లో వెల్లడి 10
దేశవ్యాప్తంగా 263 జిల్లాల్లో ఫ్లోరైడ్ సమస్య
జలాలను భారీగా తోడేయడమూ కారణమే!


వామన్‌రావు, నాగమణి (ఫైల్)

## గట్టు వామన్‌రావు దంపతుల
## హత్య కేసు సీబీఐకి

సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం కీలక తీర్పు
మరింత లోతుగా దర్యాప్తు అవసరమని వెల్లడి
పిటిషనర్ వామన్‌రావు తండ్రికి రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి ఆదేశం 3



## వచ్చే నెలలో భారత్-చైనా విమాన సర్వీసుల పునరుద్ధరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 12 : భారత్ నుంచి చైనాకు నేరుగా వెళ్లే ప్రయాణికుల విమాన సర్వీసులు వచ్చే నెలలో తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇరుదేశాల మధ్య నేరుగా నడిచే ప్రయాణికుల విమాన సర్వీసులు నాలుగేళ్ల క్రితం, కరోనా సమయం అప్పుడు నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. అప్పట్నించి భారత్-చైనా-భారత్ ప్రయాణికులు సింగపూర్ లేదా హంకాంగ్ మీదుగా ప్రయాణాలు చేస్తున్నారు. అయితే, తాము ఆదేశాలు ఇచ్చిన వెంటనే చైనాకు విమాన సర్వీసులను పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండాలని ఎయిరిండియా, ఇండిగో తదితర విమానయాన సంస్థలకు భారత ప్రభుత్వం సూచన చేసినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. షాంఘై సహకార సంస్థ సదస్సు కోసం ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనా వెళ్లనున్న నేపథ్యంలో విమాన సర్వీసుల పునరుద్ధరణ అంశం తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ చివరిగా 2019లో చైనాలో పర్యటించారు. గల్వాన్ వ్యాలీలో భారత్, చైనా సైనికుల ఘర్షణతో 2020 జూన్ నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

## ఎయిరిండియాపై చర్యలు తీసుకోండి

» లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఐదుగురు ఎంపీల లేఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: తిరువనంతపురం నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానాన్ని సాంకేతిక సమస్య కారణంగా చెన్నైలో అత్యవసరంగా దించిన ఘటనలో ఎయిరిండియా తీవ్ర హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ సహా ఐదుగురు ఎంపీలు ఆరోపించారు. ఈ ఘటనపై వారు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు మంగళవారం లేఖ రాశారు. హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన ఎయిరిండియాపై చర్యలు తీసుకోవాలని వారు ఆ లేఖలో కోరారు. కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు కేసీ వేణుగోపాల్, కే సురేశ్, అడూర్ ప్రకాశ్, రాబర్ట్ బ్రూస్, సీపీఎం ఎంపీ కే రాధాకృష్ణన్‌తోపాటు 150 మంది ప్రయాణికులతో ఆదివారం రాత్రి తిరువనంతపురం నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానాన్ని సాంకేతిక సమస్య కారణంగా దారి మళ్లించి చెన్నై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్‌నాయుడుకు ఫిర్యాదు చేసిన ఐదుగురు ఎంపీలు.. తాజాగా ఓం బిర్లాకు కూడా లేఖ రాశారు.

## ముందు బహిష్కరణ.. తర్వాత అప్పీల్

» విదేశీ నేరగాళ్లపై బ్రిటన్ తక్షణ చర్యలు

లండన్, ఆగస్టు 12: బ్రిటన్‌లో నేరం చేసి శిక్ష పడ్డాక కూడా అప్పీల్ చేసి అక్కడే గడిపేద్దామనుకునే భారతీయులకు ఇక ఆ అవకాశం లేదు. యూకే అమలు చేస్తున్న 'తక్షణ బహిష్కరణ, తర్వాత అప్పీల్ (డిపోర్ట్ నౌ, అప్పీల్ లేటర్)' విధానంలో ఉన్న దేశాల జాబితాలోకి భారత్‌ను కూడా చేర్చడమే అందుకు కారణం. విదేశీ నేరగాళ్ల కోసం తీసుకొచ్చిన ఈ విధానాన్ని ఇప్పటికే 8 దేశాలకు బ్రిటన్ అమలు చేస్తోంది. తాజాగా ఆ జాబితాలో భారత్ సహా 15 దేశాలను చేర్చింది. ఈ 23 దేశీయులెవరైనా బ్రిటన్‌లో నివసిస్తూ ఏదైనా నేరం చేసి అది నిరూపణ అయితే వెంటనే ఆ నేరగాళ్లను వారి దేశానికి తిప్పిపంపుతారు. తమ బహిష్కరణపై అప్పీల్ చేయడం ద్వారా వారు బ్రిటన్‌లోనే ఉందామని అనుకుంటే ఇకపై కుదరదు. అయితే ఆ అప్పీల్‌పై విచారణకు వారు స్వదేశం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావాల్సి ఉంటుంది. ఉగ్రవాదులు, హంతకులు, జీవిత ఖైదు పడ్డ వాళ్లు ముందు బ్రిటన్‌లో వారికి పడ్డ శిక్షను పూర్తిగా అనుభవించాలి. ఆ తర్వాతే వారి బహిష్కరణను పరిశీలిస్తారు.

## పాక్‌లో మన రాయబారులకు గ్యాస్, కరెంట్ కట్

ఇస్లామాబాద్, ఆగస్టు 12: పాకిస్థాన్‌లో విధులు నిర్వర్తిస్తున్న భారత రాయబారులకు దాయాది దేశం ఇబ్బందులకు గురిచేస్తోంది. భారత్‌పై ప్రతీకారాన్ని రాయబారులపై తీర్చుకుంటోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఒక్కో అంశంలో ఇబ్బందులను పెంచుతూ వస్తోంది. జూన్‌లో భారత హైకమిషన్, రాయబారుల ఇళ్లకు పత్రికలను నిలిపివేసింది. తాజాగా పాకిస్థాన్‌లోని రాయబారుల గృహాలకు గ్యాస్, కరెంట్ సరఫరాను ఆపివేసింది.

## రాజస్థాన్‌లో డ్రోన్లతో మేఘమథనం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశంలోనే తొలిసారిగా డ్రోన్లతో కృత్రిమ వర్షాలను సృష్టించే మేఘమథనం ప్రయత్నం రాజస్థాన్‌లో మంగళవారం జరిగింది. జైపూర్ జిల్లాలో జామ్వారామ్‌గఢ్ జలాశయాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో దీనిని చేపట్టారు. రాజస్థాన్ వ్యవసాయశాఖ, అమెరికా-బెంగళూరు ఐటీ కంపెనీ 'జెన్ ఎక్స్ ఏఐ' సంయుక్తంగా దీనిని నిర్వహించాయి. ప్రయోగం జరిగే ప్రాంతానికి జనం పెద్ద ఎత్తున చేరుకోవటంతో నెట్‌వర్క్ సమస్యలు తలెత్తి డ్రోన్ ఆటో ల్యాండింగ్ మోడ్‌లోకి వెళ్లిందన్న వార్తలు వెలువడ్డాయి. అయితే, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు.

## అధ్యాపక నియామకాల్లో 'ఎన్‌ఎఫ్‌ఎస్'పై కన్ను

» వర్సిటీల నిర్ణయాలపై పరిశీలన చేయనున్న యూజీసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకాల విషయంలో వివాదాస్పద 'తగిన అభ్యర్థి దొరకలేదు(నాట్ ఫౌండ్ సూటిబుల్-ఎన్‌ఎఫ్‌ఎస్)' నిబంధనపై నియంత్రణను కఠినతరం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిపై యూజీసీ ఏర్పాటు చేసిన కమిటీ ఎన్‌ఎఫ్‌ఎస్ ప్రతి సందర్భాన్ని సమీక్ష కోసం కమిషన్‌కు అధికారికంగా నివేదించేలా సిఫారసు చేయనుందని భావిస్తున్నారు. దీని వల్ల పోస్టుల భర్తీ సమయంలో ఎప్పుడు సరైన అభ్యర్థి దొరకలేదనే నిబంధను ఉపయోగిస్తారో.. దాన్ని సమర్థించుకొనేలా వర్సిటీలు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా ఆ కారణాలను యూజీసీ పరిశీలించి.. తగిన సూచనలు లేదా ప్రత్యామ్నాయ నియామక ఆప్షన్లను అందించే వీలుంటుంది. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు దక్కకుండా 'ఎన్‌ఎఫ్‌ఎస్' క్లాజ్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆందోళనల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ హయాంలో ఎన్‌ఎఫ్‌ఎస్ సాకుతో నియామకాలను తప్పుదోవ పట్టించారని బీజేపీ ఆరోపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వంలోనే ఖాళీ పోస్టులు భారీగా పెరిగాయని విపక్షాలు అంటున్నాయి. ఈ సమస్యకు కారణాలు గుర్తించేందుకు యూజీసీ జూన్ 19న కమిటీని ఏర్పాటు చేసింది. రిజర్వేషన్ వర్గాల అసమాన ప్రాతినిధ్యానికి ఎన్‌ఎఫ్‌ఎస్ దోహదపడిందా? అనే దాన్ని నిర్ధారించేందుకు వర్సిటీలు, క్యాటగిరీల వారీ డేటాను సమగ్రంగా విశ్లేషించనుంది.


## మోదీ చేతిలో దేశం సురక్షితం

» అహ్మద్ పటేల్ తనయుడు ఫైజల్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దివంగత కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ కుమారుడు ఫైజల్(44) మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. 'దేశం సమర్థుని చేతిలో సురక్షితంగా ఉంద'ని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పట్ల అసంతృప్తితో లేనని, ప్రజాజీవితం నుంచి విరామం తీసుకుంటున్నానని తెలిపారు. 'తండ్రి అడుగుజాడల్లో నడిచే అవకాశం కాంగ్రెస్ నాకు ఇవ్వలేద'ని కొన్ని నెలల క్రితం వ్యాఖ్యానించిన ఫైజల్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు.

## అభిశంసన ప్రక్రియ షురూ

(మొదటిపేజీ తరువాయి)



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మణీంద్రమోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు న్యాయవాది బీవీ ఆచార్య సభ్యులుగా ఉన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మను బాధ్యతల నుంచి తప్పించాలంటూ లోక్‌సభ, రాజ్యసభకు చెందిన 146 మంది ఎంపీల నుంచి గత నెల 21న నోటీసులను స్పీకర్ స్వీకరించారు. మంగళవారం దీనిపై కమిటీ ఏర్పాటుకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. "కమిటీ వీలైనంత త్వరగా తన నివేదిక ఇస్తుంది. విచారణ కమిటీ రిపోర్టు చేతికి వచ్చేవరకు జస్టిస్ వర్మ తొలగింపునకు సంబంధించిన ప్రతిపాదనన పెండింగ్‌లో ఉంటుంది." అని ఓంబిర్లా తెలిపారు. న్యాయవ్యవస్థ పట్ల ప్రజల విశ్వాసం నిలబడాలని, మచ్చలేని వ్యక్తిత్వం, ఆర్థిక, మేధోపరమైన సమగ్రతే ఇందుకు పునాది అని వ్యాఖ్యానించారు. "న్యాయమూర్తిపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217, 218 ప్రకారం చర్యలకు వీలున్నది. అవినీతిపై పార్లమెంటు, దేశ ప్రజలు ఒక్కటవ్వాలి.." అని ఓంబిర్లా పిలుపునిచ్చారు.

ఓట్ల చోరీపై..

# సినిమా ఇంకా ఉంది!

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగ మూలస్తంభం. దానిని అమలుచేయాల్సిన ఈసీ ఆ పనిచేయడం లేదు. అందుచేత మేం రాజ్యాంగ రక్షణకు పూనుకున్నాం. దీనిని కొనసాగిస్తాం' అని స్పష్టంచేశారు. బిహార్ ఓటర్ల జాబితాలో మింతా దేవి అనే మహిళ వయసును 124 ఏళ్లుగా ఈసీ పేర్కొనటమే గాక, ఆమె తొలిసారి ఓటుహక్కు పొందినట్లుగా చెప్పడాన్ని ప్రస్తావించారు. ఇలాంటి తప్పుడు కేసులు అనేకం ఉన్నాయన్నారు. అంతకుముందు.. బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణపై పార్లమెంటులో చర్చించాలంటూ ఇండీ కూటమి ఎంపీలు పార్లమెంటు భవన సముదాయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారంతా మింతాదేవి ఫొటో, పేరు ముద్రించిన టీ షర్టులు ధరించారు. ఈ నిరసనలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీపీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాతో పాటు డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ), టీఆర్ బాలు (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్‌సీపీ-ఎస్‌పీ). వామపక్షాల ఎంపీలు పాల్గొన్నారు. రాజీవ్‌కుమార్, జ్ఞానేశ్‌కుమార్ సారథ్యంలో ఈసీ బీజేపీ విభాగంగా మారిపోయిందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ ఆరోపించారు.

### కుట్రపన్నడమే బీజేపీ నైజం: అఖిలేశ్

ఎన్నికల అక్రమాలకు కుట్రలు పన్నడమే బీజేపీ చేసే అతిపెద్ద పని అని సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఎన్నికలను ప్రభావితం చేయడానికే బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) చేపట్టారని అన్నారు. ఏడాది కిందట చేపట్టాల్సిన ఈ సవరణ ప్రక్రియను.. ప్రతిపక్షాల ఓట్లను తొలగించడానికి ఉద్దేశపూర్వకంగా ఇప్పుడు చేపట్టారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తోందని ఆర్‌జేడీ నేత, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. ఓటర్ల ప్రత్యేక సవరణను ఆయన మంగళవారం పట్నాలో తప్పుబట్టారు.




ఢిల్లీలో నిరసన ర్యాలీలో పాల్గొన్న రాహుల్ గాంధీ

### లోక్‌సభను రద్దు చేయాలి: అభిషేక్

ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉన్నాయని ఈసీ భావిస్తే.. మొదట ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గం రాజీనామా చేయాలని టీఎంసీ లోక్‌సభాపక్ష నేత అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు. లోక్‌సభను రద్దుచేయాలన్నారు. ఎంపిక చేసిన రాష్ట్రాల్లో కాకుండా దేశవ్యాప్తంగా 'సర్' చేపట్టాలని స్పష్టంచేశారు. బిహార్, బెంగాల్లో ఓటర్ల హక్కులను అణచివేసేందుకే తాజాగా సవరణ చేపట్టారని కోల్‌కతాలో ఆరోపించారు. గుజరాత్, యూపీ, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో ఎందుకు చేపట్టలేదని నిలదీశారు.

### రేపు కాగడా ర్యాలీ

'ఓటు చౌర్యం'పై కాంగ్రెస్ పార్టీ ఈ నెల 14న దేశవ్యాప్తంగా 'లోక్ తంత్ర బచావో' పేరుతో కాగడ ర్యాలీలకు పిలుపునిచ్చింది. అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ అంశంపై మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, జైరామ్ రమేశ్, కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్, భన్వర్ జితేంద్ర సింగ్, గులాం అహ్మద్ మిర్, అజయ్ మాకెన్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎన్ఎస్‌యూఐ నేత కన్హయ్యకుమార్ ఇండీ కూటమి భవిష్యత్ కార్యాచరణ వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 14న 'లోక్ తంత్ర బచావో మశాల్ మార్చ్', 22 నుంచి సెప్టెంబరు 7 వరకు అన్ని రాష్ట్రాల రాజధానుల్లో 'ఓటు దొంగలు.. అధికారపీఠాన్ని వదిలేయండి' నినాదంతో ర్యాలీలు, సెప్టెంబరు 15 నుంచి నెలరోజుల పాటు ఓటుహక్కు రక్షణ కోసం సంతకాల సేకరణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ పోరాటంలో ఇండీ కూటమి సమష్టిగా పనిచేస్తుందని చెప్పారు. అంతకు ముందు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటే.. ఓట్ల చౌర్యంతో కాంగ్రెస్ 48 లోక్‌సభ స్థానాలను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ

» చనిపోయారని ఈసీ పేర్కొన్న ఇద్దరిని కోర్టుకు తెచ్చిన యోగేంద్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ రూపకల్పనలో అవకతవకలు జరిగినట్లు తేలితే బిహార్ ఓటర్ల జాబితాను పక్కన పెట్టేస్తామని స్పష్టం చేసింది. సెప్టెంబరు 30లోపు తుది జాబితా విడుదల చేయాల్సి ఉంది. అయితే జాబితా తయారీలో అవకతవకలు జరిగినట్లు రుజువైతే దాన్ని ఆమోదించబోమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పలు వ్యాజ్యాలను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు? గతంలో నమోదైన మరణాల సంఖ్య ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య.. వంటి సమాచారంపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని ఈసీకి తెలిపింది. పిటిషనర్లు, ఈసీ తరఫు న్యాయవాదుల వాదనలు విన్న ధర్మాసనం.. పలు వ్యాఖ్యలు చేసింది. 2003 ఓటర్ల జాబితా ప్రకారం బిహార్‌లో ఉన్న 7.9 కోట్ల మంది ఓటర్లలో 6.5 కోట్ల మంది వారు, వారి తల్లిదండ్రుల గుర్తింపు కోసం ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని ఈసీ పేర్కొందని ధర్మాసనం గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఈ వివాదం 'విశ్వాస లోటు అంశం'మే తప్ప మరోటి కాదని పేర్కొంది. "7.9 కోట్ల మంది ఓటర్లలో 7.24 కోట్ల మంది ఎస్ఐఆర్‌పై స్పందించారు. ఈ నేపథ్యంలో కోటి మంది ఓటర్లు గల్లంతయ్యారు లేదా తొలగించారన్న సిద్ధాంతానికి తావెక్కడిది?" అని పిటిషనర్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరఫున హాజరైన న్యాయవాది కపిల్ సిబాల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే ఆధార్ కార్డు, ఓటరు కార్డులు పౌరసత్వానికి సమగ్ర గుర్తింపులు కావన్న ఈసీ నిర్ణయంతో ఏకీభవిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియలో మరికొన్ని ఇతర పత్రాలు అవసరమని స్పష్టం చేసింది. కాగా, ఓటర్ల జాబితా రూపకల్పనలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ చెప్పారు. ఇలాంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని, ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు.

### ఆ ఇద్దరినీ తీసుకొచ్చిన యోగేంద్ర..!

మరో పిటిషనర్ యోగేంద్ర యాదవ్ స్వయంగా వాదనలు వినిపించారు. ఎస్ఐఆర్‌లో చనిపోయినట్లుగా ప్రకటించిన ఇద్దరిని సుప్రీంకోర్టుకు తీసుకొచ్చారు. ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ స్పందిస్తూ.. దీన్ని ఓ డ్రామాగా అభివర్ణించారు. ఈ అంశంపై స్పందించిన జస్టిస్ బాగ్చి.. "ఇది అనుకోకుండా జరిగిన పొరపాటు అయ్యి ఉంటుంది. దీన్ని సరిచేయవచ్చు. కానీ, మీరు లేవనెత్తిన అంశాలు బాగున్నాయి" అని యాదవ్‌ను ప్రశంసించారు. కాగా, ఓటర్ల జాబితా సవరణలో ఒక్క వ్యక్తిని కూడా చేర్చలేదని, ఇలాంటి ప్రక్రియ (ఎస్ఐఆర్) దేశ చరిత్రలోనే తొలిసారి అని యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. అలాగే 65 లక్షల పేర్లను తొలగించారని, ఈ సంఖ్య కోటి కూడా దాటొచ్చని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి వాదనలు బుధవారం కొనసాగుతాయని ప్రకటించింది.

## లోకం తీరు

తెలుగు వర్సిటీలో ఇంద్రజాలం కోర్సులకు నేరుగా ప్రవేశాలు




## భారత్‌తో యుద్ధం జరిగితే.. ముఖేశ్ అంబానీ రిఫైనరీపై దాడి

» పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ హెచ్చరికలు

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 12: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తన అమెరికా పర్యటన సందర్భంగా భారత్‌పై ఎడాపెడా నోరుపారేసుకుంటున్నారు. మొన్నటికి మొన్న అణుబాంబు వేస్తామని, తమ ఉనికికి ప్రమాదం ఏర్పడితే.. తాము మునగడమే కాకుండా.. సగం ప్రపంచాన్ని వెంట తీసుకెళ్తామని ఆయన హెచ్చరించిన విషయం తెలిసిందే..! అమెరికాలోని టంపా, ఫ్లోరిడాల్లో జరిగిన కార్యక్రమాల్లో మునీర్ ఈ వ్యాఖ్యలు చేయగా.. అదే సందర్భంలో ముఖేశ్ అంబానీకి చెందిన జామ్‌నగర్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగారు. భారత్‌తో యుద్ధం జరిగితే.. జామ్‌నగర్ రిఫైనరీపై దాడి చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ముఖేశ్ అంబానీ ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మునీర్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. అణు బ్లాక్‌మెయిల్‌కు భారత్ ఎన్నటికీ లొంగదని, జాతీయ భద్రత కోసం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసింది. కాగా.. మునీర్ వ్యాఖ్యల తర్వాత.. సింధు సహా.. ఆరు నదులపై పాకిస్థాన్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో మరో యుద్ధం జరిగితే.. పాకిస్థాన్ ఆరు నదుల(సింధు, జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్)ను తిరిగి తీసుకుంటుందని హెచ్చరించారు.

### నీళ్లివ్వాలంటూ విజ్ఞప్తులు

ఓ వైపు ఆసిమ్ మునీర్, బిలావల్ భుట్టో భారత్‌పై బెదిరింపు ధోరణిని ప్రదర్శిస్తుంటే.. ఆ దేశ విదేశాంగ శాఖ మాత్రం నీళ్ల కోసం భారత్‌కు విజ్ఞప్తులు చేస్తోంది. సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించాలని.. చీనాబ్, జీలం, సింధు నదుల జలాల విషయంలో ఆర్బిట్రేషన్ తీర్పును అనుసరించి, నీళ్లివ్వాలని కోరింది. అయితే.. ఈ తీర్పును భారత్ ఎప్పటినుంచో తిరస్కరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే..!

## నెలాఖరులోపు స్వాతంత్ర్య యోధుల పింఛన్ కేసులు పరిష్కరించండి

» అధికారులకు బండి సంజయ్ ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ కేసులు పరిష్కరించాలని అధికారులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశించారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎనిమీ ప్రాపర్టీ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎనిమీ ప్రాపర్టీస్ విక్రయాలతో సర్కారుకు రూ.107 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు, పునరావాస విభాగం, కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ ఫర్ ఇండియా(సీఈపీఐ) అధికారులతో మంగళవారం బండి సంజయ్ సమీక్షించారు. స్వాతంత్ర్య సైనిక్ సత్కార యోజన(ఎస్ఎస్ఎస్‌వై) కింద 26,623, స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ కోసం 8,829 ఫైళ్లు, ఎనిమీ ప్రాపర్టీస్ 12,800 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన పత్రాలు అందక స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో సంబంధిత రాష్ట్రాలకు లేఖలు రాయాలని అధికారులను సంజయ్ ఆదేశించారు. వేగవంతంగా పింఛన్ మంజూరుకు ప్రత్యేక బృందాలను రాష్ట్రాలకు పంపాలని చెప్పారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై వివరాలు అందించాలని, వచ్చే నెలలో సీఈపీఐ శాఖ కార్యాలయాలను స్వయంగా సందర్శించి పురోగతిని సమీక్షిస్తానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ప్రాచీన యుగంలోకి వెళ్లినట్టుంది!

## వీధికుక్కలపై సుప్రీంకోర్టు ఆదేశాలను ఉటంకిస్తూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

» అంత క్రూరత్వం పనికిరాదు: ప్రియాంక

» కనికరం లేదా: సినీ నటుల ముక్తకంఠం

» ఆదేశాలు సవరించండి: సీజేఐకి లేఖలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఢిల్లీలోని వీధి కుక్కలను శాశ్వతంగా వేరే ప్రాంతానికి తరలించాలని, వాటికి ప్రత్యేక ఆవాసాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. "సుప్రీంకోర్టు ఆదేశాలు.. సైన్సు, మానవత్వం లేని కొన్ని దశాబ్దాల కిందటి ప్రాచీన యుగంలోకి వెళ్లినట్టున్నాయి. మన దయ, కరుణలను దూరం చేస్తున్నట్టున్నాయి." అని వ్యాఖ్యానించారు. కుక్కలకు టీకాలు వేయడం, స్థానికంగానే ఆవాసాలను ఏర్పాటు చేయడంవంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఇదే విషయంపై ఎంపీ ప్రియాంక గాంధీ స్పందిస్తూ.. కుక్కలు ఎంతో అందమైనవని, వాటి పట్ల క్రూరత్వం ప్రదర్శించాల్సిన అవసరం లేదని, వాటిని నిర్మూలించడం అంటే మూగజీవుల పట్ల భయంకరమైన క్రూరత్వాన్ని ప్రదర్శించడమేనని తెలిపారు. పట్టణాల్లో జంతువుల పట్ల ఇప్పటికే అమానుషంగా ప్రవరిస్తున్నారని, వాటిపట్ల మానవత్వం ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### మరణ శాసనం: బాలీవుడ్



సుప్రీంకోర్టు ఆదేశాలపై బాలీవుడ్ నటులు తీవ్రంగా స్పందించారు. స్వేచ్ఛలేదని వ్యాఖ్యానించారు. జాన్వీకపూర్, వరుణ ధవన్‌లు స్పందిస్తూ.. 'కనికరం చూపించలేమా?' అని వ్యాఖ్యానించారు. అలాగే సింగర్ చిన్మయి శ్రీపాద, నిర్మాత సిద్ధార్థ్ ఆనంద్‌లు స్పందిస్తూ.. 'కుక్కలకు ఇది మరణ శాసనం." అని అన్నారు. మరోనటుడు అడవి శేష్ స్పందిస్తూ.. 'భారత మానవీయ, కరుణా సూత్రాలకు ఈ ఆదేశాలు విరుద్ధం.' అని పేర్కొన్నారు. అదేవిధంగా వరుణ్ గ్రోవర్, వీర్‌దాస్ తదితరులు కూడా సుప్రీం ఆదేశాలను తప్పుబట్టారు. అదేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాలను పునఃసమీక్షించాలని కోరుతూ.. నటులు అడివి శేష్, జాన్ అబ్రహం సుప్రీకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, ఢిల్లీ సీఎం రేఖాగుప్తాలకు లేఖలు రాశారు. ఢిల్లీ నుంచి వీధికుక్కలను శాశ్వతంగా తరలించాలన్న ఆదేశాల్లో మార్పులు చేయాలని ఆయన కోరారు.

### కుక్కలు పోతే కోతులొస్తాయ్: మేనకాగాంధీ

కుక్కలను సామూహికంగా తరలించడాన్ని కేంద్ర మాజీ మంత్రి, జంతు హక్కుల ఉద్యమకారిణి మేనకా గాంధీ తప్పుబట్టారు. 'ఇది అసాధ్యం. రూ.వేల కోట్ల ఖర్చు. పర్యావరణానికి కూడా ముప్పు." అని అన్నారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో 1880లో జరిగిన ఘటనను ఆమె వివరించారు. "ప్యారిస్‌లో కుక్కలు పెరిగిపోయాయని సామూహికంగా చంపేశారు. దీంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింది. ఎలుకలు పెరిగిపోయాయి. దీనివల్ల ఊహించని పరిణామాలు ఎదురయ్యాయి. ఇప్పుడు ఢిల్లీలో కుక్కలను లేకుండా చేస్తే కోతులు మూగుతాయి. ఇది నా అనుభవం. అప్పుడు ఏం చేస్తారు?." అని ప్రశ్నించారు.

### సుప్రీం ఆవరణలో కుక్కలు కనిపించొద్దు

వీధి కుక్కల వ్యవహారంపై సుప్రీంకోర్టు మంగళవారం మరోసారి స్పందించింది. కోర్టు ఆవరణ సహా లిఫ్టుల్లోనూ కుక్కలు కనిపిస్తున్నాయని, ఇక నుంచి అవి ఆవరణలో కనిపించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. కోర్టుకు వచ్చేవారు తినగా మిగిలిపోయిన పదార్థాలను కుక్కలకు అసలు పెట్టడానికి వీల్లేదని పేర్కొంది. మిగిలిపోయిన పదార్థాలను ధ్వంసం చేయాలని, లేదా ప్యాక్ చేసి గట్టి మూతలు ఉన్న డస్ట్‌బిన్లలో వేయాలని సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

## భారత్‌పై సుంకాలు.. రష్యాకు పెద్ద దెబ్బ

» రష్యా ఆర్థిక వ్యవస్థ క్షీణ దశలో ఉంది

» అమెరికా సుంకాలే కారణం: ట్రంప్

» శుక్రవారం పుతిన్‌తో భేటీ



వాషింగ్టన్, ఆగస్టు 12: రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై విధించిన టారిఫ్‌లతో రష్యాకు పెద్ద దెబ్బ తగిలిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం రష్యా ఆర్థిక వ్యవస్థ క్షీణదశలో ఉందని వ్యాఖ్యానించారు. సోమవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆయన వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడారు. "రష్యా ఒక పెద్ద దేశం. ఎంతో పురోగమించే సామర్థ్యం దానికి ఉంది. ఆ దేశం పునర్నిర్మాణంపై దృష్టిసారించుకోవాల్సి ఉంది. ఇప్పుడైతే రష్యా పరిస్థితి ఏమీ బాగోలేదు. అమెరికా ఆంక్షలే దానికి కారణం. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 50శాతం సుంకాలు విధించాం. అది రష్యాకు పెద్ద దెబ్బ." అని ట్రంప్ పేర్కొన్నారు. శుక్రవారం అలాస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం కానున్నట్టు తెలిపారు. రష్యాలోనో, మరో దేశంలోనో కలవకుండా.. అమెరికాలో తమ భేటీ జరగనుండటం గౌరవనీయమని పేర్కొన్నారు. తమ భేటీ తర్వాత యూరోపియన్ దేశాల నేతలతో మాట్లాడుతానని.. పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య చర్చలు జరిగేలా చూస్తానని తెలిపారు.

### చైనాపై టారిఫ్‌లు 3 నెలలు వాయిదా

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించి, అందులో 25శాతాన్ని అమల్లోకి తెచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌కన్నా ఎక్కువగా రష్యా చమురు కొంటున్న చైనా విషయంలో మాత్రం మినహాయింపులు పెంచుకుంటూ వెళుతున్నారు. చైనాపై సుంకాలకు ఇచ్చిన మినహాయింపు గడువును మరో మూడు నెలలు అంటే నవంబర్ 10వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### వాషింగ్టన్‌లో 'నేర అత్యయిక స్థితి'

వాషింగ్టన్, ఆగస్టు 12: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో నేరాలు పెరిగిపోతున్నాయంటూ.. 'నేర అత్యయిక స్థితి'ని ప్రకటిస్తూ ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో వాషింగ్టన్ డీసీలోని ఫెడరల్ భవనాలు, ఆస్తులు, జాతీయ స్మారకాల భద్రత కేంద్రం పరిధిలోకి వస్తుంది. నగర మేయర్, మెట్రోపాలిటన్ పోలీసులను ట్రంప్ తన అదుపాజ్ఞల్లో ఉంచుకునే వెసులుబాటు కలుగుతుంది. అయితే.. ట్రంప్ తన అధికారాలను అటార్నీ జనరల్‌కు దఖలుపరిచారు. అటార్నీ జనరల్ పరిస్థితులను పర్యవేక్షించి, పరిస్థితులపై నివేదికలను అధ్యక్షుడికి అందజేస్తారు.

### అలాస్కా.. రష్యాలో.. నోరుజారిన ట్రంప్!

అమెరికాలో వాయవ్య ప్రాంతంలో ఉన్న కీలక ప్రాంతం అలాస్కా. శుక్రవారం అక్కడే ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ జరగనుంది. ట్రంప్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. 'పుతిన్‌తో చర్చల కోసం రష్యా వెళుతున్నా..' అంటూ నోరుజారారు. దీనితో అమెరికాలో భాగమైన అలాస్కాను రష్యాగా పేర్కొనడం ఏమిటంటూ ట్రోలింగ్ జరుగుతోంది.

## నోయిడాలో ఏకంగా నకిలీ అంతర్జాతీయ పోలీసు స్టేషన్!

» ఇంటర్‌పోల్ పేరుతో నోటీసులు

» నిందితుడు తృణమూల్ మాజీ నేత

న్యూఢిల్లీ, ఆగస్టు 12: నకిలీ బ్యాంకులు, నకిలీ కార్యాలయాల తరహాలో నోయిడాలో ఏకంగా నకిలీ అంతర్జాతీయ పోలీసు స్టేషన్, ఇంటర్‌పోల్, ఇంటెలిజెన్స్‌బ్యూరో (ఐబీ) కార్యాలయాలు వెలిశాయి. వీటిని నిర్వహించిన బివాస్ అధికారి అనే తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేతను, సహకరించిన మరో నలుగుర్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లా నల్‌హతి బ్లాక్ తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన బివాస్‌పై పలు కేసులు నమోదు కావడంతో ఢిల్లీ వచ్చేశారు. నోయిడాలో నకిలీ ఐబీ, ఇంటర్‌పోల్ కార్యాలయాలు తెరిచి పశ్చిమ బెంగాల్‌లోని వ్యక్తులకు నోటీసులు ఇవ్వడం ప్రారంభించాడు. భూవివాదాల పరిష్కారం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించడం పేరుతో సొమ్ములు వసూలు చేసేవాడు. వారి కార్లకు ఇంటర్‌పోల్ స్టిక్కర్లు అతికించడంలో అతడి కుమారుడు కీలక పాత్ర పోషించాడు. నాలుగు నెలల క్రితం కారుపై బ్లూ బల్బ్‌ను ఏర్పాటు చేసుకొని వెళ్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి దర్యాప్తు జరపడంతో అసలు విషయం బయటపడింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం
# హైదరాబాద్ యువతి దుర్మరణం

» రోడ్డుపై నడిచి వెళుతుండగా ఢీకొట్టిన ట్రక్కు


శ్రీజ వర్మ (ఫైల్)

దుండిగల్, సిద్దిపేట రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లిన ఓ యువతి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించింది. సిద్దిపేట జిల్లా రావురూకలకు చెందిన లక్కర్సు శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజ వర్మ(23), శ్రియ వర్మ కుమార్తెలున్నారు. 16 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చిన ఈ కుటుంబం గండిమైసమ్మలోని బాలాజీనగర్‌లో ప్రస్తుతం నివాసముంటోంది. శ్రీనివాస్ బౌరంపేటలోని ఓక్రిడ్జ్ పాఠశాలలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జిగా పనిచేస్తుండగా హేమలత ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారు. ఇక, దుండిగల్‌లోని ఏరోనాటికల్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన శ్రీజ వర్మ ఎంఎస్ చదివేందుకు మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ చదువు పూర్తి చేసుకున్న శ్రీజ.. ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. స్నేహితులతో కలిసి షికాగోలో నివాసముంటున్న శ్రీజ వర్మ.. సోమవారం రాత్రి తొమ్మిది గంటలప్పుడు(అమెరికా కాలమాన ప్రకారం) స్నేహితురాలితో కలిసి రెస్టారెంట్‌కు నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ ట్రక్కు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఎప్పట్లాగే కుమార్తె యోగక్షేమాలు తెలుసుకునేందుకు శ్రీనివాస్ వర్మ.. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం శ్రీజకు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. దీంతో శ్రీజ వర్మ స్నేహితులకు ఫోన్ చేయగా కుమార్తె మరణవార్త తెలిసింది. కూతురి హఠాన్మరణంతో శ్రీనివాస్ వర్మ దంపతులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. శ్రియ వర్మ కూడా ఉన్నత చదువుల కోసం 23 రోజుల క్రితమే అమెరికా వెళ్లారు. కాగా, శ్రీజ వర్మ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు సాయం చేయాలని శ్రీనివాస్ వర్మ దంపతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. విషయాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లామని శ్రీనివాస్ వర్మ బంధువులు వెల్లడించారు.

## పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ: మల్లు రవి

న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీల ఫోరం తెలంగాణ కన్వీనర్ మల్లు రవి ఆరోపించారు. పార్లమెంట్ క్వశ్చన్ అవర్‌లో కనీసం ప్రశ్నలు అడిగే సమయం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సభను నడిపే ఉద్దేశం మోదీకి లేదని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం సభను వాయిదా వేసేసి, సాయంత్రం మళ్లీ ప్రారంభించి ముగిస్తున్నారని, ఇది సభ నడిపే పద్ధతేనా అని ప్రశ్నించారు. ప్రజల కోసం తీసుకొచ్చే బిల్లులపై ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడే అవకాశమే ఇవ్వకుంటే.. ఇదేం ప్రజాస్వామ్యం అవుతుందని ప్రశ్నించారు. ఇంతటి నియంతృత్వ పాలన రాజుల కాలంలోనూ చూడలేదన్నారు. రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ రాహుల్ గాంధీతోనే సాధ్యమని అన్నారు. కాగా, మానసిక వికలాంగుల భద్రతకు ఐరిస్ టెక్నాలజీ అమలు చేయాలని ఎంపీ కడియం కావ్య కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అయితే, అలాంటి ప్రతిపాదనేదీ ప్రస్తుతం కేంద్రం వద్ద లేదని కేంద్రమంత్రి బీఎల్ వర్మ కావ్య ప్రశ్నకు సమాధానం చెప్పారు.

## శేరిలింగంపల్లిలోనూ అవకతవకలు : చామల

రాజ్యాంగ బద్ధంగా, పారదర్శకంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం బీజేపీకి ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తక్కువ మెజారిటీతో ఓడిపోయే అవకాశం ఉందని భావించిన అన్ని నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీ అవకతవకలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో చామల కిరణ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని, బిహార్, పశ్చిమబెంగాల్, అసోంలో ఓటమి ఖాయమనే అభిప్రాయానికి వచ్చిన బీజేపీ ఆయా రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఓటరు జాబితాల్లో అవకతవకలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఓట్ల చోరీ, బీజేపీ బాగోతం గురించి ప్రజలకు వివరిస్తామని, ఆ పార్టీ ఎన్ని కుట్రలు పన్నినా, కుయుక్తులకు పాల్పడినా తమ పోరాటం ఆగదని చామల స్పష్టం చేశారు.

## పాకిస్థాన్ బెదిరింపులపై మోదీ స్పందించాలి

» రక్షణ శాఖకు బడ్జెట్ పెంచాలి: అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అణ్వాయుధ బెదిరింపులపై ప్రధాని మోదీ స్పందించాల్సిన అవసరం ఉందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. దాయాది దేశం పాకిస్థాన్ నుంచి మనకు నిరంతరం ముప్పు ఉన్నందున ఆ దేశానికి చెందిన ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకుని అందుకు అనుగుణంగా మన దేశ రక్షణ వ్యవస్థను సంసిద్ధం చేయాలన్నారు. పాకిస్థాన్ సైనిక వ్యూహాలను పసిగట్టి అందుకు అనుగుణంగా భారత సైన్యాన్ని ఆధునికరించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. రక్షణ బడ్జెట్‌ను సైతం అందుకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు.

## జీవో నం.17ను వెంటనే రద్దు చేయాలి

» లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా : ప్రవీణ్ కుమార్

గురుకులాలు, ఇతర పాఠశాలల్లో విద్యార్థులకు అందించే కోడిగుడ్ల ధరను పెంచుతూ, గుడ్ల బరువును తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.17ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. దీన్ని వెంటనే రద్దు చేయకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోడిగుడ్ల ధరను రూ.5.50 నుంచి రూ.7లకు పెంచిందని, అలాగే గతంలో ఇచ్చిన గుడ్డు బరువు 50-60 గ్రాములుండగా, ప్రస్తుతం ప్రభుత్వం 42 నుంచి 50 గ్రాములకు తగ్గించిందని నేడొక ప్రకటనలో ఆయన తెలిపారు. టెండరు దరఖాస్తు ధరను 25వేలకు పెంచారని, రూ.3 కోట్ల వార్షిక టర్నోవర్ నిబంధన పెట్టడం వల్ల చిన్న కాంట్రాక్టర్లు, వ్యాపారులు పోటీలో లేకుండా పోతారన్నారని, దాదాపు 20వేల మంది రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పొంగులేటి, జానా రెడ్డి, మాజీ ఎంపీ.రంజిత్‌రెడ్డిలతో పాటు ఏపీకి చెందిన సీఎం రమేశ్‌ల వర్గీయులకే టెండర్లు వచ్చేలా రేవంత్ సర్కారు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు.

## వామన్‌రావు దంపతుల
# హత్య కేసు సీబీఐకి

» సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం కీలక తీర్పు
» ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు అవసరం
» నిందితులను మళ్లీ అరెస్టు చేయాల్సిన అవసరం లేదు
» కొత్తగా అభియోగాలుంటే చేయొచ్చు: ధర్మాసనం
» పిటిషనర్ అయిన వామనరావు తండ్రికి రక్షణ కల్పించాలని తెలంగాణా ప్రభుత్వానికి ఆదేశం


గట్టు వామన్‌రావు దంపతులు (ఫైల్)

న్యూఢిల్లీ, పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామనరావు-నాగమణిల హత్య కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. కేసును మరోసారి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. కేసును సమగ్రంగా మళ్లీ దర్యాప్తు చేయాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)ని ఆదేశించింది. పెద్దపల్లి జిల్లా మంథని సమీపంలోని కల్వచర్ల వద్ద 2021 ఫిబ్రవరి 17న గట్టు వామనరావు, ఆయన భార్య నాగమణి దారుణహత్యకు గురయ్యారు. కారులో వెళుతున్న దంపతులను అడ్డగించిన దుండగులు.. నడిరోడ్డుపైనే అత్యంత కిరాతంగా హతమార్చారు. పోలీసులు దర్యాప్తు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారు. అయితే, తన కుమారుడు, కోడలు హత్యపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని వామనరావు తండ్రి కిషన్ రావు 2021 సెప్టెంబరు 18న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, త్వరగా విచారణ జరిపించి కేసును సీబీఐకి అప్పగించాలని, దోషులకు కఠినంగా శిక్షపడేలా చూడాలని ఆయన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పుట్ట మధుకర్ ప్రమేయంతోనే హత్య జరిగిందని, సీబీఐ విచారణ జరిగితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి సుదీర్ఘకాలంగా వాదనలు వినిపిస్తున్నారు. ఎట్టకేలకు, తెలంగాణలో ప్రభుత్వం మారడంతో విచారణను సీబీఐకి అప్పగించడంలో తమకు అభ్యంతరం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. అలాగే, న్యాయస్థానం ఆదేశిస్తే విచారణకు తాము సిద్ధమేనని సీబీఐ సైతం అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించిన ఆధారాలన్నీ సమర్పిస్తే.. పరిశీలించి కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడంపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు ఈ ఏడాది మే 13న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. గత సుప్రీం ఆదేశాలతో.. హత్యకు సంబంధించిన వీడియోలు, పత్రాలను సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం సమర్పించింది. వామనరావు మరణ వాంగ్మూలం వీడియోపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఎఫ్ఎస్ఎల్‌కి పంపించామని చెబుతూ ఆ నివేదికను ధర్మాసనం ముందుంచింది. ఆ మరణ వాంగ్మూలం అసలుదేనని ల్యాబ్ నివేదికలో తేలిందనే విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. అయితే, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించినా, లేదంటే.. తమనే మరోసారి సమగ్రంగా దర్యాప్తు చేయమన్నా తమకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికతోపాటు అన్ని రికార్డులను పరిశీలించిన సుప్రీంకోర్టు కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. మరోసారి సమగ్రంగా విచారించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే.. ఇందులో ఇప్పటికే నిందితులుగా ఉన్న వారిని పోలీసులు అరెస్టు చేశారని, విచారణ తర్వాత బెయిల్‌పై బయటికి వచ్చారని నిందితుల తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారని, ఒకసారి ఏదైనా కేసులో చార్జిషీట్ దాఖలు చేస్తే.. ఆ కేసుపై ఏదైనా నిర్ణయం తీసుకునే అధికారం ట్రయల్ కోర్టుకు ఉంటుందని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేశారా? అని ధర్మాసనం ప్రశ్నించగా, అవునని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది బదులిచ్చారు. అలాగైతే, గతంలో పోలీసులు అరెస్టు చేసిన నిందితులను మరోసారి అరెస్టు చేయవద్దని సీబీఐని ధర్మాసనం ఆదేశించింది. అయితే.. కొత్తగా అనుమానితులను గుర్తిస్తే, వారినీ నిందితులుగా కేసులో చేర్చితే వారిని అరెస్టు చేయవచ్చని స్పష్టంచేసింది. అలాగే, పిటిషనర్ కు భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

# మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లు

» 50% రాయితీపై పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు
» 2025-26 సంవత్సరానికి రూ.41.8 కోట్లు
» ఈ ఏడాదికి ఎస్సీ, ఎస్టీ మహిళలకు మాత్రమే!
» దరఖాస్తుల స్వీకరణకు తుదిగడువు ఆగస్టు 14
» 60% కేంద్ర, 40శాతం రాష్ట్ర నిధులతో అమలు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 2025-26 సంవత్సరానికిగాను ఈ పథకం కోసం రూ.41.83 కోట్ల నిధులు కేటాయించింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను 14 నాటికి పూర్తిచేసి నెలరోజుల్లోగా లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లు అందించేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్' పథకంలో భాగంగా వారికి ఈ పనిముట్లు అందించనున్నారు. 60 శాతం కేంద్రం నిధులు, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. అయితే.. ఈ ఏడాదికి కేవలం ఎస్సీ, ఎస్టీ మహిళలకే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లబ్ధి పొందాలంటే సదరు మహిళల పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో తప్పనిసరిగా భూమి నమోదై ఉండాలి. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సులు, ఒరిజినల్ డీడీ, రెండు ఫొటోలతో దరఖాస్తు చేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఒకవేళ ట్రాక్టర్‌కు జత చేసి వినియోగించే పరికరాలకోసం దరఖాస్తు చేసుకుంటే.. ఆర్‌సీ(రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్) సదరు మహిళా రైతు పేరుమీదే ఉండాలనే నిబంధన పెట్టారు. సంబంధిత క్లస్టర్లలో ఉన్న ఏఈవోలకు దరఖాస్తులు సమర్పించాలని, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### ఇవీ నిబంధనలు..

ఒక లక్ష కంటే ఎక్కువ విలువ ఉన్న పనిముట్లు తీసుకోవాలంటే కనీసం ఒక ఎకరం భూమి కలిగి ఉండాలి. కస్టమ్ హైరింగ్ సెంటర్లు, కిసాన్ డ్రోన్లు మంజూరు చేయటానికి మాత్రం 2.5 ఎకరాల భూమి ఉండాలనే నిబంధన పెట్టారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు గడిచిన ఐదేళ్లుగా మనుగడలో ఉన్న... రైతుమిత్ర గ్రూపులు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు(జేఎల్‌జీ), స్వయం సహాయక సంఘాలకు(ఎస్‌హెచ్‌జీ) అవకాశం ఇచ్చారు. నెల రోజుల్లో ఈ పథకాన్ని అమలుచేసేలా షెడ్యూలు ప్రకటించారు.

## శిక్ష పూర్తయినా ఇంకా జైళ్లలోనే ఉన్నారా?

» అలాంటి ఖైదీలను గుర్తించి వెంటనే విడుదల చేయండి
» రాష్ట్రాల హోం కార్యదర్శులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: శిక్షాకాలం పూర్తయినా ఇంకా జైళ్లలోనే ఉన్న ఖైదీలను గుర్తించి వెంటనే విడుదల చేయాలని మంగళవారం సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల హోం కార్యదర్శులను ఆదేశించింది. దీనిని అత్యవసర విషయంగా పరిగణించాలని సూచించింది. ఇతర కేసుల్లో వారి అవసరంలేదని భావిస్తే అలాంటి ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.జగన్నాథన్‌ల ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. హత్య కేసులో ముద్దాయి అయిన సుఖదేవ్ యాదవ్ అలియాస్ పహిల్వాన్‌కు 2002లో 20 ఏళ్ల శిక్ష పడింది. శిక్షాకాలం మార్చి 9న ముగియగా ఇంతవరకు విడుదల చేయలేదు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం అతడిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని జాతీయ న్యాయ సేవా సంస్థకు సూచించింది.

## ముస్లింల విడాకులకు నోటి మాట చాలు

» లిఖితపూర్వక పత్రాలు అవసరం లేదు
» గుజరాత్ హైకోర్టు స్పష్టీకరణ

అహ్మదాబాద్, ఆగస్టు 12: ముస్లిం జంటలు 'ముబారాత్' విధానం కింద నోటి మాట ద్వారా విడాకులు తీసుకోవచ్చని గుజరాత్ హైకోర్టు స్పష్టం చేసింది. విడాకులకు లిఖిత పూర్వక పత్రాలు అవసరం లేదని తెలిపింది. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నామని నోటిమాటగా చెబితే సరిపోతుందని జస్టిస్ ఎ.వై.కోగ్జే, జస్టిస్ ఎన్.ఎస్.సంజయ్ గౌడల ధర్మాసనం పేర్కొంది. లిఖిత పూర్వక అంగీకారం లేనందున విడాకులు ఇవ్వలేమంటూ రాజ్‌కోట్‌లోని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. మూడు నెలల్లోగా ముబారాత్ కింద విడాకులు మంజూరు చేయాలని ఆదేశించింది.

# కోమటిరెడ్డి కాదు కోతలరెడ్డి

## వెంకట్‌రెడ్డికి పిచ్చి లేచింది

» ఆయన మెదడూ నాలుక మధ్య కనెక్షన్ కట్ అయింది
» కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే నల్లగొండ ప్రజలే పిచ్చాసుపత్రికి పంపుతారు
» రెండేళ్లలో రోడ్లపై ఒక్క గుంత పూడ్చలేదు
» మంత్రి కోమటిరెడ్డిపై ప్రశాంత్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన పేరు కోమటి రెడ్డి కాదని కోతల రెడ్డి అని ఎద్దేవా చేశారు. మంత్రి కోమటిరెడ్డి సోమవారం సచివాలయంలో తనపై చేసిన వ్యాఖ్యలపై మంగళవారం వేముల ప్రశాంత్ రెడ్డి ప్రతిస్పందించారు. మంత్రి కోమటిరెడ్డికి పిచ్చి లేచిందని, ఆయన మెదడు-నాలుక మధ్య కనెక్షన్ కట్ కావడం వల్లే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరోజులోనే మతి, సోయి తప్పడం కోమటిరెడ్డికి అలవాటైందన్నారు. దుబాయికెళ్లి బోటులో షికారు, ఎస్ఎల్‌బీసీ పేరుతో అమెరికాకెళ్లి పార్టీలు చేసుకోవడం తప్పా.. వెంకట్ రెడ్డి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఆయన తెలివి తక్కువ తనం వల్లే ఎస్ఎల్‌బీసీ కూలిపోయిందన్న వేముల.. ఇప్పటికీ నాటి ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను బయటకు తేలేకపోయిన అసమర్థుడని ఎద్దేవా చేశారు. గత రెండేళ్లలో ఆర్ అండ్ బీ మంత్రిగా ఆయన ఒక కొత్త గుంత పూడ్చింది లేదూ ఇటుక పేర్చింది లేదన్నారు. ఉత్తి మాటలు, పిచ్చి వాగుడు తప్పితే కోమటిరెడ్డికి విషయ అవగాహన లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే నల్లగొండ ప్రజలే వెంకట్‌రెడ్డిని పిచ్చాసుపత్రికి పంపుతారని వేముల వ్యాఖ్యానించారు. ఉప్పల్- నారపల్లి ఫ్లైఓవర్ కేంద్రం పరిధిలో ఉంటుందన్న జ్ఞానం కూడా ఆయనకు లేదన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లవుతున్నా ఇంకా ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్ పని ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. అలాగే రీజనల్ రింగు రోడ్డు పనులు ఇంకా మొదలుకాలేదని, దక్షిణ భాగం విషయంలో ఒక్క అడుగూ ముందుకు పడలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై అసెంబ్లీ సాక్షిగా గతంలోనే తాను చెప్పానని, మంత్రిగా కోమటిరెడ్డి మరిచిపోతే ఎలా? అని ప్రశ్నించారు. అవసరమైతే రికార్డులు తెప్పించుకుని చూసుకోవాలని హితవు చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బకాయిలను బీఆర్ఎస్ చెల్లించిందని, ఏనాడూ వారిని దూషించలేదన్నారు. రెండేళ్లవుతున్నా ఇంకా ఎంతకాలం బీఆర్ఎస్‌పై మాట్లాడుతారన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం చేతకాకపోతే, మంత్రి పదవి నుండి తప్పుకోవాలని వేముల ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా!

» అక్రమంగా హైదరాబాద్‌కు తరలింపు
» ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి
» పెద్దపల్లి జిల్లాలో కరువైన నిఘా


రామగుండంలో రాత్రి వేళ ఇసుక డంప్ వద్ద ఉన్న లారీ

పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా కరువైంది. మానేరు, గోదావరి నదుల నుంచి జిల్లా అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించగా, దీనిని ఆసరాగా చేసుకొని కొందరు అక్రమార్కులు పెద్ద ఎత్తున రాత్రి వేళల్లో హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుకను తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా దందా కొనసాగుతోంది. జిల్లాలోని గోదావరి, మానేరు, హుస్సేనిమియా వాగుల నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను, తద్వారా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు 2017లో అప్పటి జిల్లా కలెక్టర్ ఆళగు వర్షిణి శాండ్ ట్యాక్సీ విధానాన్ని తీసుకొచ్చారు. ఇంటి నిర్మాణాల కోసం ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత నగదు చెల్లించి బుకింగ్ చేసుకున్న 24 గంటల్లో సంబంధిత ప్రదేశానికి ఇసుక సరఫరా అయ్యేలా పాలసీని రూపొందించారు. ఈ విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు, ట్రాక్టర్ల యజమానులకు, కూలీలకు, పాలసీ అమలు కోసం పని చేస్తున్న సిబ్బందికి ఉపాధి లభించింది. ఎవరి నుంచి వేధింపులు లేకుండా ఇల్లు నిర్మించుకునే యజమానులకు ఇసుక లభించింది. అయితే 2021లో మానేరు నదిపై టీఎస్ఎండీసీ ఇసుక క్వారీలను ఏర్పాటు చేయడంతో శాండ్ ట్యాక్సీ పాలసీ బలహీన పడింది. స్థానిక ఎమ్మెల్యే జిల్లా అవసరాలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి వారిని ఒప్పించారు. దీంతో శాండ్ టాక్సీ పాలసీ నిలిచిపోయింది. మానేరు నదిపై టీఎస్ఎండీసీ ఇసుక క్వారీలు నడవపోవడం, హైదరాబాద్‌లో ఇసుక డిమాండ్ పెరగడాన్ని గమనించిన కొందరు నాయకులు ట్రాక్టర్ల ద్వారా పొద్దంతా గోదావరి, మానేరు నదుల ద్వారా ఇసుకను తీసుకొచ్చి రహస్యంగా ఏర్పాటు చేసిన డంపుల వద్ద నిల్వ చేసి రాత్రి వేళల్లో హైదరాబాద్‌కు లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో లారీలో దాని సామర్థ్యాన్ని బట్టి 30 నుంచి 40 టన్నుల వరకు తీసుకు వెళుతున్నారు. ఒక్కో లారీ ఇసుకకు రూ. 50 వేల నుంచి 60 వేల వరకు విక్రయిస్తున్నారు. టీఎస్ఎండీసీ ద్వారా తీసుకెళితే టన్ను ఇసుక రూ. 350 వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇది ఇప్పుడు రాకపోవడంతో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ట్రాక్టర్లలో ఇసుక ఎక్కడికి వెళుతోంది, ఎక్కడ డంపులను ఏర్పాటు చేసి తరలిస్తున్నారనే విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల జిల్లాలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు రావడంతో ఇటీవల రామగుండం ప్రాంతంలో ఐదు ఇసుక డంపులు, మంథని ప్రాంతంలో మూడు, శ్రీరాంపూర్, రామగిరి, ధర్మారం మండలాల్లో ఒక్కో అక్రమ ఇసుక డంప్‌ను గుర్తించి అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయినా కూడా ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెంచడంతో పాటు శాండ్ ట్యాక్సీ విధానాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## కార్పొరేట్ అనుకూల విధానాలను తిప్పికొట్టాలి

» ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, మేధావులపై ఉందని ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలను తిప్పికొట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్‌టీఎఫ్ఐ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పతాకావిష్కరణ కార్యక్రమంలో రవి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుండగా, కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు పాఠశాలలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం వంటి చర్యల ద్వారా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.

## వెంకటరెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

» ఉమ్మడి నల్లగొండ మంత్రులిద్దరూ దద్దమ్మలు : జగదీశ్ రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని తక్షణం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. వెంకటరెడ్డి సోయిలేకుండా మాట్లాడుతున్నారని, ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలడానికి మాజీ సీఎం కేసీఆర్ క్షుద్రపూజలు చేయించారంటూ పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నల్లగొండలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులూ జిల్లాకు సాగునీరివ్వలేని దద్దమ్మలు. వీళ్లకి జిల్లాపైనా, రైతులపైనా చిత్తశుద్ధి లేదు. ఏపీకి నీరొదలాలన్న ఆత్రుతే తప్ప, రైతులకు నీరివ్వాలనే తపన వీరికి లేదు' అని వ్యాఖ్యానించారు. హెలికాప్టర్ల ఆరాటాలు, కమీషన్ల దందాలు తప్ప రైతుల పట్ల వారికి ప్రేమలేదని విమర్శించారు. మరోవైపున గోదావరి జలాలను ఏపీకి కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

## 'ధిక్కారం'పై బెంగాల్ సీఎస్‌కు ఈసీ పిలుపు!

కోల్‌కతా, ఆగస్టు 12: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌కు ఎన్నికల కమిషన్ (ఈసీ) నుంచి పిలుపు వచ్చింది. కొందరు అధికారులపై చర్యల విషయంలో ఈసీ ఆదేశాలను అమలు చేయబోమని మమతా బెనర్జీ ప్రభుత్వం లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ నిర్ణయానికి కారణాలను స్వయంగా వివరించాలని ఈసీ సీఎస్‌ను ఆదేశించింది. బుధవారం 5 గంటల్లోపు నిర్వాచన్ సదన్‌కు వచ్చి కలవాలని పేర్కొంది. రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలకు పాల్పడ్డారన్న అభియోగంపై ఐదుగురు అధికారులను సస్పెండ్ చేసి, వారిపై కేసు నమోదు చేయాలని ఇటీవల ఈసీ ఆదేశించింది. దీనికి మమత సర్కారు నిరాకరించింది. సస్పెన్షన్లు, కేసులు పెట్టడం చాలా కఠినమైన చర్య అవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా అధికారుల్లో స్థైర్యాన్ని దెబ్బ తీస్తుందని ఈసీకి రాసిన లేఖలో స్పష్టం చేసింది. ఆ ఐదుగురు అధికారుల్లో ఇద్దర్ని ప్రస్తుతానికి ఎన్నికల విధుల నుంచి దూరంగా ఉంచుతామని, అంతర్గత విచారణ నిర్వహిస్తామని తెలిపింది. మిగతా ముగ్గురి గురించి మాత్రం ప్రస్తావించలేదు. ఈ విషయంలో సీఎం మమతా బెనర్జీ ఈసీపై బాహాటంగానే ధ్వజమెత్తారు. ఈసీ అధికార పరిధినీ ప్రశ్నించారు. రాష్ట్ర అధికారులను భయపెట్టడానికి బీజేపీ.. ఈసీని వాడుకుంటోందని ఓ బహిరంగ సభలో ఆరోపించారు.


**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
డివిజనల్ ఇంజనీర్ (ELEC)-I, తితిదే, తిరుపతి
ఇ-వేలం ప్రకటన ID No.25209

తిరుపతి, TTD Ad బిల్డింగ్ ఎదురుగా, TTD ప్రెస్ సమీపాన, DPW స్టోర్స్ (Elec) వద్ద ఉన్నట్టి అన్‌సర్వీసబుల్ BC/SC ల్యాంప్స్, M.S./G.I పైప్స్, స్విచ్‌లు, సాకెట్లు, వాటర్ హీటర్లు, స్టార్టర్లు & LED స్ట్రీట్ లైట్ వగైరా డిస్పోజల్ స్క్రాప్/సూప్లస్ మెటీరియల్స్ మొత్తం 04 (నాలుగు) లాట్లలో స్క్రాప్ ఎలక్ట్రికల్ మెటీరియల్స్ https://konugolu.ap.gov.in ద్వారా 29-08-2025న నిర్వహించబడు ఇ-వేలం ద్వారా విక్రయించబడును. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 9849575960, 9959988454, 9491454257.
TTD-40021/10/2025-PRO SEC (Adv. No.171). Dt. 12-08-2025 కార్యనిర్వహణాధికారి

**దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్**
టెండరు ప్రకటన నం. P-03/25-26 of DE/OP/SURYAPET
సూర్యాపేట ఆపరేషన్ డివిజన్‌లో వివిధ ఎలక్ట్రికల్ పనులకు అర్హులైన విక్రేతల నుండి టెండర్లు కోరబడుచున్నవి. వివరాలు www.tgsouthernpower.com లో లభించును. ఫోన్.నం.: 8712473066, ఆఖరి తేది: 21.08.2025
సం/- డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్, సూర్యాపేట
DIPR RO No:6370-PP/CL/ADVT/1/2025-26, Dt:12.08.2025

**తెలంగాణ ప్రభుత్వం**
**పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ**
ప్రాంతీయ అధికారి కార్యాలయం, పిఆర్ రీజియన్: నిజామాబాద్
NIT No. 241 to 450/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన తేది:12.08.2025
మొత్తం పనుల సంఖ్య: (10 నం.లు), పనుల పేరు: నిజామాబాద్ మరియు కామారెడ్డి జిల్లాల్లో i) TUFIDC క్రింద డ్రైయిన్ల మరియు భవన పని, BT/CC రోడ్ల వేయుట, ii) MRR గ్రాంట్ క్రింద BT రోడ్ల పునరుద్ధరణ, iii) SBM (G) క్రింద ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు, iv) 15వ FC గ్రాంట్ క్రింద హెల్త్ సబ్ సెంటర్లు, v) CRR SCP గ్రాంట్ క్రింద CC రోడ్లు మరియు డ్రైయిన్ల నిర్మాణం. దిగువ సంతకందారు పై పనుల కొరకు టెండర్లు కోరుచున్నారు. మొత్తం ECV: రూ.2915.00 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూల్‌లను 13.08.2025న ఉ.10.30 గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు ఆఖరి తేది వచ్చి ప్రతి NIT ఆన్‌లైన్‌లో ప్రచురించబడిన తేదినుండి (7) పని దినాలు. అన్ని తదుపరి వివరాలను ఆన్‌లైన్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- ప్రాంతీయ అధికారి, PRED, నిజామాబాద్
DIPR RO.No 6366-PP/CL/ADVT/1/2025-26 తేది.12.08.2025

**వరంగల్ మహానగర పాలక సంస్థ**
టెండరు ప్రకటన
No.TP/GWMC/RFP 1/e-procurement/2025-26 తేది:12.08.2025
PPP విధానంపై వరంగల్‌లో భూభాగాల (3 ఆస్తులు) అభివృద్ధి కోసం ట్రాన్సాక్షన్ అడ్వైజరి సర్వీసెస్ అందించడానికి కన్సల్టెంట్ ఎంపిక. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 14.08.2025న ఉ.10.00 గం.ల నుండి, ప్రీ బిడ్ సమావేశం తేది: 19.08.2025న మ..03.00 గం.లకు, O/o GWMC, వరంగల్. బిడ్ల స్వీకరణ ఆఖరి తేది: 03.09.2025న సా.05.00 గం.ల వరకు. గమనిక: తదుపరి వివరాలను "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- కమిషనర్, వరంగల్ మహానగర పాలక సంస్థ
DIPR RO No.6398-PP/CL/ADVT/1/2025-26, Dt.12.08.2025

**పురపాలక సంఘ కార్యాలయం, బోధన్**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
Lr.No.E1/117/Aug/2025 తేది: 12.08.2025
బోధన్ పట్టణంలో వివిధ గ్రాంట్ల క్రింద ప్రతిపాదించబడినట్టి 08 నంబర్ల పనుల కొరకు టెండర్లు కోరబడుతున్నవి. పని మొత్తం అంచనావ్యయం: రూ.27.60 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేది 12.08.2025. బిడ్ దాఖలు ముగింపు తేది: 18.08.2025. తదుపరి వివరాల కొరకు మమ్మల్ని దర్శించగలరు. తదుపరి వివరాల కొరకు బోధన్ పురపాలక సంఘంలోని ఇంజినీరింగ్ సెక్షన్‌ను సంప్రదించగలరు.
ఇమెయిల్ ఐడి: mplcommissioner_bodhan@yahoo.com
https://tender.telangana.gov.in
కమిషనర్, పురపాలక సంఘం, బోధన్.
DIPR R.O.No.6400-PP/CL/ADVT/1/2025-26, Dt.12.08.2025

తెలంగాణ ప్రభుత్వం
**కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**
Rc.No.AC(R), BDD-SPL/Tender-2025 Dt.12.08.2025
టెండర్ ప్రకటన
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ సొసైటీల (TGSWRIES, TGMREIS, MJPT-BCWREIS, TGTWREIS, TREIS) ఆధ్వర్యంలో నడుపబడుచున్న రెసిడెన్షియల్ పాఠశాల / కళాశాలకు ఫుడ్ ప్రొవిజన్స్ (Dietary Items) (జిల్లా యూనిట్‌గా) (కూరగాయలు & పండ్లు / మటన్ (మేకపోతు) & Skinless చికెన్ (బాయిలర్)(మండల యూనిట్) మరియు క్యాటరింగ్ కాంట్రాక్ట్ (Catering Contract) జిల్లా కొనుగోలు కమిటీ నిర్ణయించిన ధరలకు (వివరాలను టెండర్ షెడ్యూల్ నందు చూడగలరు) సరఫరా చేయుటకు ఆసక్తి గల యజమానుల నుండి టెండర్లు కోరడమైనది. పూర్తి స్థాయి టెండర్ వివరాలకు గాను అదనపు కలెక్టర్, (రెవిన్యూ), భద్రాద్రి కొత్తగూడెం, రూమ్ నెం.18 నందు సంప్రదించగలరు. టెండర్ ఫామ్ ఫీజు రూ.2500 (రెండు వేల ఐదు వందల రూపాయలు) మరియు ఇ.యం.డి.(5% టెండర్ వాల్యూపైన) ...
నోట్: 1. కేటరింగ్ సేవల కొరకు EMD రూ.75,000.00 (for each institute)
2. ఆహార పదార్థాలు సరఫరా కొరకు EMD టెండర్ విలువలో 5% ...

| క్ర.సం. సంఖ్య | కార్యాచరణ | తేది |
|---|---|---|
| 1 | 1. ఆహార పదార్థాలు టెండర్ పత్రాలను (టెండర్ ఫామ్ ఫీజు రూ.5000 (ఐదు వేల రూపాయలు) 2. కూరగాయలు మరియు పండ్లు టెండర్ పత్రాలను (టెండర్ ఫామ్ ఫీజు రూ.2500 (రెండువేల ఐదు వందల రూపాయలు) 3. చికెన్ మరియు మటన్ (మేక పోతు) టెండర్ పత్రాలను (టెండర్ ఫామ్ ఫీజు రూ.2500 (రెండు వేల ఐదు వందల రూపాయలు) 4. కేటరింగ్ మరియు కాంట్రాక్టు టెండర్ పత్రాలను (టెండర్ ఫామ్ ఫీజు రూ.2500 (రెండు వేల ఐదు వందల రూపాయలు). ... IDOC రూమ్ నెం.18) నందు పంపిణీ ... టెండర్ ప్రారంభపు తేది | 13.08.2025 at 11.00 AM |
| 2 | సంబంధిత పత్రాలతో నింపిన టెండర్ ఫారాలను (అదనపు కలెక్టర్ (రెవిన్యూ), భద్రాద్రి కొత్తగూడెం, IDOC రూమ్ నెం.18) నందు సమర్పించుటకు చివరి తేది | 23.08.2025 సా.5 గం.వరకు |
| 3 | జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా టెండర్ పత్రాల ఓపెన్ చేయుట మరియు ధృవీకరణ | 25.08.2025 |
| 4 | అర్హత కలిగిన ఏజెన్సీల టెండరుల ప్రచురణ | 26.08.2025 |
| 5 | విజయవంతమైన టెండరుదారులకు వర్క్ ఆర్డర్ జారీ | 28.08.2025 |
| 6 | క్యాటరింగ్ కాంట్రాక్ట్ ప్రారంభమవుతుంది. | 01.09.2025 |
| 7 | ఆహార ఫుడ్ ప్రొవిజన్స్ (Dietary items) కూరగాయలు & పండ్లు / మటన్ & చికెన్ సరఫరా ప్రారంభమవుతుంది. | 15.09.2025 |

గమనిక: పైన పేర్కొన్న తేదీలు, టెండర్ విధి విధానాలు, షరతులు అన్ని విషయాల్లో మార్పులు చేసే అధికారం మరియు పూర్తిగా రద్దుపరిచి తదుపరి నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్ / చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, భద్రాద్రి కొత్తగూడెం వారికి కలదు. ఈ విషయాలలో ఎటువంటి వాదోపవాదాలకు తావులేదు.
సం/- అదనపు కలెక్టర్ / వైస్ చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
DIPR R.O.No.6406-PP/CL/ADVT/1/2025-26, Dt.12.08.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# 'రణ'గొణ ధ్వనులు

చివరకు బెనజీర్ భుట్టో ముద్దుల కొడుకు కూడా మనని యుద్ధం పేరిట బెదిరిస్తున్నాడు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసినందుకు పాకిస్థాన్ నుంచి రణనినాదాలు బాగానే వినిపిస్తున్నాయి. ఒప్పందాన్ని నిలిపివేసి 20కోట్లమంది పాకిస్తానీయులకు దక్కాల్సిన నీటిని అడ్డుకోవడం కనుక జరిగితే, భారత్‌ను యుద్ధంలో ఓడించి, ఆరునదులనూ స్వాధీనం చేసుకోవడం వినా తమకు మరోమార్గం లేదని బిలావల్ బెదిరిస్తున్నారు. యుద్ధం వస్తేగిస్తే పాక్ తలవంచదనీ, ప్రతీ పౌరుడూ పోరాడతాడని ఆయన దేశభక్తియుత వ్యాఖ్యలు చాలా చేసుకున్నాడు. సింధుజలాల గురించీ, యుద్ధం గురించీ సింధ్ ప్రావిన్సులో, ఏదో సభలో, ఏదో సందర్భంలో ఈ రాజకీయనాయకుడు ఏమి మాట్లాడినా, ఎంతకాలు దువ్వినా మనకు పోయేదేమీ లేదు. ఆ వ్యర్థప్రలాపనలకు అంత విలువేమీ ఉండదు. కానీ, దీనికి ముందురోజు, ఇంతకుమించిన ఉన్మాదంతో ఊగిపోతూ, ఏకంగా అణుయుద్ధం హెచ్చరికలే చేస్తూ భారత్‌ను పాక్ సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ బెదిరించడం తేలికగా తీసిపారేయగలిగేది కాదు. మునీర్ ఏం మాట్లాడారన్న కంటే, ఆయన ఎక్కడ నిలబడి ఆ మాటలన్నాడన్నది ముఖ్యం. ఒక కాలమిస్టు వ్యాఖ్యానించినట్టుగా ట్రంప్ కాంపౌండ్‌లో నుంచి ఆయన మొరిగాడు. యజమాని పక్కన ఉన్నప్పుడు పెంపుడుజీవులకు ఎక్కడ లేని ధైర్యమూ వస్తుంది. విశ్వాస ప్రదర్శన వీరంగాల స్థాయిలో సాగుతుంది.

అన్నం పెట్టినవాడు, ఎర్రతివాచీ పరిచి ఆతిథ్యమిచ్చినవాడు పక్కనే ఉన్నాడన్న ధైర్యం కాబోలు, మునీర్ ఏకంగా అణ్వాయుధ ప్రయోగం గురించి మాట్లాడాడు. ఆనకట్టలతో సింధుజలాలను అడ్డితే వాటిని పేల్చేస్తాం, కూల్చేస్తామన్న హెచ్చరికలతో ఆయన సరిపెట్టలేదు. తమ ఉనికికి ప్రమాదం వాటిల్లిన పక్షంలో కేవలం భారత్‌నే కాక, సగం ప్రపంచాన్ని తమతో తీసుకుపోతామని కూడా ఆయన బెదిరించాడు. ఫ్లోరిడాలో ఆయన చేసిన ప్రసంగం మొత్తం పాకిస్తానీ సైనికమీడియా విభాగం నుంచి వెలుగుచూడలేదు కానీ, ఆయన ఈ ప్రసంగంలో భారతదేశాన్ని ఆర్థికంగానూ, అణ్వాయుధాలతోనూ ధ్వంసం చేస్తామని గట్టిగానే బెదిరించాడు. భారతదేశం ఎదగకుండా పాకిస్థాన్ ఏమి చేయగలదో, ఎలా అడ్డుపడగలదో, గతంలో ఏం జరిగిందో కూడా ఆయన పరోక్షంగా చెప్పాడు.

ఆపరేషన్ సిందూర్ తరువాత ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి లభించిన ఆసిమ్‌మునీర్ తన వీరత్వాన్ని ప్రదర్శించడానికీ, ఆ ఉన్నత స్థానాన్ని పదిలపరుచుకోవడానికీ ఈ విధంగా మాట్లాడటం అవసరమని అనుకోవచ్చు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం బలహీనమైనది కావడం, తన దయాదాక్షిణ్యాలమీద ఆధారపడివుండటం కూడా మునీర్ అహంకారానికి కారణం. పాకిస్థాన్‌లో పౌరప్రభుత్వాల మీద సైన్యం పెత్తనం అనాదిగా ఉన్నదే కానీ, ప్రజామోదం విస్తృతంగా ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌ను జైల్లోకి నెట్టి, ఆయన పదవిలోకి రాకుండా అడ్డుపడి, కాళ్ళబేరానికి వచ్చిన షరీఫ్ సోదరులను గద్దెనెక్కించిన సైన్యానికి ఈ మారు తిరుగేలేదు. కశ్మీర్‌ను పాక్ ప్రాణాన్ని నిలబెట్టే కంఠసిరగా అభివర్ణించిన వారంలోనే పహల్గాం దాడి జరిగింది. పాక్ సైన్యానికీ, ఉగ్రవాదులకు మధ్య ఉన్న అనుబంధం తెలిసిందే కనుక, ఆ సందేశంతోనే ఆదేశాలు వెళ్ళాయని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఇప్పుడు ఫ్లోరిడా సభలో కూడా మునీర్ మళ్ళీ కశ్మీర్ ఊసును అదేరీతిలో ప్రస్తావించినందున విశ్లేషకులు దీనిని మరింత ప్రమాదకరమైన హెచ్చరికగా చూస్తున్నారు. పాక్ ఉడుత ఊపులకూ, అణు బెదిరింపులకూ భారతదేశం బెదరదని ఆపరేషన్ సిందూర్ స్పష్టంచేసింది. ఇప్పుడు కూడా మునీర్ అణు హెచ్చరికలకు జడిసేది లేదనీ, దేశభద్రతలో తగ్గేది లేదని చెబుతూనే, స్వయంగా పాక్ సైన్యాధ్యక్షుడు చేసిన ఈ వ్యాఖ్యలను బట్టి అత్యంత ప్రమాదకరమైన అణ్వస్త్రాలు ఒక ధూర్తరాజ్యం చేతిలో ఉన్న విషయాన్ని మిగతా ప్రపంచం ఇప్పటికైనా గుర్తించాలని కోరింది. రెండోసారి అమెరికాలో కాలూనగానే, భారతదేశాన్ని అణ్వాయుధాలతో నాశనం చేస్తానని పాక్ సైన్యాధ్యక్షుడు అక్కడ నిల్చొని మరీ బెదిరించగలిగాడు. మోదీ–ట్రంప్ మధ్య చెడిన స్నేహం, పాక్–అమెరికా మధ్య పెరిగిన సాన్నిహిత్యం, ట్రంప్ కుటుంబంతో వాణిజ్యం మునీర్‌కు శక్తినిచ్చాయి. ట్రంప్ ప్రేమలు ఎంతోకాలం కొనసాగవన్నది అటుంచితే, నోబెల్ శాంతికోసం అర్రులు చాస్తున్న ఆయన మునీర్‌కు ముకుతాడు వేస్తే బాగుంటుంది.

# నైతిక రాజకీయాలు ఎండమావులేనా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'ప్రతిపక్షాలకు ప్రజాస్వామిక సంస్థలంటే విశ్వాసం లేదు. పార్లమెంటు సమావేశాలు కొనసాగించడం వారికి ఇష్టం లేదు. పార్లమెంటు ముఖ్యమైన సమయాన్ని ప్రతి రోజూ వృథా చేయడాన్ని మేము ఇక అనుమతించబోం.. ముఖ్యమైన బిల్లులను ఆమోదించి తీరుతాం..' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. సోమ, మంగళవారాల్లో పార్లమెంటు పెద్దగా చర్చ లేకుండా దాదాపు పది బిల్లులను ఆమోదించింది. జూలై 21న ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు ప్రతిపక్షాల నిరసన ధ్వనుల మధ్య ఒకటి రెండు రోజులు తప్ప పెద్దగా సాగలేదు.

ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చ జరిపించడం ఏ ప్రభుత్వానికీ ఇష్టం ఉండదు. గతంలో కూడా బోఫోర్స్ నుంచి 2జీ వరకు అనేక కుంభకోణాలపై ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించాయి. రోజుల తరబడి పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగించాయి. 'ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించనప్పుడు పార్లమెంటుకు అంతరాయం కలిగించడం ప్రతిపక్షాల చట్టబద్ధమైన హక్కు' అని యూపీఏ హయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్న అరుణ్ జైట్లీ అన్నారు. 'పార్లమెంటును సాగనివ్వకపోవడం కూడా ప్రజాస్వామ్యంలో భాగమే' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సుష్మా స్వరాజ్ కూడా చెప్పారు.


పార్లమెంటు సమావేశాలు ఒకప్పుడు ఎంతో ఆసక్తి కలిగించేవి. అటల్ బిహారీ వాజపేయి, ఇంద్రజిత్ గుప్తా, చంద్రశేఖర్, సోమనాథ్ ఛటర్జీ లాంటి వారు మాట్లాడుతుంటే మీడియా గ్యాలరీలతో పాటు అతిథుల గ్యాలరీలు కూడా కిక్కిరిసిపోయేవి. కానీ ఇప్పుడు గ్యాలరీలేకాదు సభలు కూడా వెలవెలబోతున్నాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై తప్ప ఏ అంశం పైనా చర్చ జరగలేదు. ఈ చర్చలో కూడా ప్రతిపక్ష నేతలు ఆవేశంతో ప్రశ్నలు వేసినప్పటికీ అన్నీ ఒకే మాదిరిగా ఉన్నాయి. ఆ ప్రశ్నలకు కూడా సరైన సమాధానాలు రాలేదు. భారత సైనిక దళాలు వీరోచితంగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంటులో ప్రభుత్వం ఏ జవాబు చెబుతుందా అని ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా ఎదురు చూశారు. కానీ రెండు రోజుల సుదీర్ఘ చర్చ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుదీర్ఘ ప్రసంగం తర్వాత కూడా అనేక ప్రశ్నలకు జవాబులు లభించకుండా మిగిలిపోయాయి. ముఖ్యంగా పహల్గామ్ సంఘటనకు దారి తీసిన భద్రతా వైఫల్యం నుంచి ఆపరేషన్ ఉన్నట్లుండి 88 గంటల్లో ముగిసిన తీరు, భారత్ పాక్‌కు బుద్ధి చెప్పే పరిస్థితుల్లో ఉన్నప్పటికీ కాల్పుల విరమణకు అంగీకరించడం, పాక్ పట్ల అమెరికా స్నేహంగా వ్యవహరించడం, సంఘటనకు కారకులైన ఉగ్రవాదుల ఆచూకీ, విదేశాంగ విధానం గురించి ప్రజల్లోను, ప్రతిపక్షాల్లోనూ ఉన్న ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు రాలేదు. అధికార పార్టీ నేతలు ఇచ్చిన ప్రసంగాల్లో పహల్గామ్ కంటే నెహ్రూ, ఇందిరాగాంధీ పేర్లే అనేకసార్లు దొర్లాయి. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో చాలా పొరపాట్లు జరిగి ఉండవచ్చు కానీ వాటినే చర్విత చర్వణం చేయడం వల్ల సాధించేదేముంటుంది?

పహల్గామ్ సంఘటన సరే, బిహార్‌లో ఎస్‌ఐఆర్ పేరిట జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ గురించి ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నప్పటికీ దానిపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఎస్‌ఐఆర్‌పై గందరగోళం జరుగుతున్న సమయంలోనే ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటకలో ఒక అసెంబ్లీ నియోజకవర్గం లోనే లక్షకు పైగా బోగస్ ఓట్ల పోలింగ్ జరిగిందని ఆయన సాక్ష్యాధారాలతో బయటపెట్టారు. దేశంలో ఎన్నికల కమిషన్ బీజేపీని గెలిపించేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఓట్ల చోరీ జరుగుతోందనే అభిప్రాయాన్ని ఆయన ప్రజల్లో బలంగా ఏర్పరిచేందుకు ప్రయత్నించారు. ఎస్‌ఐఆర్ పైనే కాదు, ఓట్ల చోరీపై కూడా ఉభయ సభల్లో ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టి చర్చను డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను తిప్పిగొట్టగలమన్న విశ్వాసం ఉంటే ఏ ఒక్క అంశంపైనైనా చర్చకు అంగీకరించి ప్రభుత్వం వారి ఆరోపణలు తప్పని చెప్పేందుకు ఆస్కారం ఉన్నది.

నిజానికి ఓట్లను తొలగించడం, బోగస్ ఓటర్లను చేర్చడం అనేది ఎన్నికల వ్యవస్థకు చెదలు పట్టేలా చేస్తోంది. 'నా నియోజకవర్గంలో కూడా 3.5 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. మా బంధువుల ఓట్లు కూడా లేకుండా పోయాయి' అని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సైతం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తన కొడంగల్ నియోజకవర్గంలో 15వేల ఓట్లు గల్లంతైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వీటిపై ప్రభుత్వం పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం తెచ్చేందుకు ప్రయత్నిస్తే కాదనేవారెవరు ఉన్నారు? అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశంలో కూడా కెన్యా, మొజాంబిక్ లాంటి దేశాల్లో లాగా అక్రమాలు చేసి ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారనే అభిప్రాయం ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడడం మంచిదా?

పార్లమెంటును సాగనివ్వకపోవడం వల్ల ప్రతిపక్షాలకు ప్రయోజనం లభిస్తుందా? చాలాసార్లు లభించకపోవచ్చు. కానీ ప్రభుత్వం కీలకమైన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు నిరాకరిస్తున్నదని ప్రజలు భావిస్తే ప్రతిపక్షాల ప్రశ్నలకు కూడా ఆమోదయోగ్యత లభిస్తుంది. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలు ప్రజల్లో కూడా కలిగితే పార్లమెంటును వాయిదా వేసినా ప్రభుత్వం ప్రజా కోర్టులో జవాబుచెప్పలేని పరిస్థితిలో పడుతుంది. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు పార్లమెంటులో ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలను జైలులో నిర్బంధించారు. కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. గతంలో బోఫోర్స్ విషయంలోను, 2జీ కుంభకోణం విషయంలోనూ పార్లమెంటులో ప్రభుత్వం జవాబులు చెప్పకుండా తప్పించుకుని ఉండవచ్చు. కానీ ప్రజలు జవాబుదారీ ప్రభుత్వాన్ని ఆశించినందువల్ల నరేంద్రమోదీ ప్రభుత్వానికి పట్టం కట్టారు.

ప్రస్తుతం దేశంలో ఆ పరిస్థితి ఏర్పడుతోందా? అని చెప్పడం కష్టం. ప్రభుత్వం కానీ వ్యవస్థలు కానీ జవాబులు చెప్పలేని పరిస్థితిలో పడుతోందని మాత్రం అనిపిస్తోంది.




> నిజానికి ఓట్లను తొలగించడం, బోగస్ ఓటర్లను చేర్చడం అనేది ఎన్నికల వ్యవస్థకు చెదలు పట్టేలా చేస్తోంది. తమ నియోజకవర్గాలలోను ఓట్లు గల్లంతయ్యాయని కేంద్రమంత్రి నితిన్ గడ్కరి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం అన్నారు. ఈ అవకతవకలపై పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణల విషయమై విపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ఎవరు కాదంటారు? అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశంలోనూ కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో లాగా అక్రమాలు చేసి ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారనే అభిప్రాయం ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడడం మంచిదా?

నిజానికి పార్లమెంటు కంటే బయట జరుగుతున్న పరిణామాలు చాలా ఆసక్తి కలిగిస్తాయి. ప్రతిరోజూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలు, ఎన్నికల కమిషన్‌కు ఊరేగింపుగా వెళ్ళి అనేకమంది అరెస్టు కావడం వంటి సంఘటనలు ఒక ఎత్తు అయితే రాహుల్ నివాసంలో జరిగిన విందుకు మొత్తం ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు అందరూ హాజరు కావడం మరొక ఎత్తు. దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ సంఘటితం కావడమే కాదు, రాహుల్ వారి నేతగా ఆవిర్భవించడం భారత రాజకీయాల్లో జరిగిన కీలక పరిణామం. ఇటీవలి కాలం వరకూ రాహుల్ నాయకత్వంపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. ఇప్పుడు ఆ ప్రశ్నలు చెరిగిపోతున్నాయి. అయితే అంత మాత్రాన రాహుల్ మోదీకి ప్రత్యామ్నాయ నేతగా మారారా అన్నది ఇప్పుడే చెప్పడం కష్టం. సార్వత్రిక ఎన్నికలు ఇప్పట్లో లేవు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే బిహార్ ఎన్నికల్లో సంఘటితంగా పోరాడినప్పటికీ అధికారంలోకి రాగలరా అన్న విషయం కూడా ఇప్పుడే చెప్పలేం. అక్కడ ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ, చిరాగ్ పాశ్వాన్ లోక్‌జనశక్తికి వస్తున్న ప్రతిస్పందన ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు. బిహార్ మాత్రమే కాదు వచ్చే ఏడాది జరిగే తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమబెంగాల్ ఎన్నికలు ప్రతిపక్షాల సత్తాకు ఒక అగ్నిపరీక్ష. రాహుల్, ఆయన మిత్రపక్షాలు సంఘటితంగా సార్వత్రిక ఎన్నికల వరకూ నిలదొక్కుకునేందుకు ఎంతో పోరాడాల్సిన అవసరం ఉన్నది. ఈ లోపు ఆయన లేవనెత్తుతున్న ఎన్నికల అక్రమాలపై ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా తన వైపునకు తిప్పుకోగలరా అన్నది వేచి చూడాలి.

రాహుల్, ఆయన మిత్రపక్షాలు చేయాల్సింది దీర్ఘకాలిక పోరాటమైనా అది నరేంద్రమోదీ పైనే. అయితే నరేంద్రమోదీ కేవలం రాహుల్ సేనను మాత్రమే కాదు. ఇంటా, బయటా, ఇతరత్రా కూడా ఎన్నో రకాలుగా పోరాడాల్సి ఉన్నది. పార్లమెంటులో ప్రశ్నల్ని తప్పించుకున్నప్పటికీ ఆయన పార్లమెంటు బయట కూడా అనేక శక్తుల్ని ఎదుర్కోవాల్సి ఉన్నది. ఇప్పటి వరకూ ఆయన 'వన్ మాన్ ఆర్మీ' లాగా పోరాడారు. ఏ ఎన్నికైనా మోదీ పేరుతోనే గెలువగలమనే ధైర్యాన్ని పార్టీ నేతలకు ఇచ్చారు. కానీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ అభిప్రాయం క్రమంగా సడలిపోతోంది. ఈ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామన్న వ్యక్తి 240 సీట్లకు పరిమితమయ్యారు. మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఆ విజయాలకు పూర్తి ఘనత తనదేనన్న నమ్మకం ఆయన కలిగించలేకపోయారు. రాష్ట్రీయ స్వయం సేవక్ బీజేపీ గెలిచేందుకు గట్టి ప్రయత్నాలు చేయడం ఒక ఎత్తు అయితే ఈ గెలుపుపై అనుమానాలు రేకెత్తించడంలో ప్రతిపక్షాలు సఫలీకృతం కావడం మరొక ఎత్తు. పహల్గామ్ సంఘటన, ఆ తదనంతర పరిణామాలు, విదేశాంగ విధానంపై జరుగుతున్న చర్చలు, ట్రంప్ స్థిమితం లేనట్లుగా పాల్పడుతున్న చర్యలు ఎందుకో జాతీయ స్థాయిలో పరిస్థితి అంత సవ్యంగా లేనట్లు అభిప్రాయం కలిగిస్తోంది. 2014లో అఖండమైన విజయం సాధించి వారణాసిలో గంగాహారతిలో పాల్గొన్న మోదీకి ఇప్పటి మోదీకి మధ్య ఏదో తేడా కనిపిస్తోంది.

భారత రాజకీయాల్లో నైతికత అనేది ప్రధానం. భారతీయ ధర్మాన్ని, సంస్కృతిని పాటించేవారు ఈ నైతికతకు, సత్యశీలతకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. రాజకీయాల్లో గమ్యం మాత్రమే కాదు దారి కూడా సవ్యంగా ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# మీ గిరిజన ప్రేమలు పైపై ప్రకటనలకేనా?

బంజారాలు సింధు నాగరికత కాలం నుంచి జీవిస్తూ వస్తున్న ప్రత్యేక, ప్రాచీన గిరిజన తెగ. ఆది నుంచీ బంజారాలు స్థిర నివాసాల వైపు మొగ్గు చూపకుండా, గోవులలో సకల దేవతలు కొలువై ఉంటారని వాటిని తమ జీవనాధారంగా చేసుకున్నారు. దారులు లేని కష్టకాలంలో, తామే మార్గాలు అన్వేషించి దారులు ఏర్పరచుకుంటూ, 18 శతాబ్దం వరకు సంచారకులుగా దేశ వ్యాప్తంగా విస్తరించారు.

ప్రాంతాలవారీగా సరఫరా చేసిన ధాన్యాలు, సరుకులు, వస్తువులు, సిపాయిలకు ఆయుధాలు... తదితరాల ఆధారంగా బంజారాల పేరుకు ముందుగా సుగాలి, లంబాడీ, లాబానా, బాజీగర్, ధన్కుడి... విదేశాల్లో రోమా, జిప్సీ వంటి అనేక పేర్లు వాడుకలోకి వచ్చాయి. బలమైన బంజారాల రవాణా వ్యవస్థను ఆంగ్లేయులు ధ్వంసం చేయడంతో మైదాన ప్రాంతాలలో తండాల పేరుతో స్థిర నివాసాలకు అలవాటుపడ్డారు. వారి విలక్షణమైన సాంస్కృతిక వారసత్వ సంపద మూలాలు క్రమంగా వారి శాశ్వత సంస్కృతీ సంప్రదాయాలుగా మారి నేటికీ నిలిచి ప్రతిబింబిస్తున్నాయి.



> రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో లంబాడీల ఓట్లతోనే తాను గద్దెనెక్కానని అనేక సభలలో ప్రకటించారు. కానీ 2017లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ప్రాంతంలో హింసాత్మక ఘటనలకు కారకులైన సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్నారు. 24-7-2025న సుప్రీంకోర్టులో వీరిద్దరూ లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలంటూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారమే జరిగిందా?

బంజారా భాష అక్షరబద్ధం కాకపోవటం వల్ల బంజారాలు దేశ రక్షణ, పురోగతిలోను చేసిన ఎనలేని సేవలు, కృషి, త్యాగాలు, వారి గొప్ప ఇతిహాసం... ఇవేవీ భారత దేశ చారిత్రక గ్రంథాల్లో లిఖిత పూర్వక చరిత్రగా రాయబడలేదు. ఈ కారణంగా అవగాహన రాహిత్యంతో స్వార్థపరులు బంజారాలపై అనేక ఆరోపణలు చేస్తున్నారు.

ఈ ఆదిమ బంజారాలు భారత దేశ స్వాతంత్ర్యానికి ముందే గిరిజనులుగా గుర్తింపు పొందిన ఆధారాలు ఉన్నాయి. 1871లో బ్రిటిష్ పాలకులు అనేక తెగలతో పాటు బంజారాలను క్రిమినల్ ట్రైబల్స్ జాబితాలో చేర్చారు. 1931లో నిజాం రాజులు చేపట్టిన కులగణనలో బంజారాలను గిరిజనుల పట్టికలో చూపించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతం కలిసి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు, ఆంధ్ర ప్రాంతంలోని లంబాడీలు, సుగాలీలను భారత పార్లమెంటు ఉభయసభల ఆమోదంతో 'ద షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ లిస్ట్స్ (మోడిఫికేషన్) ఆర్డర్–1956' ప్రకారం గిరిజనులుగా గుర్తింపు పొంది, గిరిజన జాబితాలో సీరియల్ నంబర్ 19గా చేర్చబడ్డారు. అయితే ఒకే రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన లంబాడీలను గిరిజన జాబితాలో చేర్చకపోవడం కాంగ్రెస్ పార్టీ చేసిన ఘోరమైన అన్యాయం. తెలంగాణ ప్రాంత లంబాడీలు, ఇంకా ఇలాగే అన్యాయం జరిగిన ఇతర రాష్ట్రాలలోని అర్హులైన గిరిజనుల నిరంతర పోరాటం తర్వాత 1969లో అనిల్ కే చందా అధ్యక్షతన వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్ట్ ఆధారంగా నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారత పార్లమెంటు ఉభయ సభల ఆమోదంతో 'ద షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (సవరణ) యాక్ట్– 1976 (Act No. 108 of 1976)', తేదీ: సెప్టెంబర్ 19, 1976 చట్టం చేసి, తెలంగాణ ప్రాంతానికి చెందిన లంబాడీలను గిరిజన జాబితాలో క్రమ సంఖ్య 29లో చేర్చారు. 2003లో 'ద షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఆర్డర్స్ (సవరణ) యాక్ట్ 2002 (Act No.10 of 2003), తేదీ: జనవరి 7, 2003 ద్వారా బంజారా తెగను గిరిజన జాబితాలోని క్రమ సంఖ్య 29లో ఉన్న లంబాడీలు, సుగాలిల తర్వాత చేర్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం–2014, నం.6 of 2014, తేదీ: మార్చి 07, 2014, పార్ట్ XXV ద్వారా తెలంగాణలో 32 గిరిజన తెగలు మిగలగా క్రమ సంఖ్య 28లో సుగాలిలు, లంబాడీలు, బంజారాలు గిరిజనులుగా నూతనంగా ఏర్పడిన రెండు రాష్ట్రాలలో కొనసాగుతారని చెబుతూ ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

ప్రధాని మోదీ అక్టోబర్ 5, 2024న మహారాష్ట్ర, యావత్‌మాల్ జిల్లాలోని పొహ్రదేవిలో నిర్వహించిన బంజారాల విరాసత్ పరిరక్షణ సభలో పాల్గొన్నారు. శ్రీహతి రాం బావాజీ, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, వీర యోధుడు లక్కీసా బంజారాలను గిరిజనులుగా గుర్తు చేస్తూ, వేల సంవత్సరాల బంజారాల ఇతిహాసాన్ని ప్రపంచానికి చాటారు. 341 ఆర్టికల్ అనుసరించి చట్టబద్ధంగా రాజ్యాంగంలో చేరిన లంబాడీలు, సుగాలీలు, బంజారాలను గిరిజనుల జాబితాలో తాము చేర్చామంటూ జాతీయ కాంగ్రెస్ ఆనాటి నుంచీ లంబాడీల ఓట్లు పొందుతున్నది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో లంబాడీల ఓట్లతోనే తాను గద్దెనెక్కానని అనేక సభలలో ప్రకటించారు. కానీ 2017లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ప్రాంతంలో హింసాత్మక ఘటనలకు కారకులైన సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్నారు. వీరు లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని 24-7-2025న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ (నెం.40271/2025) దాఖలు చేశారు. వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారమే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారా? అన్న విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వివరణ ఇవ్వాలి. లేకపోతే, ఇటీవల లగచర్ల భూముల పేరిట లంబాడీలను లక్ష్యంగా చేసుకున్న విధానాలే కాకుండా, రాబోయే స్థానిక ఎన్నికల్లో లంబాడీల ఓట్లు పొందాలనే ఉద్దేశంతోనే భయానక వాతావరణం సృష్టించి లొంగతీసుకోవాలని కాంగ్రెస్ కుట్ర చేస్తున్నట్టు భావించాల్సి వస్తుంది.

● అజ్మీరా సీతారాం నాయక్
లోక్‌సభ మాజీ సభ్యులు, మహబూబాబాద్

# 'ప్రతిజ్ఞ' పలకటమే కాదు, పాటిద్దాం!

మనం చిన్నప్పుడు స్కూల్లో రోజూ 'భారత దేశం నా మాతృభూమి' అని ఎలుగెత్తి 'ప్రతిజ్ఞ' చేస్తామే... దాని రచయిత తెలుగువాడైన పైడిమర్రి వెంకటసుబ్బారావు అన్న సంగతి దాని రచన జరిగిన ఏభై ఏళ్ళ తర్వాత వెలుగులోకి వచ్చింది. ఆంధ్రజ్యోతిలోనే తొలిసారి 2011లో 'ప్రతిజ్ఞ పద శిల్పి పైడిమర్రి' పేరుతో ఓ వ్యాసం వచ్చింది. ఈ వ్యాసాన్ని పైడిమర్రి కుటుంబ సభ్యులు అందించిన వివరాల ఆధారంగా ఎలికట్టె శంకరరావు రాశారు. అనంతరం ఆయన జీవిత చరిత్రను యమ్. రామ్‌ప్రదీప్ రాశారు. హిందీలో ఆర్. రఘునందన్ రాశారు.

స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం వచ్చిన గీతాలలో 'ప్రతిజ్ఞ'కి అత్యంత ప్రాముఖ్యత ఉంది. నల్గొండ జిల్లాలోని అన్నేపర్తి గ్రామానికి చెందిన పైడిమర్రి వెంకట సుబ్బారావు 1962లో ప్రతిజ్ఞ రాసారు. ఆ సంవత్సరం చైనా – భారతదేశాల మధ్య యుద్ధం సందర్భంగా పౌరులలో దేశభక్తిని పెంచడానికి ఆయన ఈ 'ప్రతిజ్ఞ' రాసారు. 1965 జనవరి 26న భారత ప్రభుత్వం దానిని జాతీయ ప్రతిజ్ఞగా ఆమోదించింది. దేశభక్తి గీతాలకు, ఈ ప్రతిజ్ఞకు తేడా ఉంది. దేశభక్తి గీతాలని రాగయుక్తంగా ఆలపిస్తాం. ప్రతిజ్ఞను ఎలుగెత్తి చదువుతాం. ప్రతిజ్ఞ అంటే ఒక హామీ. కానీ ఈ ప్రతిజ్ఞ చదివిన మనలో ఎంతమంది దాన్ని పాటిస్తున్నాం! పైడిమర్రి ఆశించినట్లు కులమతాలకు అతీతంగా దేశాన్నీ, దేశ ప్రజలనీ సోదరసమానంగా ప్రేమిస్తున్నామా? ప్రతిజ్ఞని పలకటమే గాక, ఆ పదాలని పాటించినప్పుడే మన దేశం ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

– యమ్. రామ్‌ప్రదీప్
(నేడు పైడిమర్రి వర్ధంతి)

# ఇది ట్రంప్‌కు ఎదురు నిలబడాల్సిన సందర్భం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశం పట్ల అనుసరిస్తున్న రూళ్లకర్ర విధానం, పిడివాదం, మొండి వైఖరి పాలకుల విషయంలో ఏమోగానీ దేశ ప్రజలందరిలో తీవ్రమైన ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతావనిని ఇంతగా అవమానించిన నేత బహుశా ట్రంప్ తప్ప ప్రపంచంలో మరొకరు కనపడరు.

ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోవడం ఇష్టం లేక కావొచ్చు లేదా మరేదైనా కారణం కావొచ్చు– ట్రంప్ భారత్ పట్ల తన వ్యతిరేకతను బహిర్గతం చేస్తూ వస్తున్నారు. భారతీయులకు ఉద్యోగాలలో ప్రాధాన్యం ఇవ్వరాదని ఒకసారి, అసలు ఉద్యోగాలే ఇవ్వరాదని మరోసారి అమెరికన్ కంపెనీలను ట్రంప్ హెచ్చరించడం అందర్నీ విస్మయపర్చింది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు యూదుల తర్వాత భారతీయులే దన్నుగా నిలుస్తున్నారని గణాంకాలు తెలియజెపుతున్నాయి. గత అర్థశతాబ్దిపైగా, ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక భారతీయులు పెద్దసంఖ్యలో అమెరికాకు వెళ్లి అక్కడ నివాసం ఉంటున్నారు. అందులో చాలా మంది అమెరికా పౌరసత్వం లభించాక అక్కడి చట్టసభలకు ఎన్నికవుతూ అమెరికా ప్రజల గౌరవాభిమానాలు పొందుతున్నారు. అమెరికా సమాజంలో అంతగా మమేకం అయిన భారతీయుల పట్ల, భారతదేశం పట్ల ట్రంప్ చూపుతున్న వ్యతిరేకతకు ఎలాంటి హేతుబద్ధత గోచరించదు. కేవలం తొలి నుంచి రష్యాతో భారత్ స్నేహం సాగించడం ఒక్కటే కారణంగా కనిపిస్తోంది.

దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ – ఆయన ఆధ్వర్యంలో విదేశాంగశాఖ మంత్రిగా పనిచేసిన కృష్ణమీనన్ ఇరువురూ కమ్యూనిస్టులకు స్నేహితులని, వారిద్దరూ భారతదేశంలోను, అంతర్జాతీయంగా కొన్ని దేశాలలోను కమ్యూనిజం నిలదొక్కుకొనేందుకు సహకరించారనే పేరు ఉండేది. అందులో నిజం లేకపోలేదు. అగ్రరాజ్యాల కూటములలో ఎటూ చేరకుండా తటస్థ (అలీన) విధానం తమదని నెహ్రూ పదేపదే చెప్పేవారు. కానీ దేశ అవసరాల రీత్యా రష్యా నుంచి అనేక విధాలుగా సహకారం పొందడం వల్ల భారత్ పరోక్షంగా రష్యా కూటమి దేశంగానే పేరుపొందింది. అమెరికా, యూరప్ దేశాలతో వాణిజ్య, దౌత్య సంబంధాలు కొనసాగించినప్పటికీ అవి పరిమితంగానే సాగాయి. అందువల్ల ఏనాడూ అమెరికా భారత్‌ను మిత్రదేశంగా పరిగణించలేదు. పైగా, కశ్మీర్ సమస్యను కశ్మీర్ ప్రజల అభీష్టం మేరకు పరిష్కరించుకోవాలంటూ పాకిస్థాన్ వాదాన్ని అమెరికా వినిపిస్తూ వచ్చింది. ఉగ్రవాదానికి ఊతమిచ్చే పాకిస్థాన్ దుశ్చర్యలను ఏనాడూ అమెరికా నిర్ద్వంద్వంగా ఖండించలేదు. ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చింది పాకిస్థానేనని తెలిసినా అమెరికా మౌనంగా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

కాగా, సోవియెట్ యూనియన్ పతనంతో అనివార్యంగా భారత్ అమెరికా వైపు జరిగింది. అదే సమయంలో దేశ ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలో మొదలైన ఆర్థిక సంస్కరణలు నూతన ఆర్థిక విధానానికి దారితీశాయి. స్వేచ్ఛా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల అనుసంధానం పేరుతో అమెరికా విధానాలను గుడ్డిగా అనుసరించడం అప్పుడే ప్రారంభం అయ్యింది. ఆ క్రమంలోనే పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణ, సబ్సిడీలలో కోత, ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం వంటి షరతులకు తలొగ్గి ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి అమెరికా కనుసన్నలలో నడిచే ద్రవ్య సంస్థల నుంచి భారీగా రుణాలను స్వీకరించడం మొదలైంది. చివరకు అమెరికా జపించే 'ఏ సేవ కూడా ఉచితంగా ఇవ్వరాదు' అనే మంత్రం భారత్‌లో మొదలైంది. ఒక్క మాటలో చెప్పాలంటే భారత్ 1990వ దశకం నుంచి అమెరికా వెంట నడిచింది. అయితే 1998లో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రోఖ్రాన్–2 అణు పరీక్షలు నిర్వహించినపుడు దేశంపై అమెరికా ఆర్థికపరమైన ఆంక్షలు విధించింది. అమెరికా మిత్రదేశాలు కూడా కొన్ని భారత్‌పై ఆంక్షలు విధించాయి. కానీ నాటి ప్రధాని వాజపేయి అందుకు ముందుగానే సిద్ధపడ్డారు. "భారత్‌ను అణ్వాయుధ దేశంగా చేయడానికి కొన్ని త్యాగాలు చేయక తప్పదు. శత్రువుల నుంచి మమ్మల్ని మేం రక్షించుకోవడానికి ఇది అవసరం. అందువల్ల ఎవరి ఆంక్షలను లెక్కచేయం" అని స్పష్టంగా భారత్ వైఖరి తెలియజెప్పారు. వాజపేయి అనుసరించిన దృఢ వైఖరి కారణంగా అమెరికా అనతికాలంలోనే తను విధించిన ఆర్థిక ఆంక్షల్ని ఎత్తివేసి దౌత్య, వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకొంది.



> దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమెరికాతో కయ్యానికి కాలు దువ్వరాదని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అది నిజమే కావొచ్చు. కానీ, దేశాన్ని అవమానిస్తుంటే, దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకొంటుంటే, భారత్ మౌనంగా ఉండిపోవాలా? కేవలం ప్రతీకార సుంకాలను విధించి ఊరుకోవాలా? దేశ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని, అంతర్జాతీయ వాణిజ్య దౌత్య వ్యవహారాలతో స్వతంత్ర విధానాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానిదే.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఆప్తమిత్రుడనే ప్రచారం ఎంతోకాలంగా ఉంది. కానీ, "తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే" అనే ఓ ముతక సామెత మాదిరిగా ట్రంప్ వ్యవహార శైలి కొనసాగుతున్నది. భారత్ ఓ విఫల ఆర్థిక వ్యవస్థ అని ట్రంప్ నోరుపారేసుకున్నా ఆయన వ్యాఖ్యలను నేరుగా ఏ భారతీయ రాజకీయవేత్త ఖండించకపోవడం ఆశ్చర్యమే. పైగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అయితే 'ట్రంప్ చెప్పింది నిజమే కదా!' అన్నారు. ట్రంప్ ప్రకటనను రాజకీయాలకు అతీతంగా ఖండించే ఉదారత ప్రతిపక్షాలకు లోపించడం దురదృష్టకరం.

ఈ విషయాన్ని పక్కన పెడితే.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ప్రతిగా అమెరికా భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధించడం అసమంజసమే కాదు, బ్లాక్‌మెయిలింగ్ కూడా! ఇందుకు బదులుగా భారత్ కూడా ప్రతీకార సుంకాలు విధించాలంటూ కొందరు ప్రతిపాదన చేస్తున్నారు. దానివల్ల భారత్‌కు జరిగే ఆర్థిక నష్టం భర్తీ అవుతుందన్నది వారి అభిప్రాయం. నిజానికి, ఈ అంశాన్ని కేవలం ఆర్థిక కోణం నుంచి మాత్రమే చూడటం సరికాదు. ఇది దేశ సార్వభౌమత్వానికి, దేశ స్వతంత్ర స్వేచ్ఛా వాణిజ్యపు ప్రయోజనాలకు సంబంధించిన అంశం. ఇందులో తలదూర్చే సాహసం చేయడం ట్రంప్ తలపొగరు తప్ప మరొకటి కాదు.

దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమెరికాతో కయ్యానికి కాలు దువ్వరాదని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అది నిజమే కావొచ్చు. కానీ, దేశాన్ని అవమానిస్తుంటే, దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకొంటుంటే, భారత్ మౌనంగా ఉండిపోవాలా? కేవలం ప్రతీకార సుంకాలను విధించి ఊరుకోవాలా? ట్రంప్ చేస్తున్న విమర్శలకు ఆయన పేరు ఎత్తకుండా అన్యాపదేశంగా సమాధానాలు ఇస్తే గాయపడిన భారతీయుల మనోభావాలకు సాంత్వన చేకూరుతుందా? అంతే కాదు, అదానీ ప్రయోజనాలను పరిరక్షించడం కోసమే ట్రంప్‌ను పల్లెత్తుమాట అనడం లేదనే అప్రతిష్ఠను మోదీ మూటకట్టుకోవాల్సి వస్తోంది.

అగ్రరాజ్యాల పిడివాదం, దురహంకారాల వల్ల ప్రపంచం డీ–గ్లోబలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇదొక అనివార్య పరిణామంగా మారవచ్చు. పూర్తిగా సాధ్యం కాకున్నా ఏ దేశానికి ఆ దేశం ఇతరులపై ఆధారపడటం తగ్గించి స్వదేశీ ఉత్పత్తులు, స్వదేశీ పరిజ్ఞానంపై దృష్టిపెట్టొచ్చు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం ప్రస్తుతం అదే చెబుతున్నారు. ఆ దిశగా దేశం పయనిస్తే మంచిదే. కానీ, అప్పటివరకూ దేశ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని, అంతర్జాతీయ వాణిజ్య దౌత్య వ్యవహారాలతో స్వతంత్ర విధానాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానిదే. అమెరికాతో భవిష్యత్ సంబంధ బాంధవ్యాల అంశంలో ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పక్షాల సలహాలు, సూచనలు స్వీకరించాలి. ఓ స్పష్టమైన విధానాన్ని అనుసరించాలి. ముఖ్యంగా ట్రంప్ బెదిరింపులకు, ఒత్తిళ్లకు ఎట్టి పరిస్థితుల్లో కూడా లొంగబోమని, ఆర్థిక దాస్యానికి సిద్ధంగా లేమన్న హెచ్చరిక నేరుగానే అంతర్జాతీయ సమాజానికి తెలియజెప్పాలి.

■ సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు



ఎన్‌టీఆర్ నగర్‌లో వచ్చిన వరద నీరులో సామానుతో బయటకు వస్తున్న జనం



వరంగల్ రైల్వే స్టేషన్‌లో ట్రాక్‌పై నిలిచిన నీరు

వరంగల్ హంటర్‌రోడ్డులోని ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు





మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ వద్ద సహాయక చర్యల్లో అధికారులు

# అర్ధరాత్రి కుండపోత

## మూడు గంటల పాటు ఎడతెగని వాన

- అతలాకుతలమైన హనుమకొండ, వరంగల్ జిల్లాలు
- సంగెంలో అత్యధికంగా 202.7 మి.మీ. వర్షపాతం నమోదు
- స్తంభించిన జనజీవనం... నిలిచిపోయిన రాకపోకలు
- నగరంలో నీటమునిగిన తోతట్టు ప్రాంతాలు
- ఆకేరు వాగులో పశువుల కాపరి గల్లంతు
- కాశికుంటలో వరదనీటిలో మునిగి వృద్ధురాలి మృతి

హనుమకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాలో సోమవారం రాత్రి వర్షం దంచికొట్టింది. మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన ఈ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రెండు జిల్లాల్లో అతి భారీ వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లాలోని సంగెం మండలంలో అత్యధికంగా 202.7 మి.మీ., హనుమకొండ జిల్లా కేంద్రంలో 113.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. అతిభారీ వర్షాలకు రెండు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. వరదలు బీభత్సం సృష్టించాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఆకేరువాగులో పశువుల కాపరి గల్లంతయ్యాడు. వరంగల్ నగరంలోని 41వ డివిజన్ కాశికుంట వాంబే కాలనీ పసునూటి బుచ్చమ్మ (73) వరదనీటిలో మునిగి మృతి చెందింది. ఇంట్లోకి పెద్దఎత్తున వరదనీరు ప్రవేశించి ఆమె నిద్రిస్తున్న మంచం మునిగిపోయింది. దీనితో ఊపిరాడక ప్రాణాలు విడిచింది. ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లిలో గోడకూలి ఐదు గొర్రెలు మృతి చెందాయి. వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ప్రైవేటు పక్షన్‌హాల్ ప్రహరీగోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ దుర్ఘటన జరిగే సమాయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

### అతలాకుతలం

భారీ వర్షంతో వరంగల్‌లో పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. తోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరదనీరు నీలిచింది. అనేక ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. ఇంట్లోని వస్తువులు,

(మిగతా 6వ పేజీలో...)



వరంగల్ నగరంలో నీటి మునిగిన ప్రదేశాలను సందర్శిస్తున్న కమిషనర్, కలెక్టర్, అధికారులు



కాశీకుంటలో ఓ ఇంటిలోకి చేరిన వరదనీరు

### ఆకేరు వాగులో పశువుల కాపరి గల్లంతు

పర్వతగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పశువులను మేపేందుకు వెళ్లిన ఓ కాపరి గల్లంతయ్యాడు. పర్వతగిరి, మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కందికట్ల ఉప్పలయ్య (65).. గేదెలను మేపేందుకు ఉదయమే వెళ్లాడు. అయితే సాయంత్రం గేదెలు తిరిగి రాగా, ఉప్పలయ్య రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆకేరు వాగు పరిసర ప్రాంతాల్లో వెతకగా, ఉప్పలయ్య దుస్తులు, చెప్పులు, గొడుగు కనిపించాయి. రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు దయాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### వరదనీటిలో మునిగి వృద్ధురాలి మృతి

కరీమాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరద నీటిలో మునిగి ఓ వృద్ధురాలు మృతి చెందింది. వరంగల్ కాశికుంట వాంబే కాలనీకి చెందిన మానసిక వికలాంగురాలు పసునూని బుచ్చమ్మ(80) కోడలు కళావతి, మనుమరాలు కృపతో కలిసి ఉంటోంది. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఇంట్లోకి వరద నీరు రావడంతో కోడలు, మనవరాలు మేడపైకి పరుగెత్తారు. ఈలోగా నీరు ఎక్కువ అవడంతో ఎటూ కదల్లేని బుచ్చమ్మ నీటమునిగింది. వెంటనే వారు మళ్లీ కిందకి వచ్చి ఆమెను పైకి తీసుకెళ్లేసరికి అప్పటికే మృతిచెందింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### కంట్రోల్ రూమ్‌లు

భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో అప్రమత్తమైన రెండు జిల్లాల యంత్రాంగాలు.. వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశాయి. భారీవర్షాలు కురియనున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు హెచ్చరించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే హనుకొండ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబరు 7981975495ను, వరంగల్ జిల్లాకు సంబంధించి 18004253424, జీడబ్లుఎంసీకి సంబంధించి 18004251980 సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు సూచించారు. జిల్లా మండల స్థాయి అధికారులు తమ తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే అధికారులు తక్షణం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద భారీగా చేరిన వరద నీరు

### 19 మండలాల్లో భారీ వర్షాలు

రెండు జిల్లాల్లోని 19 మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. మిగతా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. వరంగల్ జిల్లాలో నాలుగు మండలాల్లో అతిభారీ వర్షపాతం నమోదుకాగా 9 మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో ఆరు మండలాల్లో భారీ వర్షం రికార్డయింది. వీటిలో హనుమకొండ మండలంలో అతిభారీ వర్ష పాతం నమోదైంది.



మైసయ్యనగర్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు



గిరిప్రసాద్‌నగర్‌లో చిన్నారులను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్తున్న మిల్స్ కాలనీ సీఐ రమేష్, ఎస్సై సురేష్



ఫాదర్ కొలంబో ఆస్పత్రి వద్ద మునిగిన కారు

**హనుమకొండ జిల్లా..**

| | |
|---|---|
| సరాసరి వర్షపాతం : | 34.1 మి.మీ. |
| భీమదేవరపల్లి : | 12.1 మి.మీ. |
| వేలేరు : | 21.6 మి.మీ. |
| ఎల్కతుర్తి : | 15.1 మి.మీ. |
| కమలాపూర్ : | 13.6 మి.మీ. |
| హసన్‌పర్తి : | 31.5 మి.మీ. |
| ధర్మసాగర్ : | 29 మి.మీ. |
| కాజీపేట : | 81.6 మి.మీ. |
| హనుమకొండ : | 113.7 మి.మీ. |
| ఐనవోలు : | 85.4 మి.మీ. |
| పరకాల : | 6.6 మి.మీ. |
| దామెర : | 36.4 మి.మీ. |
| ఆత్మకూరు : | 8.0 మి.మీ. |
| శాయంపేట : | 11.7 మి.మీ. |
| నడికూడ: | 10.9 మి.మీ. |



జలమయమైన హంటర్‌రోడ్ రహదారి

## నగరానికి వరద తాకిడి

- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- పలు కాలనీల్లో ఇళ్లలోకి వచ్చిన వర్షపు నీరు
- నగరంలో 5 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ఇప్పటికే 300మంది తరలింపు, 1300మందికి అల్పాహారం
- రక్షణ చర్యలు చేపడుతున్న నగర పాలక సంస్థ

వివరాలు : 8లో..

# కేయూ 'దూరవిద్య'లో 6 కొత్త కోర్సులు

- కోఎడ్ ఇంజనీరింగ్ కళాశాలలో బయోటెక్నాలజీ కోర్సు
- డిగ్రీ కామన్ సిలబస్‌కు ఓకే..
- అకడమిక్ స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయాలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కో-ఎడ్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా బయోటెక్నాలజీ కోర్సును ప్రవేశపెట్టేందుకు కేయూ అకడమిక్ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలక మండలి సభ్యులు, డీన్లు, ప్రిన్సిపాల్స్‌తో కేయూ అకడమిక్ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో వర్సిటీకి ప్రతిష్ఠాత్మకమైన కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా 60 సీట్లతో ఇంజనీరింగ్ బయోటెక్నాలజీ కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు ఆర్థిక పరమైన అంశాలను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు. అలాగే పాలకమండలి కమిటీ ఆమోదానికి పంపాలని నిర్ణయించారు.





కేయూ దూరవిద్య కేంద్రంలో ఇప్పుడున్న కోర్సులకు అదనంగా మరో 6 డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టేందుకు స్టాండింగ్ కమిటీ ఒకే చెప్పింది. ఇంగ్లీష్, తెలుగు, హిస్టరీ విభాగంలో పీహెచ్‌డీ గైడ్లుగా డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు కమిటీ రాటిఫికేషన్ చేసింది. వడ్డెపల్లి పింగళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రీసెర్చ్ సెంటర్‌గా గుర్తించింది. వర్సిటీల్లో కామన్ డిగ్రీ కోర్సుల సిలబస్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. నూతనంగా కేయూ పరిధిలో ప్రవేశపెట్టిన 12 డిగ్రీ కోర్సులకు ఆమోదం తెలిపింది. యూజీసీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులను పొందిన హనుమకొండ సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదాను కల్పించారు.

ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సుకుమారి, పుల్లూరి సుధాకర్, మల్లం నవీన్, చిర్రా రాజుగౌడ్, డీన్లు ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ జి.హన్మంతు, ప్రొఫెసర్ ఎన్.రాంనాథ్‌కిషన్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అకాడమిక్ ఏఆర్ కోలా శంకర్ పాల్గొన్నారు.

# ఘనంగా బంగారు మైసమ్మ ఉత్సవం

### ధార్మిక భవన్‌లో బోనమెత్తిన మంత్రి సురేఖ

హనుమకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవాదాయ, ధర్మదాయ శాఖ ధార్మిక భవనంలో బంగారు మైసమ్మ బోనాల ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర జాక్ కన్వీనర్ డీవీఆర్ శర్మ మంత్రికి సాదర స్వాగతం పలికారు. మంత్రి సురేఖ దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో బంగారు మైసమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజు విన్యాసాల మధ్య దేవాదాయశాఖ మహిళా ఉద్యోగుల నృత్యాలతో అమ్మవారి ఉత్సవం ఘనంగా నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ధ్యానమందిరంలో దేవాదాయశాఖ అధికారులు, అర్చక ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. 8 మందికి కారుణ్య నియామక పత్రాలు మంత్రి అందజేశారు. గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాట్యూటీ కింద రూ.8లక్షల చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9 ప్రధాన దేవాలయాలను సీఎం నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్తులో అన్ని దేవాలయాలను ఆన్‌లైన్ సేవల పరిధిలోకి తీసుకువస్తామన్నారు. దేవాలయ భూముల రక్షణ కోసం రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌ను మంత్రి సురేఖ ఆవిష్కరించారు. అర్చక సంఘాల అభ్యర్థన మేరకు డీడీఎన్ అర్చకులకు కూడా హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింప చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సంయుక్త కమిషనర్ రామక్రిష్ణారావు, డిప్యూటీ కమిషనర్లు వినోద్ రెడ్డి, కృష్ణప్రసాద్, వెంకటేష్, కమిషనరేట్ సూపరింటెండెంట్ బాబు శంకర్, సిబ్బంది హరీష్, భాస్కర్ అర్చక ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు మూర్తి సత్యనారాయణ శర్మ, రామలింగశర్మ తదితరులు పాల్గొన్నారు.



బంగారు మైసమ్మ బోనమెత్తుకున్న మంత్రి కొండా సురేఖ

### వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

వరంగల్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులు సెలవు ప్రకటించారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, శనివారం శ్రీ కృష్ణాష్టమి, ఆదివారం వారాంతపు సెలవు ఉన్నందున మూడు రోజులు బంద్ ఉంటుందని, సోమవారం నుంచి పునఃప్రారంభమవుతుందని వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు, గుమాస్తా, దాడువాయి, కార్మికులు గమనించాలని సూచించారు.

### మానసిక వికలాంగుల కోసం ఐరిస్ : ఎంపీ కావ్య

హనుమకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగుల భద్రత కోసం ఐరిస్ టెక్నాలజీని అమలు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య లోకసభలో ప్రతిపాదించారు. అయితే ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఎంతో మంది మానసిక వికలాంగుల భద్రతకు ఉపయోగపడే ఐరిస్ కెమెరా టెక్నాలజీని అమలు చేయాలన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐరిస్ టెక్నాలజీ వల్ల మానసిక వికలాంగుల భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చునన్నారు. కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టులు కూడా పరిశీలించకపోవడంపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభం



మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నేరానికి సంబంధించి నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు రాష్ట్ర ఫోరెన్సిక్ కేటాయించిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనం కమిషనరేట్ పోలీసులకు మెరుగైన సేవలందించనున్నదన్నారు. ఇకపై ఏదైనా నేరం జరిగితే ఫోరెన్సిక్, ఫింగర్‌ప్రింట్ అధికారులు మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో సంఘటనా స్థలానికి వెళ్లి రక్తపు మరకలు, వేలిముద్రలు ఇతర సాక్ష్యాధారాలను సేకరించి మొబైల్ వాహనంలో అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, రీజినల్ ఎస్ఎఫ్ఎల్ జాయింట్ డైరెక్టర్ నీరజ, ఫింగర్ ప్రింట్ విభాగం ఇన్‌స్పెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీధర్, ఆర్ఐలు శ్రీధర్, స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఫింగర్ ప్రింట్ ఎస్సై కిరణ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

### మరొకరికి తీవ్రగాయాలు



సదానందం (ఫైల్)

హసన్‌పర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధి మహేంద్ర షోరూమ్ సమీపంలో చోటు చేసుకుంది. కేయూసీ ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఎల్కతుర్తి మండలం కేశవాపూర్‌కు చెందిన బొడిగె సదానందం (45) కిరాణం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం సదానందం తన బైక్‌పై ఇదే గ్రామానికి చెందిన ఈర సురేందర్‌ను ఎక్కించుకొని హనుమకొండలో కూరగాయలు, కిరాణా సామగ్రి కొనుగోలు చేయడానికి బయలుదేరాడు. ఈ క్రమంలో కేయూసీ క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో సదానందం అక్కడికక్కడే మృతి చెందగా ఈర సురేందర్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఎండీ సాజిద్‌పాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.కల్యాణ్‌కుమార్ తెలిపారు.

## లడక్‌లో రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండకు చెందిన యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్ ఈవీ సాత్విక లడక్‌లోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటార్ మార్గాల్లో ఒకటైన ఖర్దుంగ్లా (ఎత్తు 17,582 అడుగులు) వద్ద రెడ్‌క్రాస్ జెండాతో సేవాభావనను ప్రతిబింబించారు. సేవల్లో ప్రత్యేకతను చాటుతున్న రెడ్‌క్రాస్ స్ఫూర్తి చిహ్నం జెండాను ఆవిష్కరించారు.




లడక్‌లో రెడ్‌క్రాస్ జెండాతో సాత్విక


ఆంధ్రజ్యోతి Classifieds

**WANTED**
★ Wanted Teachers, Floor Incharges with Good English Skills, Pre primary mothers Teachers, Primary Telugu, Hindi, English Teachers are Required @ Gopalpur,Hnk. Cell: 6301616123
AJW-243125

**WANTED**
★ Wanted Trainig and Placement Officer (TPO) to work for Reputed Instituion Contact : 7396348774
AJW-243245

**WANTED**
★ హనుమకొండ లోని ప్రముఖ రెడీ మేడ్ షాప్‌లో పనిచేయుటకు అనుభవం కల కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్రదించండి: 9848287933
AJW-17821

**WANTED**
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటింగ్ కావలెను. జీతం : 8,000/- నుండి 10,000/- సంప్రదించండి: 9666336163
AJW-243241

**WANTED**
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/- నుండి 14,000/- సంప్రదించండి: 9000463426
AJW-243242

**WANTED**
★ బెల్లం చాయ్ షాప్ నందు (డిజి బంగ్లా) పనిచేయుటకు వర్కర్ కావలెను. ఉదయం 5గం॥ నుండి సాయంత్రం 7:30 గం॥ వరకు. జీతం: 10,000 నుండి 12,000. సంప్రదించండి: 9700871260
AJW-243123

**CHANGE OF NAME**
I, KESHAVULU MANUPATHI (Old Name), H.No: 60-1-254, Bhattupally(V), Kazipet (Mdl), Hanamakonda (Dist). T.G., I Have Changed my name MANUPATI KESHAVULU (New Name) for all future purpose

**FLATS FOR SALE**
★ Ready to Occupy 1BHK, 2BHK, 3BHK Flats with all Facilities are for sale @ 941 Sqft to 1914 Sqft with Reasonable Prices at Vikas Nagar & Basit Nagar HNK. Cell.No: 8897221187, 9177592357.
AJW-243126

**HOUSE FOR SALE**
★ H.No : 7-7-381/3. Kapuwada, G+2 (220 Yards) West Face House for sale Near : Pradeep High School, Hanamkonda. Cell : 9849302242.
AJW-243105

**SERVICES**
★ ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉన్నటయితే ఉద్యోగ అవకాశం కల్పించబడును. ట్రైనింగ్ ఇచ్చి సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ ఇప్పించబడును. రెజ్యూమ్. సెల్ : 80965 20976
AJW-6641

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

**ప్రకటనల కొరకు సంప్రదించండి**
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232


# అనిశెట్టి రజితకు కన్నీటి నివాళి

- ఆమె పార్థివదేహం కేఎంసీకి అప్పగింత
- కడసారి చూపునకు తరలివచ్చిన సాహితీ ప్రముఖులు
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో గుండెపోటుతో కన్నుమూసిన ప్రముఖ రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత(67)కు సాహితీలోకం కన్నీటి నివాళులు అర్పించింది. రజిత అవివాహిత కావడం, ఆమెకు సొంత ఇల్లు లేకపోవడంతో.. ఆమె భౌతికకాయాన్ని హనుమకొండ కేయూ రోడ్‌లోని ఆచార్య కాత్యాయనీ విద్మహే ఇంటి ఆవరణలో సన్నిహితుల సందర్శనార్థం ఉంచారు. మంగళవారం పలువురు సాహితీ ప్రముఖులు, అభిమానులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి ఆమె స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రత్యేక అంబులెన్స్‌లో కాకతీయ వైద్య కళాశాలకు తరలించి వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం అప్పగించారు.

ఈ సందర్భంగా కేయూ క్రాస్‌రోడ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, మిత్రమండలి పక్షాన వీఆర్ విద్యార్థి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రచయిత కందాల శోభా రమేశ్, ప్రజాఫ్రంట్ పక్షాన బి.రమాదేవి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక పక్షాన ఎండ్లూరి మానస, కె.రామలక్ష్మి, విరసం పక్షాన కే.కుమారస్వామి, అరసం నుంచి నిధి, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ రచయిత నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, రిటైర్డ్ ప్రొఫెసర్లు వి.శోభ, తోట గిరిజారాణి, జ్యోతిరాణి, విజయలక్ష్మీ, విజయచందర్ తదితర అనేక మంది ప్రముఖులు, ప్రజాస్వామిక వాదులు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, అనేకమంది కేఎంసీ వరకు వెళ్లి ఆమె పార్థివదేహాన్ని అప్పగించి ఘన నివాళులర్పించారు.



రజిత భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్



కేఎంసీలో రజిత పార్థివదేహాన్ని అప్పగిస్తున్న దృశ్యం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం

అనిశెట్టి రజిత మృతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేయడమే కాక స్త్రీ సామాజిక సమానత్వం కోసం తన రచనల ద్వారా చైతన్యం నింపారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ కన్వీనర్ కత్తి పద్మారావు సంతాప సందేశంలో రజిత మృతి తీరని లోటని, తాను ఒక సొంత సోదరిని కోల్పోయినట్లు ఉందని పేర్కొన్నారు. యూఎస్ నుంచి కాత్యాయనీ విద్మహే సంతాప సందేశం పంపించారు. స్త్రీవాద రచయిత్రిగా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి తన రచనల ద్వారా చైతన్యం నింపిన ఉద్యమశీలి రజిత అన్నారు. అనిశెట్టి రజిత మృతితో గొప్ప ఆత్మీయురాలిని కోల్పోయినట్లు పేర్కొన్నారు. నెల్లుట్ల రమాదేవి, దేవులపల్లి వాణి, మహ్మద్ సిరాజుద్దీన్, వల్స పైడి, నాగిళ్ల రామాశాస్త్రి, జిలుకర శ్రీనివాస్, ప్రొఫెసర్ సారంగపాణి, తదితరులు రజిత మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

# 'ప్రతిమ'లో మెగా వైద్య శిబిరం

- ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు
- ప్రారంభించిన రామానుజ చిన్నజీయర్ స్వామి

దామెర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మహమ్మారిలా పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధిని ముందే గుర్తిస్తే నయం చేయవచ్చని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి తెలిపారు. మంగళవారం దామెర క్రాస్ రోడ్‌లోని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్, ప్రతిమ ఫౌండేషన్, ప్రతిమ క్యాన్సర్ ఇనిసస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలోని వైద్య శిబిరాన్ని జీయర్‌స్వామి వారి చేతుల మీదుగా ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండను క్యాన్సర్ రహిత నగరం గా తీర్చిదిద్దాలని తెలిపారు. సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ తిప్పని అవినాష్ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి, సరైన వైద్యం అందిస్తే రోగి పూర్తిగా కోలుకోగలుగుతారని తెలిపారు. ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ బోయినపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ హరిణిల సహకారంతోఇక నుంచి ఒక సంవత్సరం పాటు ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఇందులో భాగం గా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఉచిత కన్సల్టేషన్‌తో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు చేసి, వైద్య సేవలు అందించారు. అలాగే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల రిజిస్ట్రేషన్ కోసం 77290 66702, 93451 08108 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా డాక్టర్ మద్ది రా హుల్, డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, డాక్టర్ సు మిత్ర, డాక్టర్ అశ్విని, వికాస తరంగిణి సెంట్ర ల్ కమిటీ సభ్యులు భవానిప్రసాద్, భాస్కర్‌రావు, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రెసిడెంట్ రమేష్‌గుప్తా, సెక్రటరీ దయాకర్‌రెడ్డి, రాజేందర్, తిరుమల, డాక్టర్ బచ్చు మురళీకృష్ణ, డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, డాక్టర్ వీణ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న చిన్నజీయర్

## ఒక సబ్జెక్టు తప్పిన వారికి బంపర్ ఆఫర్

- 29న ఇన్‌స్టంట్ పరీక్ష
- 21 వరకు ఫీజు గడువు

కేయూ క్యాంపస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో డిగ్రీ 6వ సెమిస్టర్‌లో ఏదైనా ఒకే ఒక్క సబ్జెక్టు తప్పిన విద్యార్థులకు శుభవార్త. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీసీఏ మొదటి నుంచి ఐదు సెమిస్టర్లలో అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణత సాధించి.. ఆరో సెమిస్టర్‌లో ఏదైనా ఒకే సబ్జెక్టులో తప్పిన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కేయూ అధికారులు మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం.తిరుమలదేవి, పి.వెంకటయ్యలు తాజా షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈనెల 21 వర కు సంబంధిత కళాశాలలో తప్పిన సబ్జెక్టుకు పరీక్ష ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఆగస్టు 29న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు కళాశాల నుంచి ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు. ఇన్‌స్టంట్ పరీక్ష థియరీ పేపర్‌కు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

### అంబేద్కర్ విగ్రహం

## కూల్చివేత అమానుషం

- ప్రెస్‌క్లబ్ బాధ్యులపై కేసు నమోదు చేయాలి
- టీయూడబ్ల్యూజే(హెచ్-143) నాయకుల డిమాండ్



ప్రెస్ క్లబ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

వడ్డెపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బాలసముద్రంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌ను ఆనుకొని ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చిన ప్రెస్‌క్లబ్ బాధ్యులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని టీయూడబ్ల్యూజే(హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, రాష్ట్ర నాయకులు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ మెయిన్ గేట్‌ను ఆనుకొని ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని అత్యంత అమానవీయంగా ఉరి తాడు బిగించి లాగుతూ కూల్చివేశారని, ఈ విషయంలో ప్రెస్‌క్లబ్ బాధ్యులపై చట్టపరంగా చర్య తీసుకోవాలని కోరుతూ మంగళవారం ప్రెస్‌క్లబ్ ఆవరణలో దీక్ష చేపట్టడంతో పాటు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ స్టేట్ ఈసీ మెంబర్ గుంటి విద్యాసాగర్, టీయూడబ్ల్యూజే(హెచ్-143) హనుమకొండ జిల్లా అధ్యక్షులు మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్ తదితరులతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ నిరసన ప్రదర్శనకు ఏఐఎఫ్‌డీపై రాష్ట్ర అధ్యక్షులు కర్ర రాజిరెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారు.

### సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి అవమానించారంటూ ప్రెస్‌క్లబ్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, జిల్లా అధ్యక్షులు మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్, నాయకులు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, కక్కెర్ల అనిల్‌కుమార్ మంగళవారం సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు గత ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన తుమ్మ శ్రీధర్‌రెడ్డి ప్రెస్‌క్లబ్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, తమ కమిటీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య తదితరులు ఫిర్యాదు చేశారు. కాగా, ఇరువర్గాల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు.

## కేయూ డిగ్రీ ఫలితాల వెల్లడి

కేయూ క్యాంపస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ రెగ్యులర్ కోర్సుల 1, 2, 3, 4వ సెమిస్టర్ ఫలితాలు విడులయ్యాయి. ఈ మేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లు మంగళవారం ఫలితాలను వెల్లడించారు. పరీక్షలు గత మే నెలలో నిర్వహించారు. మొదటి సెమిస్టర్‌లో 31, రెండో సెమిస్టర్‌లో 30, మూడో సెమిస్టర్‌లో 35, నాలుగో సెమిస్టర్‌లో 39 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు.

### ఎస్డీఎల్సీఈ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ దూరవిద్య కేంద్రం అందిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. 24శాతం మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం విడుదలైన పరీక్షల ఫలితాల రీవాల్యూవేషన్‌కు దరఖాస్తులు చేసుకునేందుకు ఆగస్టు 27 వరకు గడువుందని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. పరీక్షల ఫలితాల విడుదల కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ ఆసీం ఇక్బాల్, ఈసీ మెంబర్, ఎస్డీఎల్సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, డాక్టర్ వి.మహేందర్, ఏఆర్ బి.నేతాజీ, ఎన్.సమ్మయ్యలు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లతో చర్చలు సఫలం

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం షెడ్‌లలో రిపేర్ చేసే ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి తమకు ఏమీ గిట్టుబాటు కావడం లేదని బంద్‌కు పిలుపునిచ్చిన కాంట్రాక్టర్లు.. ఎన్పీడీసీఎల్ ఇచ్చిన అభయంతో మంగళవారం నుంచి రిపేర్లు చేయడం ప్రారంభించారు. అదివారం, సోమవారం కాంట్రాక్టర్లు బంద్ చేసిన నేపథ్యంలో మంగళవారం విద్యుత్ భవన్ వేదికగా కంపెనీ చర్చలకు ఆహ్వానించింది. చర్చల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ ప్రస్తుతం భారీవర్షాల కురుస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టర్ల షరతులకు తలొగ్గి వారి డిమాండ్స్‌ను నేరవేర్చుతామని ఒప్పుకోవడంతో తక్షణమే రిపేర్లు ప్రారంభించినట్లుగా తెలిసింది. దీనిపై ఆపరేషన్స్ సీజీఎం రాజు చౌహాన్ వివరణ కోరగా.. కాంట్రాక్టర్ల డిమాండ్‌లలో న్యాయపరమైనవాటిని తీర్చేందుకు యాజమాన్యం ఒప్పుకుంది వాస్తవమని, రిపేర్లకు ఎలాంటి ఆటంకం లేదని మంగళవారం నుంచి ప్రారంభించారని తెలిపారు.

### కేయూలో

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం ?

### రెండు పోస్టులకు పోటీ.. నేడు విరమించుకునే అవకాశం

కేయూ క్యాంపస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. రీక్రియేషన్ సెక్రటరీ 1 పోస్టుకు 3 నామినేషన్లు దాఖలు కాగా, 8 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లకు 9మంది నామినేషన్లు వేసి బరిలో నిలిచారు. ఆయా పోస్టుల మినహా మిగతా పోస్టులన్నీ ఏకగ్రీవమయ్యాయి. కాగా, రీక్రియేషన్ సెక్రటరీ పోస్టుకు నామినేషన్ వేసిన వారిలో ఇద్దరు. ఈసీ మెంబర్లలో మరొకరు బుధవారం నామినేషన్లు ఉపసంహరించుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు లేకుండానే మొత్తం కార్యవర్గం ఏకగ్రీవం కానున్నాయి. ఆగస్టు 12న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ముగిసింది 13న బుధవారం సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది.

ఏకగ్రీవంగా ఎంపికైన వారిలో అధ్యక్ష పదవికి కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్ సెక్రటరీకి డాక్టర్ పుల్లా శ్రీనివాస్, 2 ఉపాధ్యక్ష పదవి పోస్టులకు నమిండ్ల కిరణ్‌కుమార్, పులిశేరు భాస్కర్, ట్రెజరర్ దామెర ఆనందం, ఆర్గనైజన్ సెక్రటరీ భూక్య రాజులున్నారు. వీరితో పాటు రీక్రియేషన్ సెక్రటరీ 1 పోస్టుకు నరేశ్, యాకు నాయక్, ప్రవీణ్‌లు పోటీలు ఉన్నారు. 8 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సేవియా, వెంకటనర్సయ్య, డాక్టర్ శ్రీకాంత్, బొక్క మొగిలి, ఎం.బుచ్చయ్య, మహర్షి, బొల్నేపాక ప్రభాకర్, ఐత శ్రీకాంత్, రాజేశ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో ఒక్కరు ఉపసంహరించుకోనున్నారు. దీంతో కమిటీ ఏకగ్రీవం కానుంది. అధికారికంగా బుధవారం ప్రకటించే అవకాశం ఉంది. జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎంపికైన డాక్టర్ పుల్లా శ్రీనివాస్ వరుసగా 6 దఫాలుగా ఎన్నికయ్యారు. 19 ఫిబ్రవరి 2009 నుంచి పదవిలో కొనసాగుతున్నారు. 2, 3, 4, 5 దఫాలుగా ఎన్నికల్లో గెలుపొందగా మిగతా సమయంలో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

### వచ్చే నెల 7 నుంచి

## శాతవాహన ఎక్స్‌ప్రెస్ పునఃప్రారంభం

కాజీపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ పునరుద్ధరణ పనుల దృష్ట్యా (12713/74) సికింద్రాబాద్ - విజయవాడల మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను కొంతకాలంగా కాచిగూడ - విజయవాడ మధ్య నడిపించారు. అయితే ఈ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 7 నుంచి తిరిగి సికింద్రాబాద్ నుంచి పునరుద్ధరించి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# అర్ధరాత్రి కుండపోత

(5వ పేజీ తరువాయి)

నిత్యావసర వస్తువులు తడిసిముద్దయ్యాయి. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఇళ్ల మధ్య పెద్ద ఎత్తుననీరు నిలిచిపోవడంతో పలుకాలనీలు జలదిగ్బంధంలో మునిగిపోయాయి. రాత్రంతా కుండపోతగా కురిసిన వర్షంతో తెల్లారేసరికి తమ ప్రాంతాలన్నీ చెరువులుగా మారడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎటుచూసినా వరద ఇళ్లను చుట్టుముట్టడంతో బయట అడుగుపెట్టలేని దయనీయ స్థితి. దీనితో ఉదయం పాలు, ఇతర నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి కూడా వీలులేకపోయింది. గుడిసెవాసుల పరిస్థితి మరీ దారుణం. వరదనీటికి అనేక గుడిసెలు నీటమునగడంతో అన్నిటినీ వదిలేసి ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. వరంగల్‌లోని మురికివాడల వాసులు సాయం కోసం అర్థించారు. ఇక అతివృష్టికి రెండు జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. ప్రధాన రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. రవాణా పూర్తిగా స్తంభించిపోయింది. పోలీసులు అప్రమత్తమై ఉధృతంగా ప్రవహిస్తున్న మత్తళ్లపై నుంచి ప్రజలు, వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాల ప్రజల్లో వరదనీటిలో చిక్కుకుపోయిన 300 మందిని డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు చేర్చాయి. వరద బాధితుల కోసం ఐదు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**హనుమకొండ జిల్లాలో..**

హనుమకొండ జిల్లాలో భారీ వర్షం కురిసింది. హనుమకొండ మండలంలో అత్యధికంగా 113.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల పలు చోట్ల వరదలు వచ్చి రాకపోకులకు అంతరాయం కలిగింది. ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామంలో వర్షానికి గోడనాని దాని సమీపంలో ఉన్న గొర్రెలపై పడింది. దీనితో ఐదు గొర్రెలు మృతి చెందాయి. ఐనవోలు మండలంలోని పంథిని, ఆకేరువాగులోకి వరదనీరు వచ్చి చేరడంతో 70శాతం మేరకు నిండాయి. చెరువులు, కుంటల్లోకి 90 శాతం మేరకు వరదనీరు వచ్చి చేరింది. దామెర మండలంలో సైలానీ బాబాదర్గా, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపునీరు ప్రవేశించింది. రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు మండలంలోని ఆగ్రంపాడు, నీరుకుళ్ల, కటాక్షపురం చెరువులోకి పెద్దఎత్తున వరదనీరు చేరుతోంది. నడికూడ మండలంలోని కంఠాత్మకూరు చెరువు మత్తడి పోస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పరకాల మండలంలోని చలివాగు, పరకాల చెరువు, నల్లకుంట చెరువు, ఎర్రగుంట చెరువులు మత్తడి పోస్తున్నాయి.

**మండలాల్లో..**

వరంగల్ జిల్లా సంగెం మండలంలో అత్యధికంగా 202.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలం చరిత్రలో ఇంత భారీ వర్షం పడడం ఇదే మొదటిసారి. దుగ్గొండి మండలం తిమ్మంపేట, నారాయణ తండా మధ్య కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నర్సంపేటలోని మాదన్నపేట చెరువు పెద్ద ఎత్తున మత్తడి పోస్తోంది. పర్వతగిరి మండలంలోని కొంకపాక శ్రీనగర్ క్రాస్‌రోడ్ల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై వర్షపు పెద్దఎత్తున ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే మండలంలోని రావూరు వద్ద ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌పై నుంచి వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. ఎలుగూరు రంగంపేట రైల్వే బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున వరదనీరు నిలిచి సముద్రాన్ని తలపించింది. ఎలుగూరు రంగంపేట గ్రామానికి చెందిన వడ్లకొండ పరమేశ్వర్‌కు గుండెపోటు రావడంతో ఆయనను వరద నీటితో నిండిన ఈ బ్రిడ్జి కింద నుంచి తీసుకురావడం కష్టమైంది. దీనితో అయనను మంచంపై ఉంచి దూరంగా నిలిచిపోయిన అంబులెన్స్ వరకు గ్రామస్థులు మోసుకువెళ్లాల్సి వచ్చింది.

**వరంగల్ నగరంలో..**

వరంగల్‌లోని మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్ ప్రాంతం పూర్తిగా నీట మునిగింది. మిల్స్‌కాలనీ సీఐ రమేష్ సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కరీమాబాద్‌లోని రామలక్ష్మణ్ గార్డెన్ వద్ద ప్రహరీ కూలిపోయింది. అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని 32, 33, 39, 40 డివిజన్లలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మత్తడిపోస్తున్న ఖిలా వరంగల్ అగర్తల చెరువును మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పరిశీలించారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లోకి పెద్ద ఎత్తున వరదనీరు ప్రవేశించింది. దీంతో పట్టాలు పూర్తిగా మునిగిపోయాయి. చింతల్, శివనగర్ డ్రైనేజీల నుంచి వచ్చిన వరద నీరు స్టేషన్‌ను ముంచెత్తడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అయితే కొద్దిసేపటికే వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో రైళ్లరాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగలేదు. వరంగల్ శివనగర్ అండర్ బ్రిడ్జి కింద భారీ ఎత్తున వరదనీరు నిలిచిపోయవడంతో వాహనాల రాకపోలు నిలిచిపోయాయి. పోలీసు అప్రమత్తమై వాహనాలను ఇతర మార్గాల గుండా మళ్లించారు. హంటర్‌రోడ్డులోని బొందివాగు ఉధృతంగా ప్రవహించడంతో వరదనీరు ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలను ముంచెత్తింది. ఒక ఫక్షన్‌హాల్‌తో పాటు పలు ఇళ్లలోకి వరదనీరు చొచ్చుకువచ్చింది.



కృష్ణకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టాఫ్ రూమ్‌లోకి చేరిన నీరు

# నగరానికి వరద తాకిడి



వరంగల్ శివనగర్‌లో భారీగా నిలిచిన నీరు

## నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలు వరద తాకిడికి గురయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. ఎడతెరిపిలేని కుండపోత వర్షానికి నగంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, షాపులు, ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 15 కాలనీలలో ఇళ్లలోకి వర్షపునీరు చేరుకున్నట్టు అధికారులు గుర్తించారు.

### జీడబ్ల్యూఎంసీ చర్యలు

నగరంలో కురుస్తున్న వర్షాలకు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రజలకు సూచించారు. సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు నగరంలో చాలా కాలనీలతో పాటు ఇళ్లలోకి నీరు చేరడంతో కమిషనర్ అధికారులను అప్రమత్తం చేశారు. వరంగల్ కలెక్టర్ సత్యశారదదేవితో పాటు కమిషనర్ నగరంలో పర్యటించారు. శానిటేషన్‌తో పాటు టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని పలు కాలనీలలో సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి ఆత్మస్థైర్యాన్ని నింపారు. సాయిగణేశ్ కాలనీ, డీకేనగర్, లెనిన్‌నగర్, అగర్తల చెరువు, మైసయ్యనగర్, గిరిప్రసాద్ కాలనీ, పద్మనగర్, శాకరాసికుంట ప్రాంతాల్లో కమిషనర్ స్వయంగా పర్యటించి వరద ముంపునకు గల కారణాలను తెలుసుకున్నారు.

మంగళ, బుధవారాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రమాదపుటంచులో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఇంకా పునరావాస కేంద్రాలలో అన్ని రకాల ముందులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో పిల్లలు బయటకు, చేపలకు, ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నెంబర్‌కు 1800 425 1980, 9701999676 ఫోన్ చేయాలని కమిషనర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలు సందర్శించిన వారిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, ఆర్‌డీవో సత్యపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సువర్ణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- పలు కాలనీల్లో ఇళ్లలోకి వచ్చిన వర్షపు నీరు
- నగరంలో 5 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ఇప్పటికే 300 మంది తరలింపు, 1300 మందికి అల్పాహారం
- రక్షణ చర్యలు చేపడుతున్న నగర పాలక సంస్థ





శివనగర్ రహదారిపై



మైసయ్యనగర్‌లో గుడిసెవాసులకు భోజనాలు అందజేస్తున్న కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్



వరంగల్ శివనగర్‌లో భారీగా నిలిచిన నీరు

### నీట మునిగిన ప్రాంతాలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరంగల్ నగరంలో పలు కాలనీలలో ఇళ్లలోకి నీరు చేరినట్టు జీడబ్ల్యూఎంసీ అధికారులు గుర్తించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలైన హనుమకొండ, వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు సాయిగణేశ్ కాలనీ, గాంధీ నగర్, డీకే నగర్, లెనిన్ నగర్, వివేకానంద కాలనీ, శివనగర్, ఎస్టీఆర్ నగర్, ఎంఎస్ నగర్, సీఎస్ఆర్ గార్డెన్, కొత్తబస్‌స్టేషన్, గోకుల్‌నగర్, శాంతినగర్, కాశిబుగ్గ, రంగశాయిపేట, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సుగుట్ట, బీకే నగర్, మైసయ్యనగర్, గోపాలపురం, తెలంగాణ జంక్షన్, రంగంపేట, ఎన్‌జీవోఎస్ కాలనీ, పోచమ్మకుంట, కొత్తవాడ, కాపువాడ, పాతబీటుబజార్, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, అండర్ రైల్వే గేట్ ప్రాంతాలతో పాటు పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలలో నీరు ఇండ్లలోకి చేరుకున్నాయి.

ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో జీడబ్ల్యూఎంసీ డీఆర్‌ఎఫ్, శానిటేషన్ సిబ్బంది స్పందించి నీటిలో చిక్కి ఉన్న వారిని గుర్తించి పునారావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటి వరకు సుమారు 300 మంది నిరాశ్రయులను కేంద్రాలకు తలించినట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి వెల్లడించారు. శంభునిపేట ప్రభుత్వ హైస్కూల్, బీరన్నకుంట హైస్కూల్, శుభం గార్డెన్, గుజరాత్ మార్వాడీ సెంటర్, శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్ ఐదుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నగర పాలక సంస్థ సహకారంతో ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నారు. సోమవారం ఉదయం 1300 మందికి అల్పాహారం అందించినట్టు అధికారులు తెలిపారు.



ఖిలావరంగల్ శిల్పాలు, మధ్యకోటలోని స్వయంభూ దేవాలయంలో నిలిచిన వర్షంనీరు



హనుమకొండ బస్ స్టేషన్ ముందు పేరుకున్న కంకరతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



జలమయమైన హంటర్‌రోడ్డు ఖమ్మం బ్రిడ్జి ప్రక్కన రైల్వే ట్రాక్ ప్రాంతం



అలుగు పోస్తున్న సంగెం మండలంలోని ఎల్గూరు చెరువు

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలన్నారు. ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగులు సెలవులు రద్దు చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, వైద్యారోగ్య, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు రాబోయే మూడు రోజులపాటు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

రానున్న 72 గంటలపాటు అవసరం ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని ప్రజలకు సూచించారు. పరిస్థితులను బట్టి పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలకు సెలవులపై తగు నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జనజీవనం స్తంభించిపోకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉంటున్న ప్రజలను వెంటనే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆహారం, ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఖిలావరంగల్ స్వయంభూదేవాలయంలో నిలిచిన వర్షంనీరు



వరంగల్ కరీమాబాద్ చిన్న బ్రిడ్జి కింద నిల్చిన వర్షపు నీరు

## భూపాలపల్లి జిల్లాలో 20.8 మి.మీ వర్షపాతం

కృష్ణకాలనీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 20.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మహదేవపూర్‌లో 13.8, పలిమెలలో 8.6, మహముత్తారంలో 57.6, కాటారంలో 7.2 మల్హర్‌లో 9.4, చిట్యాలలో 22.4, టేకుమట్లలో 74.2, మొగుళ్లపల్లిలో 4.8, రేగొండలో 3.0, గణపురంలో 9.6, భూపాలపల్లిలో 18.4, కొత్తపల్లిగోరి మండలంలో 6.2 మి.మీ వర్షాపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.



## ములుగు జిల్లాలో మోస్తారు వర్షం

ములుగు, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి) :ములుగుజిల్లా వ్యాప్తంగా మంగళవారం మోస్తారు వర్షం కురిసింది. జిల్లాలోని పలు మండలాల్లో స్వల్ప వర్ష పాతం నమోదైంది. ఏటూరునాగారంలో మండలంలో అత్యధికంగా 2.10 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా ములుగులో 0.8 మి.మీ వర్షం కురిసింది. మంగపేటలో 19.3 మి.మీ, తాడ్వాయిలో 13.3 మి.మీ, వాజేడులో 11.8 మిమీ, గోవిందరావుపేటలో 10 మి.మీ, వెంకటాపురంలో 5.3 మి.మీ, వెంకటాపూర్‌లో 5.0 మి.మీ కన్నాయిగూడెంలో 3.5 మి.మీ, ములుగులో 2.3 మి.మీ, మల్లంపల్లిలో 1.0 మి.మీ వర్షం పడింది.

## మహబూబాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు

- పొంగుతున్న వాగులు.. పలు చోట్ల నిలిచిన రాకపోకలు
- పెద్దవంగరలో 120.8 మిలల్లీమీటర్ల భారీ వర్షం

మహబూబాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దంతాలపల్లి, పెద్దముప్పారం వద్ద పాలేరువాగు పొంగుతోంది. గార్ల మండలం పాకాల వాగు ప్రమాదస్థాయికి మించి ఉధృతంగా ప్రవహిస్తోంది. గూడూరు మండలం పాకాల వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తోంది. భీమునిపాదం జలపాతం జాలువారుతోంది. కేసముద్రం మండలం అర్పనపల్లి వద్ద వట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొత్తగూడ మండలంలో బూర్కవాగు, గాదెవాగు, గాంధీనగర్‌వాగులు, తొర్రూరు మండలంలోని గుర్తూరు-సోమారం మధ్య ఈదులకుంట వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వాగుల ఉధృతితో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు వాగులను దాటకుండా పోలీసులు ట్రాక్టర్లు, ముళ్లకంచెలు అడ్డుపెట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి ప్రాంతంలో 120.8 మిల్లీమీటర్ల అతిభారీ వర్షం కురిసింది. తొర్రూరులో 105.0 మిల్లీమీటర్ల భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 754.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 47.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



గూడూరు మండలంలో జాలువారుతున్న భీమునిపాదం

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న 72 గంటల్లో భారీ వర్షాలు ఉన్నాయన్న నేపథ్యంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తరలిపోవాలన్నారు. అదే విధంగా శిథిలావస్థ భవనాలు, ఇళ్లలో నివసించే వ్యక్తులు సైతం సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అత్యవసరం ఉంటేనే బయటికి రావాలన్నారు. వర్షంలో వాహనాలపై ప్రయాణించే వారు వాహనాల కండిషన్ చూసుకొని నిదానంగా డ్రైవింగ్ చేయాలన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద నిలబడటం, విద్యుత్ స్తంభాలను తాకడం చేయొద్దన్నారు. విపత్కర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## వాగులో కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం

- ప్రమాదవశాత్తు వాగులో పడిన వ్యక్తి
- జనగామ జిల్లా రఘునాథపల్లిలో ఘటన




గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రఘునాథపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్ది నుంచి వచ్చే పెద్దవాగులో మండల కేంద్రంలోని రైల్వే ట్రాక్ సమీపంలోని చిన్న బ్రిడ్జి వద్దకు వరద నీటిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొని వచ్చిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రఘునాథపల్లి పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ గౌడ్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని, బయటకు తీశారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి, ఫ్రెంచ్ గడ్డంతో బక్క పలచగా ఉండి సిమెంటు రంగు ఆకుపచ్చని తీగల డిజైన్ ఫుల్ షర్టు, బెల్లం, నారింజ రంగు గళ్ల ప్యాంటు వేసుకొని ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడు ముస్లిం సామాజికి వర్గానికి చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. రెండు, మూడు రోజులుగా గ్రామాల్లో తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం రాత్రి వెల్ది వాగులో ప్రమాదవశాత్తు పడి వరదకు కొట్టుకొని వచ్చినట్లు ఉందని పలువురు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

## విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో ఉన్న విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఆయా జిల్లాల సూపరింటెండెంట్‌తో సీఎండీ మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధిగా హెడ్ క్వార్టర్‌లోనే ఉండి విధులు నిర్వర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ ఉండాలన్నారు. అంతరాయాలు ఏర్పడితే వెంటనే మెన్, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకొని వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. షిఫ్ట్ విధానంలో 24 గంటలు విధులు కేటాయించాలన్నారు. సీఎం ఆదేశానుసారం వరదల కారణంగా విద్యుత్ సరఫరా లేని చోట జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



ఆంధ్రజ్యోతి WWW.ANDHRAJYOTHY.COM

# హనుమకొండ సిటీ

HANUMAKONDA CITY ■ బుధవారం 13 ఆగస్టు 2025 8

## చెరువులు కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలి

మడికొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ సూచించారు. మంగళవారం ఎస్సై పెగడ రాజ్‌కుమార్‌తో కలిసి మడికొండ, రాంపేట, కడిపికొండ, అమ్మవారిపేట చెరువులను సందర్శించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల చెరువుల వద్ద నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. చేపలు పట్టడం కోసం, ఈత సరదా కోసం చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దన్నారు. ముఖ్యంగా పిల్లలను చెరువుల వద్దకు వెళ్లనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు.



రాంపేట చెరువును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సై రాజ్‌కుమార్



మహాధర్నా గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూటీఎస్ నాయకులు

## మహాధర్నా గోడపత్రికల ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు దగ్గర సెప్టెంబర్1వ తేదీన నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన గోడ పత్రికలు పీఆర్‌టీయూటీఎస్ నాయకులు మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మందల తిరుపతిరెడ్డి, పలిత శ్రీహరి, టీజీఈజేఏసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల రాజేందర్, భైరి సోమయ్య, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు తిరునగిరి శ్రీనివాస్, ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, దండ కోమల్‌రెడ్డి, రామన్న, మహిపాల్‌రెడ్డి, హన్యనాయక్, గుర్రం రాజు, భానుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈద్గా, పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ, నయీంనగర్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్, ప్రెసిడెన్సి స్కూల్ ఏరియాలో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

## రాఘవేంద్రస్వామి మఠంలో ఘనంగా ఉత్తరారాధన

వడ్డెపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి పరిమళ కాలనీలోని రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా ఉత్తరారాధన నిర్వహించారు. మఠం మేనేజర్ బి.ఆర్.వి.మాధవరావు, విచారణ కర్త ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో రుత్వికులు ఉదయం సుప్రభాత సేవ, అష్టోత్తరం, పాదపూజ, కనకాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. మధ్యాహ్నం రథోత్సవాన్ని నిర్వహించి మహాఅన్నదాన వితరణ గావించారు. కార్యక్రమంలో ఐటీడీఏ రిటైర్డ్ పీవో చక్రాధర్ రావు, ప్రతినిధులు కిరణ్‌కుమార్, అంబదాస్, బి.వి.సంజీవరావు, సత్యమోహన్, డాక్టర్ రమేష్‌శర్మ, సులక్ష సంతోష్, ఉత్తమ రాజ్‌వికాస్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తుల భజన కీర్తనలతో రాఘవేంద్రస్వామి మఠం మార్మోగింది.

## రచయిత అనిశెట్టి రజితకు నివాళి



రజిత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, తెలంగాణ ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక బాధ్యురాలు అనిశెట్టి రజిత మృతదేహనికి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కేయూ మొదటి గేటు వద్ద రజిత మృతదేహాన్ని ఉంచగా రిజిస్ట్రార్ రామచంద్రంతో పాటు ఇతర ప్రజా సంఘాల బాధ్యులు, వర్సిటీ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనిశెట్టి రజిత కాకతీయ యూనివర్సిటీలో సుదీర్ఘ కాలం బోధనేతర ఉద్యోగిగా పనిచేశారు. ఆమె మృతిపట్ల వర్సిటీ వర్గాల సంతాపం వ్యక్తం చేశాయి. తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రజిత గుండెపోటులో అస్వస్థతకు గురై మృతి చెందగా మంగళవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలకు మృతదేహాన్ని అప్పగించారు. కాగా, మానవ హక్కుల వేదిక తరపున ఎస్.జీవన్‌కుమార్ అనిశెట్టి రజిత మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించారు. హక్కుల గొంతుక అనిశెట్టి రజిత లేని లోటు పూడ్చలేదని పేర్కొన్నారు.

### అన్యాయాన్ని ఎదురించిన ధీశాలి రజిత

హనుమకొండ (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ నాయకురాలు అనిశెట్టి రజిత మరణం తీరనిలోటని మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాదావత్ రాజు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. రజిత మహిళా ఉద్యమాలతో పాటు అనేక సామాజిక హక్కుల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. రజిత లేకపోవడం వరంగల్ ప్రజలతోపాటు యావత్ సమాజానికి తీరని నష్టం అన్నారు.

## వర్షాల నేపథ్యంలో సేవలందించాలి

- కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో వరంగల్ పశ్చిమ ప్రజలకు సేవలందించేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతట్టు, సహాయక ప్రాంతాలను వెంటనే గుర్తించి ఆ మేరకు ప్రజలకు సేవలందించాలని సూచించారు. బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఎంతో విశ్వాసంతో ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చారని, విపత్కర పరిస్థితుల్లో వారికి చేయూతనివ్వడం ధర్మంగా భావించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కూడా ఎప్పటికప్పుడు మాట్లాడాలని పూర్కొన్నారు. అధికారుల నుంచి ప్రజలకు అందించే సహాయక సమాచారాన్ని పొందాలన్నారు. ముంపు ప్రాంతాలు, వర్షాలతో సమస్యలకు గురయ్యే ప్రజలు 8790189289, 8982288088 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు భయందోళనలకు గురికావద్దని, అండగా ఉంటామని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

## విద్యార్థులు గ్రంథాయాలను ఉపయోగించుకోవాలి

### కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాయాలను బాగా ఉపయోగించుకుని ఎదగాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం కేయూ గ్రంథాలయంలో డాక్టర్ ఎ.నాగేశ్వర్‌రావు, లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జి డాక్టర్ రాధికారాణి అధ్యక్షతన లైబ్రరీ డే నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. లైబ్రరీ పితామహుడు రంగనాథన్ 133వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడారు. లైబ్రరీ సైన్స్ కోర్సుల్లో ఉద్యోగాలున్నాయని, వర్సిటీ మెయిల్ లైబ్రరీ మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. రోల్ ఆఫ్ లైబ్రరీయన్స్ ఇన్ ది డిజిటల్ ఎరా అనే అంశంపై రిటైర్డు అధ్యాపకుడు రమణయ్య కీలకోపన్యాసం చేశారు. ఎంఎల్ఐఎస్సీలో ప్రతిభ చూపిన వారికీ నందిగామ భాగ్యలక్ష్మి గోల్డ్ మెడల్‌ను ఇచ్చారు. ఉత్తమ లైబ్రరీయన్‌గా డాక్టర్ జి.రాజేశ్వర్‌కు మార్‌ను పింపిక చేసి అవార్డుతో సన్మానం చేశారు. పంతంగి హరిప్రియకు ఉత్తమ చదువరి అవార్డును ఇచ్చారు. ఈ కార్యక్రమం కేయూ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోషియేషన్, తెలంగాణ గ్రంథాలయ సంస్థ వరంగల్ శాఖ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సమావేశంలో అసోషియేషన్ బాధ్యులు వేదాంతం కృష్ణమాచార్య, డి.సత్యనారాయణ, ఎం.మనోహర్‌రావు, పి.ఐజాక్ ప్రభాకర్, జవహర్, కోటేశ్వర్‌రావు, డాక్టర్ కె.ఇంద్రాసేనారెడ్డి,నిరంజన్‌లతో పాటువిద్యార్థులు పాల్గొన్నారు.

**కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో..**

కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.సుజాత నేతృత్వంలో లైబ్రరీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ హాజరయ్యారు. లైబ్రరీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది టి.నర్మద, సంగాల రాజమౌళి, బి.ప్రభాకర్, మజార్ అలీ, సీనియర్ అసిస్టెంట్ డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**కేడీసీలో..**

హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్ ఎన్.భరత్ నేతృత్వంలో లైబ్రరీడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ హాజరై ఎంఎస్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. లైబ్రరీలో చదుకుకోవాలన్నారు. లైబ్రరీయన్ భరత్‌ను శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జీడబ్ల్యూఎంసీలో పాడైపోయిన ఫ్రిడ్జ్



మునిసిపల్ కార్పొరేషన్‌లో పాడైపోయిన ఫ్రిజ్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12 (ఆం ధ్రజ్యోతి): వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని ఫ్రిడ్జ్ పాడైపోయి చాలా కాలం అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.దీంతో నగర ప్రజలు, కార్యాలయంలోని సిబ్బంది మంచి నీటికి అల్లాడిపోతున్నారు. ఫ్రిడ్జ్‌ను మరమ్మతు చేయాలని, ఏలదా కొత్తది కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులకు సిబ్బంది ఫిర్యాదు చేసినా చలనం లేదన్నారు. ప్రతీరోజు పనుల కోసం నగర ప్రజలు జీడబ్ల్యూఎంసీ కార్యాలయానికి వస్తుంటారు. దాహం వేస్తే తాగడానికి మంచి నీరు కూడా లేదనే విమర్శలు వస్తున్నాయి. కమిషన్ దృష్టిసారించి ప్రజలకు ఉపయోగపడే మంచినీటి ఫ్రిడ్జ్‌ను మరమ్మతు చేయించి ప్రజలు, ఉద్యోగుల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

## పాలకుల విధానాలతో పేదలకు అందని విద్య



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వినాయకరెడ్డి

వడ్డెపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పాలకుల విధానాలతో పేదలకు విద్యా, వైద్యం అందని ద్రాక్షగా మారుతోందని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాలను మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఓంకార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(ఏఐఎఫ్‌డీవై), అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్య, వైద్యం - ప్రభుత్వ రంగం అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ వినాయకరెడ్డితో పాటు ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ.. విద్య వైద్యాన్ని పేద మధ్య తరగతి ప్రజానీకానికి అందనంత దూరంలో పాలక ప్రభుత్వాలు ఉంచాయని అన్నారు. ప్రభుత్వ రంగంలో కొనసాగాల్సిన విద్య, వైద్య రంగాలను నీరుగార్చి ప్రైవేటీకరణ పేరుతో పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించి దోచుకునేందుకు వీలు కల్పించారని దుయ్యబట్టారు. ప్రైవేటీకరణ, సరళీకరణ పేరుతో విద్య వైద్య రంగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. ఏఐఎఫ్‌డీవై - ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కర్ర రాజిరెడ్డి, పల్లె మురళి అధ్యక్షన నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థి యువజన సంఘాల నాయకులు పెద్దారపు రమేష్, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గడ్డం నాగార్జున, ఎన్. రెడ్డి, హంసారెడ్డి, మాస్ సావిత్రి, సుకన్య, ప్రతాప్, మంద రవి, కళావతి, సుల్తానాబేగం, రజియాబేగం పాల్గొన్నారు.

## తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు విస్తృత ఏర్పాట్లు



సమీక్షలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19, 20, 21 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ వేదికగా నిర్వహించనున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సూచించారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో టీఎస్‌సీ-2025 ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ, ఏర్పాట్లు, అతిథ్యంతో పాటు ఇతర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు హాజరయ్యే స్పీకర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల అవసరాలను చూడాలని అన్నారు. వివిధ టెక్నికల్ సెషన్లకు అనుగుణంగా వర్సిటీ క్యాంపస్‌లోని సెమినార్ హాల్‌లను అధునిక సాంకేతిక పరికరాలతో సిద్ధం చేయాలని అన్నారు. అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పూర్తిస్థాయిలో పాల్గొనాలని కోరారు. ప్రతీ దశలో వివరాలపై సమయానుకూలంగా సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీఎస్‌సీ-25 నిర్వహణ కమిటీ బాధ్యులు ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, డాక్టర్ ఎం.స్వర్ణలత, డాక్టర్ డి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దంచికొట్టిన వాన.. ముంచివేసిన వరద

- జనజీవనం అతలాకుతలం
- మత్తడి పోస్తున్న వడ్డెపల్లి చెరువు



జలదిగ్బంధంలో అంబేద్కర్ భవన్

వడ్డెపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హనుమకొండలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షానికి పలు కాలనీలు జలమయమయ్యాయి. వరద నీటి ఉధృతి పెరగడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అవస్థలు పడ్డారు. జనజీవనం అతలాకుతలమైంది. హనుమకొండ అంబేద్కర్ భవన్ రోడ్డులోని గోకుల్ నగర్, అశోకా కాలనీ, సమ్మయ్య నగర్, ఇంజనీర్స్ కాలనీ తదితర లోతట్టు కాలనీల ప్రజలు వర్షపు నీటితో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాంనగర్ ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు గోకుల్ నగర్‌తో పాటు అంబేద్కర్ భవన్‌ను ఆవరించాయి. దీంతో ప్రజలు ఉదయం నానా ఇబ్బందులు పడ్డారు. కాజీపేట మండలం సోమిడి ఊర చెరువు మత్తడి పడటంతో ఆ నీరంతా వడ్డెపల్లి చెరువులోకి చేరుకుంది. దీంతో ఉదయం నుంచి వడ్డెపల్లి చెరువు మత్తడి పోస్తోంది.

## షీటీం పీఎస్‌కు సీఐ నియామకమెప్పుడో...?

### 15 రోజులైనా కొత్త నియామకం లేదు

వరంగల్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీటీం పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐతో నడుస్తోంది. గతంలో ఇక్కడి పని చేసిన ఇన్‌స్పెక్టర్ కె.సుజాతను గత నెల 24న వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సుజాత బదిలీ అయి 15 రోజులు గడిచినప్పటికీ ఇప్పటివరకు కొత్త ఇన్‌స్పెక్టర్‌ను నియమించలేదు. అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సూర్యప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్‌లోని హనుమకొండ, కాజీపేట, వరంగల్ నగరాల్లో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ, ఈవ్‌టీజింగ్ చేసే వ్యక్తుల ఆగడాలను నియంత్రించేందుకు షీటీం పోలీసులు బ్యాచ్‌లుగా విడిపోయి ట్రైసిటీలో మఫ్టీలో విధులు నిర్వర్తిస్తున్నారు. అదే విధంగా కళాశాలలు, షాపింగ్‌మాల్స్ వంటి మహిళలు అధికంగా పనిచేసే ప్రాంతాల్లో మహిళల చట్టాలు, రక్షణ వంటి అంశాలపై ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కాగా, ఠాణాలో పనిచేసే సిబ్బంది, క్షేత్రస్థాయిలో మఫ్టీలో బయట నిఘావేసే సిబ్బంది పనితీరును పర్యవేక్షించడంతో పాటు ఆకతాయిల వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులకు రెగ్యులర్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేకపోవడంతో తక్షణ న్యాయం అందలేకపోతుందనే విమర్శలు వినిపిస్తోన్నాయి. రక్షణ చట్టాలపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలు సైతం నిలిచిపోయాయి. మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చే పోలీస్‌శాఖ మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీటీం పోలీస్‌స్టేషన్‌కు వెంటనే రెగ్యులర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని పలువురు వరంగల్ పోలీస్ కమిషనర్‌ను విజ్ఞప్తి చేస్తున్నారు.

## రెడ్డిగాండ్ల వారు బీసీలుగా గుర్తించబడరు



మాట్లాడుతున్న అఖిలభారత గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాము

జూలైవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రెడ్డి గాండ్ల కులానికి చెందిన వారు ఏనాటికి బీసీలుగా గుర్తించబడరని అఖిల భారత గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాము అన్నారు. మంగళవారం రెవెన్యూ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొంతమంది రెడ్డి గాండ్ల కులానికి చెందిన వారు ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తూ తప్పుదోవ పట్టిస్తూ బీసీలుగా గుర్తించబడాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 42శాతం ఉన్న బీసీలలో ప్రస్తుతం కొనసాగుతున్న రిజర్వేషన్లు వాడుకొని స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రెడ్డి గాండ్ల కులానికి చెందిన వ్యక్తులు తప్పుడు సమాచారంతో బీసీలుగా ధృవీకరణ పత్రాలు పొందారని, వారిని గుర్తించి ప్రభుత్వానికి అప్పగించామన్నారు. ఇదే విధానం కొనసాగిస్తే ఇతర బీసీ కులాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొల్లెపల్లి అన్నపూర్ణ, నాయకులు కోటయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జక్కం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసిన కార్పొరేటర్

## కాజీపేటలో రోడ్డు పనులకు శంకుస్థాపన

కాజీపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట 62వ డివిజన్ పోచమ్మ తల్లి దేవాలయ సీసీ రోడ్డుకు రూ.10 లక్షలతో స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ శంకుస్థాపన చేశారు. డివిజన్‌లో అన్ని కాలనీలలో రోడ్లు వేసేందుకు పెద్దఎత్తున ప్రణాళికలు చేస్తున్నామని కార్పొరేటర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంచు చంద్రయ్య, సుంచు సుధాకర్, రాజు చారి, వెంకన్న, గణేశ్, సారంగపాణి, రాము, రవి, ఏఈ విజయలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వర్సిటీ విశ్రాంత ఉద్యోగులకు క్రీడాపోటీలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు కేయూ విశ్రాంత ఉద్యోగులకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు ఉద్యోగుల సంఘం క్రీడా కార్యదర్శులు ప్రొఫెసర్ ఎం.ఎర్రగట్టు స్వామి, సంగాల గిడియన్‌లు మంగళవారం తెలిపారు. కేయూ క్రీడామైదానంలో జరిగే పోటీల్లో బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. 13న సాయంత్రం షటిల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ డబుల్స్ (పురుషులు, స్త్రీలు), టెన్నికాయిట్ (స్త్రీలు)ల పోటీలు జరుగుతాయని తెలిపారు. అలాగే ఆగస్టు 14న ఉదయం బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ (పురుషులు) ల పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు: హన్మకొండ

Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8519926489 ACM - 9985411664

ఫ్యాషన్

# రక్షణనిచ్చే రెయిన్ కోట్స్

**రెయిన్ కోట్లు వానకు తడవకుండా రక్షణ కల్పించడమే కాదు, సౌకర్యవంతంగా, ఆకట్టుకునేలా ఉండాలి. కాబట్టే నేడు రెయిన్‌కోట్లలో పలు రకాల పోకడలు పుట్టుకొచ్చాయి. వాటి గురించి తెలుసుకుందాం!**







వేర్వేరు రకాల రెయిన్‌కోట్స్ వేర్వేరు స్థాయిల్లో వానల నుంచి రక్షణ కల్పిస్తాయి. అవేంటంటే...

- **పాంచోస్:** ఇవి వదులుగా ఉంటాయి. ధరించడం కూడా తేలికే! పైనుంచి మోకాళ్ల వరకూ పొడవుండే ఈ రెయిన్‌కోట్స్‌కు హుడీ కూడా ఉంటుంది. భారీ వర్షంలో తల తడవకుండా ఉండడానికి ఈ ఏర్పాటు ఎంతో బాగా ఉపయోగపడుతుంది
- **రెయిన్ జాకెట్:** ఇవి పొట్టిగా, నడుము లేదా పిరుదుల వరకూ ఉంటాయి. తేలికగా ఉండే ఈ రెయిన్ జాకెట్స్ ధరించడం కూడా సులువే! వీటిని అందుకుని, చటుక్కున వేసేసుకోవచ్చు
- **వాటర్‌ప్రూఫ్ రెయిన్‌కోట్స్:** ఇవి నీటిని ఫ్యాబ్రిక్ గుండా లోపలకు చొరబడనివ్వవు. కుండపోత వర్షాల కోసం రూపొందిన ఈ రెయిన్‌కోట్స్, ఎక్కువసేపు కురిసే వానల నుంచి రక్షణనిస్తాయి
- **వాటర్ రెసిస్టెంట్ రెయిన్‌కోట్స్:** ఇవి తేలికపాటి వర్షాలు, తక్కువ సమయం పాటు కురిసే వానల నుంచి రక్షణ కల్పిస్తాయి. వాన కురిసే సమయం పెరిగితే, ఇవి తేమను పీల్చుకోవడం మొదలుపెడతాయి
- **వాటర్ రిపెల్లెంట్ రెయిన్‌కోట్స్:** వీటికి ప్రత్యేకమైన కోటింగ్ ఉంటుంది. దాని వల్ల నీరు రెయిన్‌కోట్ మీద నిలవదు. వీటి మీద డిడబ్ల్యుఆర్ (డ్యూరబుల్ వాటర్ రిపెల్లెంట్) అనే అక్షరాలు ముద్రించి ఉంటాయి. వాటిని వెతికి కొనుక్కోవాలి.
- **బ్రీతబుల్ రెయిన్‌కోట్స్:** ఈ రెయిన్‌కోట్స్ వాన నీటిని అడ్డుకోవడంతో పాటు, లోపలి నుంచి వేడి, తేమలు బయటకువెళ్లేలా చేస్తాయి. ఇవి రెయిన్‌కోట్ లోపల వేడి పెరగకుండా, చమట పట్టకుండా నియంత్రిస్తాయి.

## దోమకాటు నుంచి పిల్లలకు రక్షణ ఇలా...

వానాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటివల్ల పిల్లలకు చర్మ సంబంధిత అలెర్జీలు, రకరకాల వ్యాధులు వస్తూ ఉంటాయి. అలాకాకుండా చిన్నారులను దోమలబారి నుంచి ఎలా కాపాడాలో తెలుసుకుందాం...



- చిన్న పిల్లలకు పొడవు చేతులు ఉన్న షర్టులు, ప్యాంట్లు వేయాలి. ముదురు రంగులు దోమలను ఆకర్షిస్తాయి. కాబట్టి పిల్లలకు లేత రంగుల బట్టలు వేయాలి. చేతులకు, పాదాలకు నిర్దేశిత సాక్స్‌లు వేయడం మంచిది.
- మస్కిటో రిపెల్లెంట్ బ్యాడ్జెస్, పెండెంట్స్, ప్యాచెస్‌లను పిల్లలు వేసుకున్న డ్రెస్‌లకు జతచేయాలి. వీటిలో ఉండే యూకలిప్టస్, నిమ్మ, వేప, సిట్రోనెల్లా నూనెలు గాఢమైన వాసనలను వెదజల్లుతాయి. దీంతో దోమలు.. పిల్లల నుంచి దూరంగా వెళ్లిపోతాయి. ఈ నూనెలు సహజసిద్ధమైనవి. వీటి వల్ల పిల్లలకు ఎటువంటి అపాయమూ ఉండదు.
- దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలు, తలుపులకు మ్యాగ్నెటిక్ మస్కిటో స్క్రీన్‌లు లేదంటే మెష్‌లను ఏర్పాటు చేయాలి.
- పిల్లలు నిద్రిస్తున్నప్పుడు వాళ్లపై నెట్ గొడుగులు ఉంచాలి. మంచానికి దోమతెరను కట్టినా ప్రయోజనం ఉంటుంది.
- గదుల్లో, బాల్కనీల్లో సిట్రోనెల్లా, లావెండర్, బంతి పూల మొక్కల కుండీలు ఏర్పాటు చేస్తే దోమలు వెంటనే బయటికి వెళ్లిపోతాయి.

## కూరలో కారం ఎక్కువైందా?

ఒక్కోసారి కూరలో కారం ఎక్కువ అవుతూ ఉంటుంది. అలాంటి సందర్భాల్లో చిన్న చిట్కాలు పాటించి కూరను సరిచేయవచ్చు.



- కూర ఉన్న గిన్నెను స్టవ్ మీద పెట్టి రెండు నిమిషాలు వేడిచేయాలి. ఇందులో ఒక చెంచా శనగపిండి, కొన్ని నీళ్ల చుక్కలు చల్లి కలిపితే కారం తగ్గుతుంది. చివరలో ఉప్పు సరిచూసుకోవాలి.
- కూరలో ఒక చెంచా వెనిగర్ లేదంటే నిమ్మరసం కలిపితే కారం తగ్గుతుంది. కొద్దిగా చింతపండు గుజ్జు కలిపినాకూడా మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక ఆలుగడ్డను ఉడికించి తొక్క తీసి వేళ్లతో చిదిమి కూరలో వేసి కలిపితే కారం తగ్గుతుంది. చిటికెడు ఉప్పు చల్లితే కమ్మని రుచి వస్తుంది.
- సన్నగా తరిగిన కేరట్ ముక్కలు లేదంటే కొన్ని పచ్చి బఠాణీలు వేసి కొన్ని నీళ్ల చల్లి అయిదు నిమిషాలు కూరని ఉడికిస్తే కారం తగ్గుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక చెంచా నూనె వేసి వేడిచేయాలి. రెండు టమాటాలను సన్నగా తరిగి అందులో వేసి కలపాలి. చిటికెడు ఉప్పు చల్లి మగ్గనివ్వాలి. తరవాత చల్లార్చి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని కూరలో కలిపితే కారం తగ్గి చక్కని రుచి వస్తుంది.
- కొత్తిమీర, చుక్కకూర లేదంటే పాలకూర ఆకులను సన్నగా తరిగి కూరలో కలిపి స్టవ్ మీద పెట్టి అయిదు నిమిషాలు మగ్గిస్తే కారం తగ్గుతుంది.
- కొబ్బరి పాలు, వెన్న, పాల మీగడ, పెరుగు, పచ్చి కొబ్బరి తురుం, పుట్నాలపప్పు పొడి, బ్రెడ్ ముక్కలు, పన్నీరు ముక్కలు లాంటివి వేసి కలిపినా ప్రయోజనం ఉంటుంది.

విజేత

# విజయం ఆమెకు దాసోహమయింది

**సాధించాలన్న తపన... పట్టుదలగా ప్రయత్నించే తత్వం... ఇవే ఆమెను శిఖరం వైపు అడుగులు వేయించాయి. మానసిక వైకల్యాన్ని అధిగమించి... జాతీయ స్థాయి 'బోసీ బాల్' పోటీల్లో విజేతగా నిలిపాయి. ఎస్ తన్మయ్ శ్రీదేవి... విభిన్నమైన క్రీడలో విశేషంగా రాణిస్తున్న ఈ సెకండ్ ఇంటర్ విద్యార్థిని జర్నీ 'నవ్య' పాఠకుల కోసం...**

పశ్చిమగోదావరి జిల్లా... పెంటపాడు పోస్ట్ బేసిక్ పాఠశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది ఎస్ తన్మయ్ శ్రీదేవి. బాల్యం నుంచే మానసిక సమస్యతో ఇబ్బంది పడుతోంది. ఎవరితో ఎక్కువగా మాట్లాడటానికి ఇష్టపడదు. బాగా నచ్చితేనే మాట కలుపుతుంది. కానీ ఒక పనిని ఇష్టపడితే అది పూర్తయ్యే వరకు వదిలిపెట్టదు. ఆ పట్టుదలే ఆమెను నేడు నలుగురిలో గొప్పగా నిలిపింది. ఆటలో అత్యుత్తమంగా రాణించేందుకు దోహదపడింది.

### అమ్మ, అమ్మమ్మ అండతో...

తన్మయ్ పరిస్థితిని అర్థం చేసుకున్న తల్లి సుగుణ... చిన్నప్పటి నుంచీ అన్నింటా బిడ్డను వెన్నంటి ఉంటున్నారు. తాత, అమ్మమ్మలు కూడా అండగా నిలిచారు. తమ చిన్నారి అందరి పిల్లల్లా చదువుకోవాలని, ఆటపాటల్లో రాణించాలని కోరుకున్నారు. తద్వారా తన్మయ్ మానసిక పరిస్థితిలో కొంతైనా మార్పు వస్తుందని భావించారు. అందుకే తన్మయ్‌ను క్రమం తప్పకుండా బడికి పంపించారు. తనకు కావల్సినవన్నీ సమకూర్చుతున్నారు. "మా అమ్మాయి పుట్టినప్పుడు తనకు మానసిక సమస్య ఉందని మాకు తెలియదు. కొంచెం ఎదిగిన తరువాత తన ప్రవర్తన భిన్నంగా అనిపించింది. వైద్యులను సంప్రదిస్తే... తన్మయ్‌కి మానసిక సమస్య ఉందని చెప్పారు. అయినా నేను నిరుత్సాహపడలేదు. అందరు పిల్లల్లానే మా అమ్మాయి కూడా రోజు బడికి వెళ్లి బాగా చదువుకోవాలని కోరుకున్నాను. మా అమ్మానాన్నలు కూడా నాకు అండగా నిలిచారు. మొదట్లో తన్మయ్ స్కూల్‌కు వెళ్లేందుకు ఇష్టపడేది కాదు. ఎలాగో నచ్చజెప్పి పంపించేవాళ్లం. నిదానంగా తను బడికి అలవాటు పడింది" అంటూ తన్మయ్ తల్లి సుగుణ నాటి రోజులు గుర్తు చేసుకున్నారు.

### కోచ్ సహకారంతో...

చదువుతో పాటు తన్మయ్‌ను ఏదైనా ఆటలో పెడితే బాగుంటుందని ఆమె తల్లి భావించారు. కోచ్ సాయి స్వరూపను కలిశారు. ఆమె బోసీ బాల్‌లో శిక్షణ ఇస్తారు. కానీ తొలుత తన్మయ్ ఆటలపై ఆసక్తి చూపలేదు. "తన్మయ్‌ని ఈ ఆటలోకి దింపడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆడటానికి మొదట్లో తను అస్సలు ఇష్టపడలేదు. ఎన్నో ప్రయత్నాల తరువాత చివరకు తనను ఒప్పించాను. వైకల్యం ఉన్నవారిలో ఒక ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. దాన్ని వెలికి తీసి సాన పెడితే... వారూ మెరికల్లా తయారవుతారు. నేను చేసింది అదే. ఎప్పుడైతే తన్మయ్ సాధన ప్రారంభించిందో... అప్పటి నుంచీ వెనక్కి తగ్గలేదు. ఎంతో క్రమశిక్షణతో నేర్చుకుంది. ఆమెలో నైపుణ్యం గమనించి... మండల స్థాయి పోటీలకు పంపించాం. అక్కడ రాణించడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లింది. విజయాలు సాధించింది. మానసిక పరిపక్వత లేని ఒక అమ్మాయి అసాధారణ ప్రతిభతో ఆకట్టుకుంటోంది. నిజంగా ఇది గొప్ప విషయం"... అంటారు కోచ్ సాయిస్వరూప.



**చాలా ఆనందంగా ఉంది...**

నాకు చిన్నప్పటి నుంచీ స్కూల్‌కు వెళ్లడం ఇష్టం ఉండేది కాదు. మా అమ్మ, అమ్మమ్మ, తాతయ్య నన్ను బలవంతంగా బడికి పంపించేవారు. స్కూల్‌లోనే నేను ఈ ఆట నేర్చుకున్నాను. మా కోచ్ నన్ను బాగా చూసుకునేవారు. ఎంత విసిగించినా నన్ను ఒక్క మాట కూడా అనేవారు కాదు. నేను కూడా బాగా కష్టపడి సాధన చేశాను. అందుకే ఇప్పుడు ఇంతటి విజయాన్ని సాధించగలిగాను.

**- తన్మయ్ శ్రీదేవి**



తన్మయ్‌కి శిక్షణ ఇస్తున్న కోచ్ సాయిస్వరూప



### జాతీయ స్థాయిలో...

అంతటితో తన్మయ్ ప్రయాణం ఆగిపోలేదు. రాష్ట్ర స్థాయిలో సత్తా చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అందరి సహకారంతో మరింత ఉత్సాహంగా సాధన చేసింది. అనంతరం ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్‌లోని 'అటల్ బిహారీ వాజ్‌పేయి యూనివర్సిటీ'లో జరిగిన జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. మొత్తం 22 రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు ఇందులో పోటీపడ్డారు. వారందరినీ దాటి విజేతగా అవతరించి, స్వర్ణ పతకం సాధించింది తన్మయ్.

"నా కూతురు గెలుపు చూసి ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. మాటలు రావడంలేదు. ఈ విజయం అస్సలు ఊహించలేదు. ఒక తల్లిగా ఇంతకు మించిన సంతోషం నాకు ఏముంటుంది! మా అమ్మాయికి ఎల్లవేళలా మద్దతుగా నిలిచిన మా అమ్మానాన్నల రుణం తీర్చుకోలేనిది. అంతర్జాతీయ వేదికపై నా కూతుర్ని చూడాలన్నది నా కోరిక. త్వరలోనే అది నెరవేరుతుందని ఆశిస్తున్నాను" అంటూ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు సుగుణ.

**ఏమిటీ 'బోసీ బాల్'..?**

'బోసీ బాల్' అనేది ఒక ఇటాలియన్ క్రీడ. దీన్ని ఎవరైనా ఆడచ్చు. 'స్పెషల్ ఒలింపిక్స్' ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం దీన్ని నిర్వహిస్తుంది. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపి, సామాజికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తుంది. ఈ గేమ్‌లో ముందుగా టాస్ గెలిచిన అభ్యర్థి తనకు నచ్చిన బోసీ బాల్ రంగును ఎంచుకోవాలి. తరువాత 'పలినా' (టార్గెట్ బాల్) అనే తెల్ల బాల్‌కు సాధ్యమైనంత చేరువగా త్రో చేయాలి. తమకు కేటాయించిన నాలుగు బాల్స్‌ను ఇలా తెల్ల బాల్‌కు దగ్గరగా వేయాలి. ఎవరైతే అత్యంత చేరువగా వేస్తారో వాళ్లను విజేతగా ప్రకటిస్తారు.

● ఎం.సతీశ్, పెంటపాడు

స్ఫూర్తి

# అమెరికాలో మన తుపాకుల రాణి

**గన్స్, పిస్టల్స్, రైఫిల్స్... ఈ పేర్లు వినగానే అమ్మాయిలు ఉలిక్కిపడతారు. కానీ చండీగఢ్‌కు చెందిన అనహద్ సింగ్ కోహ్లీకి ఇవే క్రీడా వస్తువులు. స్వదేశంలో షూటింగ్ మీద పట్టు పెంచుకున్న ఈ 16 ఏళ్ల బాలిక, అమెరికాలో పతకాల పంట పండిస్తోంది. ఒలింపిక్స్‌లో పతకాల మీద గురి పెట్టిన అనహద్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి...**



అమెరికాలో పుట్టిన అనహద్ మూడేళ్ల వయసులో తల్లితండ్రులతో భారత్‌లోని స్వస్థలం చండీగఢ్‌కు చేరుకుంది. అప్పటి నుంచి గత మూడేళ్ల వరకూ అక్కడే ఉండిపోయిన అనహద్, త్రినేత్ర షూటింగ్ అకాడమీలో కోచ్, అర్పిత్ ఠాకూర్ ఆధ్వర్యంలో షూటింగ్‌లో శిక్షణ పొందింది. ఆ తర్వాత 2022లో అమెరికాకు వెళ్లిపోయి, స్వదేశంలో తీసుకున్న శిక్షణ సహాయంతో, అమెరికాలోని లఫాయిట్ గన్ క్లబ్‌లో షూటింగ్ నైపుణ్యాలను పెంచుకోగలిగే అర్హత సాధించింది. 1948లో వర్జీనియాలోని గ్రాఫ్టన్‌లో నెలకొల్పిన 28 ఎకరాల విస్తీర్ణంలోని ఈ గన్ క్లబ్‌కు దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఇక్కడ తీసుకున్న శిక్షణతో, సాల్వో ఓపెన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె స్వర్ణ పతకాన్ని గెలుచుకోగలిగింది. "అమెరికాలో నేనెన్ని పతకాలను గెలుచుకున్నప్పటికీ, సాల్వో ఓపెన్ మెడల్ గెలుచుకోవడం నాకెంతో సంతృప్తినిచ్చింది. అమెరికాలో షూటింగ్ ప్రతిభను, మెలకువలను మెరుగుపరుచుకోవడం నాకొక గొప్ప అనుభవం" అంటూ ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది.

### అమ్మ స్ఫూర్తితో...


శిమ్లాలో అనహద్ తాతయ్యకు తుపాకుల దుకాణం ఉండేది. అలాగే అనహద్ తల్లికి కూడా పిస్టల్‌ను షూట్ చేయడం తెలుసు. తుపాకీ పేల్చే తల్లిని చూసిన అనహద్ క్రమేపీ తుపాకుల మీద ఇష్టాన్ని పెంచుకుంది. అలాగే తాతయ్య దుకాణంలో కనిపించే పిస్టల్స్, గన్స్‌తో ప్రేమలో పడిపోయింది. అలా అనహద్, బాల్యంలో సంగ్రూర్‌లో స్టాండింగ్ 60 షాట్ ప్రెసిషన్ ఎయిర్ రైఫిల్ లేదా త్రీ పొజిషన్ ఎయిర్ రైఫిల్, స్మాల్ బోర్ పాయింట్ 22 షూటింగ్ పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టింది. ఆ పోటీల గురించి గుర్తు చేసుకుంటూ... "పిస్టల్ ఉపయోగించే ఆలోచనే నన్నెంతో ఆకర్షించింది. ఆ దృశ్యాలు ఇప్పటికీ నా కళ్ల ముందు మెదులుతూ ఉంటాయి. షూటింగ్‌లో మా అమ్మను ఆదర్శంగా తీసుకోడానికి అదొక కారణం" అని చెప్పుకొచ్చింది. అనహద్ కుటుంబంలో ఆమెకూ, ఆమె తల్లికీ మినహా మరెవరికీ తుపాకీల పట్ల ఆసక్తి లేదు. వాళ్ల కుటుంబంలో ఏ ఒక్కరూ షూటింగ్ క్రీడలో పాలుపంచుకోలేదు. ఆ విషయం గురించి మాట్లాడుతూ... "ఇది ప్రణాళికాబద్ధంగా ఎంచుకున్న క్రీడ కాదు. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగిపోయింది. పంజాబ్ సందర్శించినప్పుడు, ఆసక్తికొద్దీ అకాడమీలో కొన్ని షాట్స్ పేల్చాను. ఆ సమయంలో అక్కడున్న కోచ్, నాకు ఆ క్రీడ నేర్పించమని నాన్నను అడిగారు. అంతే, అప్పటి నుంచీ నాకు వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం రాలేదు. ప్రస్తుతం అమెరికాలో జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్‌కు చెందిన నేను, అలబామాలోని ఆనిస్టన్‌లో జరిగిన యుఎస్ నేవీ జెఆర్ఒటిసి జాతీయ పోటీల్లో రెండు రజత పతకాలు సాధించాను. సాల్వో ఓపెన్ షూటింగ్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్నాను. ముమ్ముందు ఈ క్రీడలో ఇంతకంటే మెరుగ్గా రాణిస్తానని ఆశిస్తున్నా" అంటోంది.

### షూటర్ లేదా పైలట్

మూడేళ్ల వయసులో భారత్‌కు తిరిగొచ్చి, పదేళ్ల పాటు షూటింగ్ నేర్చుకుని అమెరికాలోని వర్జీనియాకు తిరిగెళ్లిపోయిన అనహద్... "భారత్‌లో కోచ్ అర్పిత్‌లాగే, ఇక్కడ యుఎస్ నేవీ వెటరన్, జేసన్, కోచ్, మైక్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాను. నిజానికి భారత్‌లోనే ఈ క్రీడలో పైకి ఎదగాలనుకున్నాను. కానీ నేను అమెరికాలోనే పుట్టాను. కాబట్టి ఇక్కడికే తిరిగొచ్చేశాను" అంటూ వివరిస్తోంది. అమెరికాలో షూటర్లు నిలబడి తుపాకీ పేల్చడం కష్టంగా భావిస్తారు. కానీ పడుకుని, మోకాళ్ల మీద కూర్చుని తుపాకీ పేల్చడం కంటే నిలబడి పేల్చడమే తనకు సులువనిపిస్తోందని అంటోందామె. "అందరు క్రీడాకారుల్లాగే నాక్కూడా ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించాలని ఉంది. భౌతికంగా నేను అమెరికన్‌నే అయినా నా మనసంతా భారతీయమే! ప్రస్తుతం అమెరికాలోని జూనియర్ ఒలింపిక్స్ అగ్ర 30 షూటర్లలో నేను నాల్గో ర్యాంకును పొందాను. ముమ్ముందు భారత్ గర్వించదగిన షూటర్‌గా ఎదగాలని అనుకుంటున్నాను" అని అంటోంది అనహిద్. ప్రస్తుతం నేవీ నేషన్స్‌లో నాల్గవ స్థానంలో ఉన్న అనహద్, షూటర్‌గా ఎదుగుతాననీ లేదంటే, యుఎస్ఎ సైన్యంలో షూటర్‌గా లేదా కమర్షియల్ పైలట్‌గా ఎదుగుతాననీ అంటోంది. "షూటింగ్ నా తొలి ప్రేమ. గన్స్ పిస్టల్స్, రైఫిల్స్ నన్నెంతో ఆకట్టుకుంటూ ఉంటాయి. కాబట్టి ఈ క్రీడలో ఎదగడం కోసం శాయశక్తులా కృషి చేస్తాను. లేదంటే, కమర్షియల్ పైలట్‌గా మారతాను" అని అంటోంది.

## వంటకు ఏ నూనె వాడాలి..?

మనం ఇంట్లో రకరకాల వేపుళ్లతోపాటు పూరీ, వడ, పకోడీ లాంటి అల్పాహార వంటలు చేస్తూ ఉంటాం. వీటికి ఎక్కువగా నూనెను వినియోగించాల్సి ఉంటుంది. బజార్లో దొరికే నూనెలన్నింటినీ వంటకు ఉపయోగించడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. వంటకు ఏ నూనె ఆరోగ్యకరమో తెలుసుకుందాం...



- సమోసాలు, బజ్జీలు లాంటి డీప్ ఫ్రై వంటకాలు చేయడానికి పల్లీల నూనెను ఉపయోగించాలి. ఈ నూనెకు అత్యధిక స్మోక్ పాయింట్ ఉంటుంది. అంటే ఎక్కువగా వేడిచేసినప్పటికీ ఈ నూనె త్వరగా విచ్ఛిన్నం కాదు. దానిలోని పోషకాలు నశించవు. అలాగే హానికారక పదార్థాలు ఉత్పత్తి కావు. రైస్ బ్రాన్ ఆయిల్, అవకాడో ఆయిల్ కూడా ఈ కోవలోకే వస్తాయి.
- రోజువారీ చేసే కూరలు, పచ్చళ్ల కోసం ఆవ నూనెను వాడడం మంచిది. ఇది పసుపు, నలుపు రంగుల్లో లభిస్తుంది. రెండూ ఆరోగ్యానికి మంచివే. ఈ నూనెలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, న్యూట్రియెంట్స్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. దీన్ని వాడడం వల్ల వంటకాలకు మంచి రుచి, సువాసన చేకూరుతాయి.
- బజార్లో దొరికే రకరకాల రిఫైన్డ్ నూనెలు, పామాయిల్ లాంటి వాటిని వంటకు ఉపయోగించకూడదు. వీటిని ఎక్కువగా ప్రాసెస్ చేస్తూ ఉంటారు. కాబట్టి వీటివల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. గుండె జబ్బులు, జీర్ణ సంబంధిత వ్యాధులు, పలు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

**గమనిక**

మంగళవారం 'డాక్టర్' పేజీలో 'మనలో 40 మందికి క్యాన్సర్' అనే శీర్షికతో వచ్చిన వార్తలో- '40 శాతం మంది వారి జీవితంలో క్యాన్సర్ బారిన పడుతూ ఉంటారు' అని పొరపాటున ప్రచురితమయింది.

### ఏపీ రాజధాని రైతులను
# ఇబ్బంది పెట్టొద్దు!
**రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో వారి విజ్ఞప్తులు పరిశీలించండి**

**అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం**

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): 'రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రాజధాని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వరుస కథనాలు ప్రచురించింది. వీటిపై సీఎం చంద్రబాబు స్పందించారు. రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రైతుల విజ్ఞప్తులను పరిశీలించాలని, అయితే.. మాస్టర్ ప్లాన్ ప్రభావితం కాకుండా వాటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారాయణ.. వారం రోజుల్లోగా ఈ అంశాన్ని ఒక కొలిక్కి తెస్తామని సీఎంకు వివరించారు. గత వైసీపీ హయాంలో రాజధాని పనులు జరగకపోవడంతో నిర్మాణానికి తెచ్చిన ఇనుము, సామగ్రి తుప్పపట్టిపోయిందని కాంట్రాక్టర్లు సీఎం దృష్టికి తెచ్చారు. నిర్మాణం కోసం సేకరించిన ఇసుక నిల్వల్ని కూడా గత పాలకులు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఆ ఇసుకను భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సచివాలయంలో రాజధాని నిర్మాణ పనుల పురోగతి సహా వివిధ సంస్థలకు చేసిన భూకేటాయింపులు తదితర అంశాలపై సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

# ఏపీలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు

» **468 కోట్లతో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం**

» **ఒడిశా, పంజాబ్‌లో మరో3 ప్లాంట్లు**

అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దేశంలో నాలుగు చోట్ల రూ. 4,594 కోట్లతో చిప్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు ఓకే చెప్పింది. ఇందులో భాగంగా రూ. 468 కోట్ల పెట్టుబడితో ఏపీలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) సంస్థ సెమీ కండక్టర్ యూనిట్‌ను స్థాపించేందుకు ఆమోదముద్ర వేసింది. ఈ సంస్థకు ఏటా 9.6 కోట్ల చిప్‌లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఈ యూనిట్‌ను రాష్ట్రంలో స్థాపించాలంటూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఏఎస్ఐపీని ఆహ్వానిస్తూ లేఖ రాసింది. ఆ సంస్థ తెలిపిన సమ్మతిని కేంద్రానికి రాష్ట్రం వివరించింది. దీనికి కేంద్రం ఆమోదముద్రవేసింది. తిరుపతి ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో సెమీ కండక్టర్ యూనిట్‌ను స్థాపించేందుకు మార్గం సుగమమైంది. ప్రాథమికంగా రూ. 468 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సమ్మతి తెలిపిన ఏఎస్ఐపీ.. క్రమంగా పెట్టుబడులను విస్తరిస్తూ రూ. 1,500 కోట్లకు తీసుకువెళ్లే ఆలోచనలో ఉందని అధికారవర్గాలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాయి.

**రాయలసీమలో ఎలక్ట్రానిక్ క్లస్టర్..**

విశాఖపట్నం, రాజధాని నగరం అమరావతిలో సాఫ్ట్‌వేర్ పెట్టుబడులకు ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. రాయలసీమలో ఎలక్ట్రానిక్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఇప్పటికే విశాఖలో టీసీఎస్, కాగ్నిజెంట్ తదితర దిగ్గజ సంస్థలు కార్యాలయాల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని స్థాపిస్తున్నారు. 2014-19 మధ్య కాలంలోనే తిరుపతిని ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌గా ప్రకటించారు. తాజాగా ఏఎస్ఐపీ సెమీ కండక్టర్ యూనిట్ స్థాపనతో ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు మరింత జోరందుకోనున్నాయి. ఏఎస్ఐపీకి ఆహ్వానం పలుకుతూ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ రాసిన లేఖలో ఆ సంస్థకు ఇచ్చే రాయితీలను ప్రస్తావించారు. మూలధన పెట్టుబడిలో 25 శాతం రాయితీని ఇస్తారు. నామమాత్రం ధరకు భూమిని ఇస్తారు. ఐదేళ్ల పాటు విద్యుత్తును యూనిట్‌కు రూ. 1.50 చొప్పున రాయితీకి అందిస్తారు. అలాగే ఐదేళ్ల పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీకి మినహాయింపునిస్తారు. టర్మ్‌లోన్ వడ్డీపై ఐదేళ్లపాటు సబ్సిడీని ఇస్తారు. ఎస్‌జీఎస్టీని 100 శాతం మేర ఐదేళ్ల పాటు మినహాయిస్తారు.

**నాలుగు చోట్ల చిప్ ప్లాంట్లు**

దేశీయంగా చిప్‌లను తయారు చేసే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మద్దతునిస్తోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలో మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మొత్తం రూ. 4,594 కోట్లతో కొత్తగా నాలుగు సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వీటిని ఒడిశా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో రూ. 2,066 కోట్లతో సిలికాన్ కార్బైడ్ సెమీకండక్టర్ ప్లాంట్, అలాగే ఆ రాష్ట్రంలోనే రూ. 1,943 కోట్లతో 3డీ గ్లాస్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ. 468 కోట్లతో చిప్ ప్యాకేజింగ్ ప్లాంట్‌ను అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇన్ ప్యాకేజి టెక్నాలజీస్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. పంజాబ్‌లో సీడీఐఎల్ సంస్థ రూ. 117 కోట్లతో ఏటా 15.8 కోట్ల యూనిట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న యూనిట్‌ను ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని షియోమీ జిల్లాలో రూ. 8,146.21 కోట్లతో 700 మెగావాట్ల టాటో-2 జలవిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కేంద్రం ఆమోదించింది.

# భూగర్భ జలాల్లో భారీగా ఫ్లోరైడ్

» **రాష్ట్రంలోని 28 జిల్లాల్లో అత్యధికం!**

» **భూగర్భ జలాల నివేదిక-2024లో వెల్లడి**

» **దేశవ్యాప్తంగా 263 జిల్లాల్లో ఫ్లోరైడ్ సమస్య**

» **జలాలను భారీగా తోడేయడమూ కారణమే!**

హైదరాబాద్, ఆగస్టు 12: రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ సాంద్రత భారీగా పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన వార్షిక భూగర్భ జలాల నివేదిక-2024లో ఈ విషయం వెల్లడైంది. భూగర్భ జలాలను విపరీతంగా తోడేయడం కూడా ఫ్లోరైడ్ పెరగడానికి కారణమని పేర్కొంది. దేశంలోని మొత్తం 722 జిల్లాలకు గాను 263 జిల్లాల్లో భూగర్భ జలాల్లో పరిమితికి మించి ఫ్లోరైడ్ సాంద్రత ఉన్నట్లు వెల్లడించింది. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ గాఢత 1.5ఎంజీ/ఎల్‌కు మించరాదు. అయితే భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ గాఢత ఎక్కువగా ఉన్న జిల్లాలు 2017లో దేశవ్యాప్తంగా 207 ఉండగా.. 2023 నాటికి ఆ సంఖ్య 263కు పెరిగిందని వివరించింది. తెలంగాణలోని 33 జిల్లాలకు గాను 28 జిల్లాల్లో ఫ్లోరైడ్ గాఢత ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ గాఢత పెరగడానికి విపరీతంగా బోరు బావులను తవ్వడం కూడా కారణమని తెలంగాణ భూగర్భ జల విభాగం డైరెక్టర్ కె.లక్ష్మా తెలిపారు. పశ్చిమ, దక్షిణ భారత రాష్ట్రాల్లో భూగర్భ జలాలను భారీగా తోడేస్తున్నారని.. ఫ్లోరైడ్ పెరగడానికి ఇదో కారణమని భూగర్భ జల నివేదికలోనూ వెల్లడించింది. రాజస్థాన్ (43.17%), హరియాణా (23.66%), కర్ణాటక (17.68%), తెలంగాణ (17.87%), గుజరాత్ (13.92%), పంజాబ్ (13.77%), ఆంధ్రప్రదేశ్ (11.31%) రాష్ట్రాల్లో ఫ్లోరైడ్ ప్రభావం చాలా ఎక్కువగా ఉందని వివరించింది. అయితే వర్షాకాలం ముందు కంటే తర్వాత భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం కొంత మేరకు తగ్గుతోందని తెలిపింది. 2023లో వర్షాకాలానికి ముందు దేశంలోని వివిధ జిల్లాల్లో 9.14 శాతం ఫ్లోరైడ్ ఉండగా.. వర్షాకాలం తర్వాత 7.74 శాతానికి తగ్గిందని నివేదిక వెల్లడించింది. తెలంగాణలో సేకరించిన నమూనాల్లో ఇది 20 శాతం, 15.49 శాతంగా ఉన్నట్లు తెలిపింది.








FARNAZ


## చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## ప్రపంచానికి తెలియాల్సిన కథ



సత్యదేవ్ కథానాయకుడిగా 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' ఫేమ్ వెంకటేశ్ మహా తెరకెక్కిస్తున్న చిత్రం 'రావుబహదూర్'. మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. రాజవంశం నేపథ్యంలో సాగే సైకలాజికల్ డ్రామాగా సినిమా ఉండనుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేశ్ మహా మాట్లాడుతూ "ప్రపంచానికి తెలియాల్సిన తెలుగువారి కథ ఇది' అని అన్నారు. 'ఓ నటుడిగా ఇలాంటి పాత్రను పోషిస్తుండడం అదృష్టంగా భావిస్తున్నాను' అని హీరో సత్యదేవ్ అన్నారు. ఈ నెల 15న టీజర్‌ను విడుదల చేయనున్నారు మేకర్స్ వచ్చే ఏడాది వేసవికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


## ఆయనను పారితోషికంతో కొనలేం



\- త్రివిక్రమ్ శ్రీనివాస్

"సినీ పరిశ్రమలో ఆర్.నారాయణ మూర్తిది సుదీర్ఘ ప్రయాణం. కథాలోచన నుంచి సినిమాని ప్రేక్షకుడి వద్దకు తీసుకెళ్లే వరకూ ఆయన ఒక్కరే శ్రమిస్తారు. తాను తీసే ప్రతి సినిమాలోనూ ఏదో ఒక ప్రయోజనం ఉండాలనుకుంటారు. ఓ సినిమాలోని పాత్రకు నారాయణమూర్తిని అనుకున్నా. కానీ, పారితోషికంతో ఆయనను కొనలేం అని ఎవరో చెప్పారు' అని అన్నారు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. నారాయణ మూర్తి కొత్త చిత్రం 'యూనివర్సిటీ పేపర్ లీక్' చిత్రాన్ని ప్రసాద్ ల్యాబ్స్‌లో త్రివిక్రమ్ చూశారు. అనంతరం మాట్లాడుతూ 'ఈ చిత్రంలోని అంశాలు వెంటనే ఉత్తేజపరచవు. అయినప్పటికీ పట్టువిడవకుండా నడిపించారు. నిజాయతీతో పనిచేశారు. అది ఆయన సొంతం. దాని కోసమే నేను వచ్చాను. రాజీపడకుండా బతకడం అందరికీ సాధ్యం కాదు. నేను చాలా సార్లు రాజీపడ్డా' అని అన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'నాకు, త్రివిక్రమ్‌కు మధ్య ఎలాంటి ఆబ్లిగేషన్స్ లేవు. నా పట్ల, నా సినిమా పట్ల ఆయనకు అభిమానం ఉంది. 'యూనివర్సిటీ పేపర్ లీక్' చూసి దాన్ని ప్రేక్షకులకు చేరువయ్యేలా చేయాలని కోరా. నా విజ్ఞప్తిని మన్నించి, సినిమాను చూసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని అన్నారు.

## రజనీకాంత్ కూలీ.. సింగపూర్‌లో సెలవులు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, నాగార్జున విలన్‌గా నటించిన 'కూలీ' చిత్రం విడుదలకు అంతా సిద్ధమైంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మరికొన్ని గంటల్లోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ అంచనాలతో రూపుదిద్దుకున్న ఈ సినిమా కోసం ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. రజనీకాంత్ సినిమా అంటే మనదేశంలోనే కాదు విదేశాల్లో సైతం ఎంతో క్రేజ్ ఉంది. సింగపూర్‌లోని ఓ సంస్థ తమ దగ్గర పని చేసే తమిళ ఉద్యోగులకు 'కూలీ' విడుదల రోజున వేతనంతో కూడిన సెలవు ఇవ్వడం విశేషం. మరో సంస్థ ఇంకో అడుగు ముందుకు వేసి సెలవుతో పాటు 'కూలీ' సినిమా టికెట్, థియేటర్‌లో స్నాక్స్ కొనుక్కోవడం కోసం 30 సింగపూర్ డాలర్లు ఇవ్వడం ఇంకా విశేషం. అలాగే 'కూలీ' సినిమా చూడడం కోసం ఎస్‌బీ మార్ట్ సంస్థ అధినేత కృష్ణప్రకాశ్ నంబియార్ తన షాపు గురువారం ఉదయం ఏడు గంటల నుంచి పదకొండున్నర వరకూ మూసి ఉంటుందని ముందే బోర్డు పెట్టేశారు. రజనీకాంత్ ఫ్యాన్ ఫాలోయింగ్ అలా ఉంటుంది మరి!



## ధనుష్ మంచి మిత్రుడు మాత్రమే..

\- మృణాల్ ఠాకూర్

తమిళ హీరో ధనుష్‌తో హీరోయిన్ మృణాల్ ఠాకూర్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై స్పందించారు మృణాల్. ధనుష్ తనకు కేవలం మంచి మిత్రుడు మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే, 'సన్నాఫ్ సర్దార్ 2' స్క్రీనింగ్‌కు ధనుష్, అజయ్ దేవగణ్ కోరిక మేరకు వచ్చారని తెలిపారు. కాగా, ధనుష్, మృణాల్ ఇటీవల పలు సందర్భాల్లో కలసి కనిపించడంతో ఈ ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## ఇలాంటి చిత్రాలు మరెన్నో రావాలి



సముద్ర శివిక, సుప్రియ, నవీన్ మట్టా, రోహిల్, ఆదిల్, రూపేశ్ కీలక పాత్రధారులుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అన్నపూర్ణ తల్లి బువమ్మ'. సురేశ్ లంకవల్లి దర్శకత్వంలో సిరాజ్, ఖాదర్ గోరి నిర్మిస్తున్నారు. చిత్ర షూటింగ్ పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 'అన్నపూర్ణమ్మ అయిన డొక్కా సీతమ్మ గురించి ఇంతకు ముందు ఎవరికీ పెద్దగా తెలియదు. పవన్ కల్యాణ్ వల్ల ఆమె పేరు ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇలాంటి ఆదర్శవంతమైన చిత్రాలు నేటి సమాజానికి అవసరం' అని అన్నారు. డొక్కా సీతమ్మ పాత్రధారి శివిక మాట్లాడుతూ 'నా తొలి చిత్రమిది. అద్భుతమైన పాత్ర ఇచ్చారు. న్యాయం చేశాననే అనుకుంటున్నా' అని అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు సురేశ్ లంకలపల్లి, నిర్మాతలు సిరాజ్, ఖాదర్ గోరి, రాధికాధిపతి దాస్ ప్రభు, సాయి విజయేందర్ సింగ్ తదితరులు మాట్లాడారు.

## ఒక రోజు ఆలస్యంగా భేటీ

టాలీవుడ్‌లో సినీ కార్మికుల వేతనాలపై నెలకొన్న వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమస్యకు పరిష్కారం కోసం నిర్మాతలు, సినీ కార్మికులు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ఇరు వర్గాలు భేటీ కావాల్సి ఉండగా, నిర్మాతలు అందుబాటులో లేకపోవడంతో సమావేశం జరగలేదు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఓ లేఖను విడుదల చేసింది. 'వేతనాల పెంపునకు, పని పరిస్థితులపై చర్చించేందుకు బుధవారం మధ్యాహ్నం ఫెడరేషన్ నాయకులు ఫిల్మ్ ఛాంబర్‌కు రావాలని కోరుతున్నాం. కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ వీరశంకర్ ఆధ్వర్యంలో నిర్మాతల మండలి ప్రతినిధులతో ఫెడరేషన్ నాయకులు చర్చించనున్నారు' అని పేర్కొంది.

**న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం: వల్లభనేని అనిల్**

వేతనాల వివాదం ముగిసి, బుధవారం న్యాయం జరుగుతుందని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వేతనాలు పెంచాలని కోరుతూ తొమ్మిదో రోజు చిత్రీకరణలు ఆపాం. బుధవారం మధ్యాహ్నం జరిగే సమావేశంలో అందరికీ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. చిన్న నిర్మాతల గురించి, వర్కింగ్ కండిషన్లపై చర్చించనున్నాం. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను సినీహబ్‌గా మార్చాలనుకుంటున్న తరుణంలో సమ్మె మంచిది కాదని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి సూచించారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోమన్నారు. ఆ దిశగానే చర్చలు జరుపుతాం' అని అన్నారు.

**ఇంతే ఇవ్వాలి అనడం సబబు కాదు: రాహుల్ సంకృత్యాన్**

తెలుగు చిత్ర పరిశ్రమలో సినీ కార్మికుల వేతనాలపై తాజాగా, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ స్పందించారు. "ప్రతి ఏడాదీ బిజినెస్ మారిపోతుంటుంది. అలా సినిమా బడ్జెట్ మారిపోతున్న క్రమంలో ఇంతమందిని తీసుకోవాలి, ఇంతే ఇవ్వాలి అనడం సబబు కాదు. తన శక్తి మేర తన టీమ్‌ను సిద్ధం చేసుకునే స్వేచ్ఛ నిర్మాతకు ఉండాలి. ఎందుకంటే ఇక్కడ రిస్క్ అంతా ప్రొడ్యూసర్‌దే. ఆ విధానంలో పనిచేయాలా వద్దా అనేది వ్యక్తిగత నిర్ణయం. అలాగే, పెరిగిన ధరల దృష్ట్యా కార్మికులకు వేతన పెంపును కోరే హక్కు ఉంది. దానికి స్పందిస్తూ రూ.2000 కన్నా తక్కువ తీసుకుంటున్న కార్మికులకు వేతనం పెంచే నిర్ణయం తీసుకోవడం హర్షణీయం' అని పేర్కొన్నారు.




## అవన్నీ సినిమాకు సంబంధం లేనివి

\- కాంతార నిర్మాత

కన్నడ చిత్రం 'కాంతార' పాన్ ఇండియా స్థాయిలో ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. కేవలం రూ.15 కోట్లతో నిర్మిస్తే రూ.450 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. దీనికి సీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు రిషబ్ శెట్టి. అయితే ఈ చిత్రం షూటింగ్ మొదలైనప్పటి నుంచి వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏదైనా శాపం కారణంగా ఈ ప్రమాదాలు జరుగుతున్నాయేమో అంటూ కన్నడ ఇండస్ట్రీలో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత చలువే గౌడ క్లారిటీ ఇచ్చారు. సెట్‌లో ఒకే ఒక అగ్ని ప్రమాదం జరిగిందని, మిగతావన్నీ సినిమాకు సంబంధం లేనివేనని స్పష్టం చేశారు. 'కాంతార: చాప్టర్ 1' ప్రకటన చేసే ముందే మా టీమ్ అంతా పంజుర్లిని కలసి దేవుడి నిర్ణయం ఎలా ఉంటుంది? అని అడిగాం. 'కొన్ని అవరోధాలు ఏర్పడతాయి. అయినా మీరు ఈ కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు అని చెప్పారు' అని ఆయన పేర్కొన్నారు.

## 43 మంది కొత్తవారితో కల్ట్ కమర్షియల్



'ఏ స్టార్ ఈజ్ బార్న్' చిత్రం టైటిల్‌ను 'మ్యానిప్యూలేటర్'గా మార్చి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు దర్శకుడు వీజే సాగర్. కల్యాణ్, ప్రియా పాల్, సోఫియా ఖాన్. ఊహా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ దర్శకుడు బి.గోపాల్ ఆవిష్కరించారు. సినిమా విజయం సాధించాలంటూ ఆయన యూనిట్ సభ్యులకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సాగర్ మాట్లాడుతూ 'ఈ సినిమాతో 43 మంది కొత్త నటీనటుల్ని పరిచయం చేస్తున్నాం. నేటి యువతను దృష్టిలో పెట్టుకుని తీసిన కల్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది' అని చెప్పారు. రవిసాగర్, వీజే సాగర్ ఈ చిత్రానికి నిర్మాణసారథులు.

# రాజ్యసభలోనూ పాస్

## క్రీడా బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

**న్యూఢిల్లీ:** చారిత్రక జాతీయ క్రీడా పాలన బిల్లుకు ఉభయ సభల ఆమోదం లభించింది. లోక్‌సభలో నెగ్గిన 24 గంటల తర్వాత రాజ్యసభలో కూడా బిల్లు పాసైంది. రాష్ట్రపతి ఆమోదంతో త్వరలో చట్టరూపం దాల్చనుంది. జాతీయ డోపింగ్ నిరోధక సవరణ బిల్లుకు కూడా పార్లమెంట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు నిరసనగా విపక్షాలు వాకౌట్ చేసిన సమయంలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బిల్లును మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. '20 దేశాల్లో క్రీడా చట్టాలున్నాయి. భారత్‌ను 21వ దేశంగా నిలపమని కోరుతున్నా'నని సభలో చర్చ సందర్భంగా మాండవీయ వ్యాఖ్యానించారు. కొత్త బిల్లు కారణంగా పరిపాలనలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. అంతేకానీ ప్రభుత్వ నియంత్రణ, జోక్యం ఏమాత్రం ఉండవని స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వం బలప్రదర్శనతో బిల్లును పాస్ చేసుకొందని కాంగ్రెస్ పార్టీ నేత జైరాం రమేష్ విమర్శించారు. ఇది బీసీసీఐకి మేలు చేసేలా ఉందని ఎక్స్‌లో పోస్టు చేశారు.

### సరైన దిశగా..

క్రీడా బిల్లును భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, ఎంపీ పీటీ ఉష స్వాగతించింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి భారత్ బిడ్ వేసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో సరైన దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొంది. ఈ క్షణం కోసమే తాను ఎదురుచూస్తున్నట్టు సభలో తెలిపింది. దేశ క్రీడా రంగంలో నూతన బిల్లు ఓ మైలు రాయి అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కే ప్రశంసించాడు.



# గిల్ రాకతో.. సంజూకు చోటెక్కడ?

టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఆసియాకప్ టీ20 జట్టులో చోటు దక్కడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. దీంతో అతను ఏడాది విరామం తర్వాత పొట్టి ఫార్మాట్ ఆడబోతుండడంతో పాటు జట్టు వైస్ కెప్టెన్‌గానూ మారే అవకాశం ఉంది. అయితే, తన కెరీర్‌లో ఆడిన 21 మ్యాచ్‌ల్లో గిల్ ఓపెనర్‌గానే బరిలోకి దిగాడు. దీంతో ఆసియాకప్‌లోనూ అతను అభిషేక్ శర్మకు జతగా ఇన్నింగ్స్ ఆరంభించవచ్చు. అదే జరిగితే ఇప్పటిదాకా ఓపెనర్‌గా ఆడుతున్న సంజూ శాంసన్ పరిస్థితి ఏమిటన్న చర్చ మొదలైంది. భారత్ తరఫున 14 టీ20ల్లో టాపార్డర్‌లో బరిలోకి దిగిన శాంసన్ 182.20 స్ట్రయిక్ రేట్‌తో 512 పరుగులు సాధించాడు. అంతేకాకుండా ఓ క్యాలెండర్ ఏడాదిలో భారత్ తరఫున మూడు సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. ఇవన్నీ అతను ఓపెనర్‌గా సాధించినవే. ఇలాంటి నేపథ్యంలో శాంసన్‌ను మరో స్థానంలో ఆడించడం ఎంతమేరకు సబబనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### మూడో స్థానం తప్పదా?

శాంసన్ కెరీర్‌లో భారత్ తరఫున మూడు టీ20ల్లో మాత్రమే వన్‌డౌన్‌లో దిగాడు. అయితే ఓవరాల్‌గా ఈ ఫార్మాట్‌లో అతడికి మూడో స్థానంలో 133 ఇన్నింగ్స్ ఆడిన అనుభవముంది. 3 సెంచరీలతో 4,136 పరుగులు సాధించాడు. అందుకే ఆసియాకప్‌లో గిల్, అభిషేక్‌తో ఓపెనింగ్ చేయిస్తే ఆ తర్వాత స్థానంలో శాంసన్‌ను ఆడించడం ఉత్తమం. లేని పక్షంలో అతడికి బెర్త్ కష్టమే అవుతుంది. సహజంగా కెప్టెన్ సూర్యకుమార్ నెంబర్ 4లో వస్తుంటాడు. తిలక్, హార్దిక్ ఆ తర్వాత వస్తారు కాబట్టి శాంసన్‌కు ఓపెనర్‌గా కాకుంటే వన్‌డౌన్ స్థానమే సరిపోతుంది. ఇక, ఈ టోర్నీ కోసం శాంసన్ తన సన్నాహకాలను ఆరంభించాడు. మంగళవారం తిరువనంతపురంలోని ఓ స్టేడియంలో కేరళ పోలీస్‌లతో కలిసి ప్రాక్టీస్ చేసిన ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

## నాలుగోసారి ఐసీసీ అవార్డు

### శుభ్‌మన్ రికార్డు



**న్యూఢిల్లీ:** ఇటీవలి ఇంగ్లండ్ పర్యటనలో పరుగుల వరద పారించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. జులై నెలకుగాను గిల్ ఈ అవార్డును అందుకోనున్నాడు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్‌లను అధిగమించి గిల్ ఈ పురస్కారాన్ని దక్కించుకున్నాడు. ఇక, ఈ అవార్డుకు ఎంపికవడం గిల్‌కిది నాలుగోసారి. ఈ క్రమంలో అత్యధికసార్లు అవార్డు గెలుచుకున్న తొలి క్రికెటర్‌గా గిల్ సరికొత్త రికార్డు సృష్టించాడు.

## కారు కొన్నాడు కానీ..

### ఆకాశ్‌కు రవాణా శాఖ నోటీస్



**లఖ్‌నవూ:** భారత పేసర్ ఆకాశ్‌దీప్ ఎంతో ఇష్టపడి కొనుక్కున్న ఫార్చ్యూనర్ కారు కారణంగా వివాదంలో చిక్కుకున్నాడు. హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్ లేకుండానే ఆ వాహనాన్ని తిప్పుతున్నందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ అతడికి నోటీస్ జారీ చేసింది. నిబంధనల ప్రకారం ప్రతీ కొత్త వాహనం హై సెక్యూరిటీ నెంబర్‌ప్లేట్‌తోనే బయటికి రావాలి. మరోవైపు కారును రిజిస్ట్రేషన్ లేకుండానే అప్పగించినందుకు డీలర్ సన్నీ మోటార్స్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయడంతో పాటు నెలరోజుల నిషేధం విధించింది.

## హారికకు తొలి గెలుపు


### 'చెన్నై' చెస్‌లో అర్జున్‌కు డ్రా

**చెన్నై:** చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్‌లో ద్రోణవల్లి హారిక తొలి గెలుపును నమోదు చేయగా.. అర్జున్ ఇరిగేసికి మరో డ్రా ఎదురైంది. మంగళవారం జరిగిన ఓపెన్ ఆరో రౌండ్‌లో విన్సెంట్ కీమర్ (జర్మనీ)తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. నిహాల్ సరీన్, ప్రణవ్ పరాజయం పాలయ్యారు. ఆరు రౌండ్లు ముగిసే సరికి అర్జున్ 3.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. చాలెంజర్స్ విభాగంలో సహచర జీఎం వైశాలిపై హారిక నెగ్గింది. ఆరు రౌండ్లలో హారికకు ఇదే మొదటి విజయం కావడం విశేషం.

## బిహార్ క్రికెట్ సంఘం అంబుడ్స్‌మన్‌గా జస్టిస్ నాగేశ్వర రావు

**న్యూఢిల్లీ:** రిటైర్డ్ జడ్జి లావు నాగేశ్వర రావును బిహార్ క్రికెట్ సంఘం (బీసీఏ) అంబుడ్స్‌మన్‌గా సుప్రీం కోర్టు నియమించింది. బీసీఏలోని కొందరు ఆఫీస్ బేరర్లు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణల కేసుపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఆ రాష్ట్ర సంఘంలో క్రికెట్ కార్యకలాపాలు సవ్యంగా సాగేందుకు వీలుగా నాగేశ్వర రావు నియామకంపై ఆదేశాలు జారీ చేస్తున్నట్టు తెలిపింది. గతంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం కూడా అవినీతి సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు క్రికెట్ కార్యకలాపాల నిర్వహణ కోసం నాగేశ్వర రావు నేతృత్వంలో ఏకసభ్య కమిటీని సుప్రీం కోర్టు నియమించిన సంగతి తెలిసిందే.

## ఏజీఎం వరకు పదవిలో బిన్నీ..



బీసీసీఐ అధ్యక్షుడిగా రోజర్ బిన్నీ సెప్టెంబరు వరకు ఆ పదవిలో కొనసాగనున్నాడు. గతనెలలోనే బిన్నీకి 70 ఏళ్లు నిండాయి. అయితే, కొత్త క్రీడా బిల్లులో 75 ఏళ్ల వరకు వెసులుబాటు కల్పించారు. దీంతో సెప్టెంబరులో జరిగే వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) వరకు అతడి పదవికి ఢోకా లేదు. ఒకవేళ బోర్డు పెద్దల ఆశీస్సులుంటే మరోసారి కూడా అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉందని బోర్డు వర్గాలు తెలిపాయి. 2022 అక్టోబరులో సౌరభ్ గంగూలీ స్థానంలో బిన్నీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు.

## బ్రెవిస్ మెరుపు శతకం

● రెండో టీ20లో ఆసీస్‌పై దక్షిణాఫ్రికా గెలుపు



**డార్విన్ (ఆస్ట్రేలియా):** టీ20 ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా జైత్రయాత్రకు బ్రేక్ పడింది. మంగళవారం జరిగిన రెండో టీ20లో యువ బ్యాటర్ డివాల్డ్ బ్రెవిస్ (56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 125 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో ఆసీస్‌పై 53 పరుగులతో దక్షిణాఫ్రికా ఘనవిజయం సాధించింది. అలాగే ఆరు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలవగా, ఆసీస్‌కు తొమ్మిది వరుస టీ20 విజయాల తర్వాత ఇదే తొలి ఓటమి. అటు సఫారీలు కూడా ఆరు మ్యాచ్‌ల తర్వాత ఆసీస్‌పై నెగ్గారు. ముందుగా దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 218/7 స్కోరు సాధించింది. 41 బంతుల్లోనే శతకం బాదిన బ్రెవిస్ తమ జట్టు తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. అంతేగాక టీ20ల్లో సఫారీల తరఫున పలు రికార్డులను నెలకొల్పాడు. ఛేదనలో ఆసీస్ 17.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది. టిమ్ డేవిడ్ (50) మాత్రమే రాణించాడు. బాష్, మఫాకలకు మూడేసి వికెట్లు దక్కాయి.

## డుప్లాంటిస్..13వ సారి

### పోల్‌వాల్ట్‌లో మరో ప్రపంచ రికార్డు



**బుడాపెస్ట్:** పోల్‌వాల్ట్ కింగ్ అర్మాండ్ డుప్లాంటిస్ మరోసారి అసాధారణ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. పోల్‌వాల్ట్‌లో మళ్లీ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. మంగళవారం ఇక్కడ జరిగిన ఇస్త్వాన్ గ్యులాయ్ మెమోరియల్ మీట్‌లో డుప్లాంటిస్.. 6.29 మీటర్ల దూరంతో కొత్త ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. ఈ ఏడాది జూన్‌లో సొంతగడ్డపై జరిగిన స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో నమోదుచేసిన ప్రదర్శన (6.26 మీ.)కు ఇది ఓ సెంటీ మీటర్ అదనం. ఓవరాల్‌గా డుప్లాంటిస్‌కు ఇది 13వ ప్రపంచ రికార్డు కావడం విశేషం. 25 ఏళ్ల డుప్లాంటిస్.. తన కెరీర్‌లో ఇప్పటికే రెండు ఒలింపిక్ స్వర్ణాలు, రెండు ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణాలు గెలిచాడు.

## ప్రేయసితో రొనాల్డో నిశ్చితార్థం







**రియాద్:** ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన చిరకాల ప్రేయసి జార్జినా రోడ్రిగ్వెజ్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ విషయాన్ని జార్జినా సోషల్ మీడియా ద్వారా మంగళవారం ప్రకటించింది. నిశ్చితార్థం సందర్భంగా రొనాల్డో తనకు తొడిగిన ఉంగరం ఫొటోను 31 ఏళ్ల జార్జినా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. తొలిసారిగా 2016లో మాడ్రిడ్‌లోని ఓ షాప్‌లో కలుసుకున్న వీరిద్దరు.. అప్పటినుంచి కలిసే ఉంటున్నారు. కానీ, ఇన్నాళ్లకు తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించారు. రొనాల్డో ద్వారా జార్జినా ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. కాగా, 40 ఏళ్ల రొనాల్డోకు మరో ముగ్గురు సంతానం ఉన్నారు. వీరిలో ఒకరు రొనాల్డో మొదటి భార్యకు జన్మించగా.. మరో ఇద్దరిని రొనాల్డో సరోగసి ద్వారా కన్నాడు. మొత్తం ఐదుగురు పిల్లలు రొనాల్డో, జార్జినా వద్దే పెరుగుతున్నారు.

## దీప్తి@ 2

### ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్



**దుబాయ్:** టీమిండియా స్టార్ దీప్తి శర్మ ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో బౌలర్‌గా అగ్రస్థానానికి చేరేందుకు అడుగు దూరంలో నిలిచింది. మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి ఓ స్థానం మెరుగుపరచుకొని 732 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌కు ఎగబాకింది. ఇక, ఆస్ట్రేలియాకు చెందిన అనబెల్ సదర్లాండ్ (736) నెంబర్‌వన్‌గా నిలిచింది. ఆల్‌రౌండర్లలో దీప్తి శర్మ మూడో ర్యాంక్‌లో నిలిచింది. హేలీ మాథ్యూస్ టాప్ ఆల్‌రౌండర్‌గా ఉంది. బ్యాటర్ల జాబితాలో స్మృతీ మంధాన నెంబర్‌వన్ నుంచి రెండో ర్యాంక్‌కు పడిపోయింది. నాట్ సివర్ బ్రంట్ (ఇంగ్లండ్) టాప్ బ్యాటర్‌గా చోటు దక్కించుకుంది.

# బిజినెస్

## ఆర్‌సీ ప్లాస్టో నుంచి ట్యాంక్ స్టాండ్






హైదరాబాద్: వాటర్ స్టోరేజీ సొల్యూషన్స్ సంస్థ ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ లిమిటెడ్.. మార్కెట్లోకి ప్లాస్టో ట్యాంక్ స్టాండ్‌ను తీసుకువచ్చింది. వాటర్ ట్యాంకుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఈ స్టాండ్‌లను డిజైన్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. సాంప్రదాయ సిమెంట్ స్టాండ్స్‌తో ట్యాంక్ పగిలిపోవటం, నీరు లీకేజీ కావటంతో పాటు ట్యాంక్ చుట్టుపక్కల చెత్తా చెదారం పేరుకుపోతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని వంద శాతం ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో ప్లాస్టో ట్యాంక్ స్టాండ్‌ను డిజైన్ చేసినట్లు తెలిపింది. ఏడు అంగుళాల ఎత్తుతో కూడిన ఈ స్టాండ్‌తో ట్యాంక్ కింది భాగంపై ఎలాంటి ఒత్తిడి పడదని పేర్కొంది. అంతేకాకుండా ట్యాంక్ చుట్టుపక్కల శుభ్రంగా ఉంచవచ్చని తెలిపింది. పదేళ్ల వారంటీతో కూడిన ఈ స్టాండ్ దేశవ్యాప్తంగా ఉన్న ప్లాస్టో డీలర్ల వద్ద అందుబాటులో ఉంటుందని ఆర్‌సీ ప్లాస్టో వెల్లడించింది.

## తగ్గిన నాట్కో లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.480 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం లాభం రూ.668 కోట్లతో పోల్చితే 28 శాతం క్షీణించింది. అమెరికా ఉత్పత్తుల పోర్టు ఫోలియోపై ధరల ఒత్తిడి, ఆర్ అండ్ డీ వ్యయాలు గణనీయంగా పెరగటం కంపెనీ పనితీరుపై ప్రభావం చూపించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.1,410 కోట్ల నుంచి రూ.1,390 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో కంపెనీ ఏపీఐ వ్యాపారం రూ.52.6 కోట్లుగా ఉండగా దేశీయ ఫార్ములేషన్స్ వ్యాపారం రూ.107 కోట్లు, ఫార్ములేషన్స్ ఎగుమతులు రూ.1,126.50 కోట్లుగా ఉన్నాయి. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ బోర్డు రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.



# అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల్లో అంబానీలదే హవా

## రూ.28 లక్షల కోట్లతో అగ్రస్థానం.. దేశ జీడీపీలో 12 శాతానికి సమానం

అదానీ గ్రూప్ రూ.14 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో పోలిస్తే డబుల్..

జాబితాలో 14 తెలుగు కుటుంబ వ్యాపారాలు.. బార్‌క్లేస్-హురున్ సంయుక్త నివేదిక విడుదల

అత్యంత విలువైన 300 ఫ్యామిలీ బిజినెస్‌ల మొత్తం విలువ రూ.134 లక్షల కోట్లు

ముంబై: ఈ ఏడాదికి గాను దేశంలోని తొలి తరం పారిశ్రామికవేత్తలు, వారసులకు చెందిన అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల జాబితా మంగళవారం విడుదలైంది. బార్‌క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్, హురున్ ఇండియా సంయుక్తంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. వారసుల నిర్వహణలోని విలువైన వ్యాపారాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ కుటుంబానిదే అగ్రస్థానం. అంబానీ కుటుంబ వ్యాపార విలువ రూ.28.23 లక్షల కోట్లు. తొలి తరం కుటుంబ వ్యాపారాల్లో నం.1గా ఉన్న అదానీ గ్రూప్ విలువ రూ.14.01 లక్షల కోట్లతో పోలిస్తే రెండింతలు ఇది. అంతేకాదు, దేశ జీడీపీలో దాదాపు 12 శాతానికి సమానం. ఈ లిస్ట్‌లో అంబానీకి అగ్ర స్థానం లభించడం ఇది రెండోసారి. గత ఏడాదితో పోలిస్తే, ఈ కుటుంబ వ్యాపార విలువ 10 శాతం పెరిగిందని బార్‌క్లేస్-హురున్ రిపోర్టు వెల్లడించింది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన కుమార మంగళం బిర్లా కుటుంబం రూ.6.47 లక్షల కోట్ల విలువతో రెండో స్థానంలో ఉండగా.. జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన జిందాల్ ఫ్యామిలీ రూ.5.71 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో ఉంది. ఈ టాప్-3 కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ రూ.40.4 లక్షల కోట్లు. ఫిలిప్పీన్స్ జీడీపీకి సమానమిది. నివేదికలోని మరిన్ని విషయాలు..

● తొలి తరం కుటుంబ వ్యాపారాల్లో అదానీ గ్రూప్‌నకు చెందిన గౌతమ్ అదానీ ఫ్యామిలీ వరుసగా రెండోసారి నం.1గా నిలిచింది. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పూనావాలా కుటుంబం రూ.2.3 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో రెండో స్థానంలో ఉంది.

● తెలుగు వారి విషయానికొస్తే.. తొలితరం, మలితరం నిర్వహణలోని 14 కుటుంబాల వ్యాపారాలకు ఈ జాబితాలో చోటు దక్కింది. మలి తరం విభాగంలో 9, తొలి తరం నిర్వహణలో 5 కుటుంబ వ్యాపారాలున్నాయి. మలి తరం సారథ్య వ్యాపారాల్లో డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన ఫ్యామిలీ, తొలి తరం నాయకుల్లో దివీస్ లేబొరేటరీస్‌కు చెందిన మురళి దివి కుటుంబం అగ్రస్థానాల్లో ఉన్నాయి.

| ర్యాంక్ | కుటుంబం | కంపెనీ | విలువ (రూ.కోట్లు) |
|---|---|---|---|
| **మలి తరం నాయకుల నిర్వహణలోని తెలుగు కుటుంబ వ్యాపారాలు** | | | |
| 22 | సతీశ్ రెడ్డి, జీవీ ప్రసాద్ | డాక్టర్ రెడ్డీస్ | 1,07,200 |
| 104 | ప్రసాద్, అశ్విన్ దేవినేని | నవ లిమిటెడ్ | 17,200 |
| 115 | శ్రీనివాస్ రెడ్డి, కశ్యప్ రెడ్డి | మేధ సర్వో డ్రైవ్ | 14,900 |
| 116 | ఏ రంగ రాజు | ఎన్‌సీసీ | 14,500 |
| 121 | మహిమ దాట్ల | బయోలాజికల్-ఈ | 13,100 |
| 143 | అల్లూరి ఇంద్ర కుమార్ | అవంతి ఫీడ్స్ | 10,000 |
| 157 | కేశవ్ రెడ్డి | అరాజెన్ లైఫ్‌సైన్సెస్ | 8,400 |
| 205 | రాజు ఫ్యామిలీ | ఎన్‌పీసీఎల్ ఇండస్ట్రీస్ | 4,400 |
| 243 | గుప్తా ఫ్యామిలీ | డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ | 3,200 |
| **తొలితరం తెలుగు కుటుంబ వ్యాపారాలు** | | | |
| 3 | మురళీ దివి | దివీస్ లేబొరేటరీస్ | 1,80,000 |
| 5 | ప్రతాప్ సీ రెడ్డి | అపోలో హాస్పిటల్స్ | 1,04,200 |
| 6 | గ్రంధి మల్లికార్జున రావు | జీఎంఆర్ గ్రూప్ | 98,300 |
| 7 | పీపీ రెడ్డి ఫ్యామిలీ | మేఘా ఇంజనీరింగ్ | 85,300 |
| 20 | బొల్లినేని భాస్కర్ రావు | కిమ్స్ హాస్పిటల్స్ | 27,000 |

● ఈ లిస్ట్‌లోని అత్యంత విలువైన 300 కుటుంబాల సంపద 1.6 లక్షల కోట్ల డాలర్లు (రూ.134 లక్షల కోట్లు) పైమాటే. దేశ జీడీపీలో ఇది 40 శాతానికి సమానం. టర్కీ, ఫిన్లాండ్ దేశాల మొత్తం జీడీపీ కంటే కూడా అధికం. గడిచిన ఏడాది కాలంలో ఈ 300 కుటుంబ వ్యాపారాలు రోజుకు రూ.7,100 కోట్ల సంపదను సృష్టించాయి.

● ఈ 300 వ్యాపారాలు దేశంలో 20 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. అంటే, బ్రహెయిన్ మొత్తం జనాభా కంటే అధికం. కాగా, ఈ కంపెనీలు మొత్తం రూ.1.8 లక్షల కోట్ల పన్నులు చెల్లించాయి. గతసారి వసూలైన మొత్తం కార్పొరేట్ పన్నుల్లో 15 శాతానికి సమానమిది.

● ఈ లిస్ట్‌లోని 74 శాతం కంపెనీలు స్టాక్ మార్కెట్లో నమోదైనవే. రూ.85,800 కోట్ల విలువతో హల్దీరామ్ దేశంలో అత్యంత విలువైన అన్ లిస్టెడ్ కంపెనీగా ఉంది. ఈసారి జాబితాలోని 22 కంపెనీలకు మహిళలు సారథులుగా ఉన్నారు.

● జాబితాలోని కుటుంబ వ్యాపారాల మొత్తం సంపదలో టాప్-10 కంపెనీల వాటాయే దాదాపు 50 శాతం.

● రూ.1.58 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో వాడియా కుటుంబం జాబితాలో అత్యంత సుదీర్ఘ వ్యాపార చరిత్ర కలిగి ఉంది.

## అపోలో లాభం రూ. 433 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ నికర లాభం 42 శాతం వృద్ధి చెంది రూ.433 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.305 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 15 శాతం వృద్ధితో రూ.5,086 కోట్ల నుంచి రూ.5,842 కోట్లకు పెరిగింది. కీలకమైన హెల్త్‌కేర్ సర్వీసులు, డయాగ్నోస్టిక్స్, డిజిటల్ హెల్త్ వ్యాపారాలు మంచి పనితీరును కనబరచటం ఎంతగానో కలిసి వచ్చిందని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు.

## ఎన్‌జే బయోలో రూ.87 కోట్ల పెట్టుబడులు

● కోహన్స్ లైఫ్‌సైన్సెస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా అనుబంధ సంస్థ ఎన్‌జే బయో కార్యకలాపాలను విస్తరించేందుకు కోటి డాలర్లు (రూ.87.6 కోట్లు) పెట్టుబడిగా పెట్టనున్నట్లు కోహన్స్ లైఫ్‌సైన్సెస్ వెల్లడించింది. అంతర్జాతీయంగా కోహన్స్ కార్యకలాపాలు విస్తరించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు పేర్కొంది. న్యూజెర్సీలోని ఎన్‌జే బయో ప్లాంట్‌తో పాటు యాంటీబాడీ డ్రగ్ కాంజుగేట్ (ఏడీసీ) సొల్యూషన్స్ విభాగంలో సామర్థ్యాలు పెంచుకునే అవకాశం లభిస్తుందని తెలిపింది. కాగా హైదరాబాద్ ప్లాంట్‌లో రూ.23 కోట్ల పెట్టుబడితో కొత్తగా ఒలిగోన్యూక్లియోటైడ్ బ్లాక్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు కోహన్స్ లైఫ్‌సైన్సెస్ వెల్లడించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 13వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 485 | విజయవాడ | 520 |
| వరంగల్ | 487 | గోదావరి | 510 |
| చిత్తూరు | 548 | విశాఖపట్నం | 515 |
| | | డజను గుడ్లు రూ. | 72 |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 114 |
| వరంగల్ | 100 | గుంటూరు | 119 |
| కరీంనగర్ | 100 | ఒంగోలు | 119 |
| మహబూబ్‌నగర్ | 100 | చిత్తూరు | 93 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 98 |
| విశాఖపట్నం | 108 | అనంతపురం | 98 |
| గోదావరి | 114 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,01,400 ▼ | 92,950 ▼ | 1,25,000 ▼ |
| విజయవాడ | 1,02,800 ▼ | 96,800 ▼ | 1,16,600 ▼ |
| విశాఖపట్నం | 1,03,040 ▲ | 93,750 ▼ | 1,25,000 ▼ |
| రాజమండ్రి | 1,01,400 ▼ | 92,950 ▼ | 1,17,000 ▼ |
| ప్రొద్దుటూరు | 1,00,250 ▼ | 92,230 ▼ | 1,17,000 ▼ |
| ముంబై | 99,670 ▼ | 91,298 ▼ | 1,13,313 ▼ |

## అదానీలపై మోదీ సర్కారు ప్రేమ

### సమన్లు అందించడంలో అలసత్వం..అమెరికా ఎస్ఈసీ

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ సర్కారు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన దగ్గరి బంధువు సాగర్ అదానీలపై అలవిమాలిన ప్రేమ చూపిస్తోందని అమెరికా స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (ఎస్ఈసీ) పరోక్షంగా ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా కొన్ని రాష్ట్రాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం వీరు ముడుపులు చెల్లించినట్టు వచ్చిన ఆరోపణలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో తాము జారీ చేసిన సమన్లను.. మోదీ సర్కారు ఇప్పటికీ వారికి అందజేయలేదని న్యూయార్క్‌లోని ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి జేమ్స్ ఆర్ చో కి ఎస్ఈసీ తెలిపింది. గత ఏడాది నవంబరులో అదానీలపై తాము నమోదు చేసిన కేసుకు సంబంధించిన సమన్లను భారత్‌లో ఉంటున్న అదానీలకు అందజేయాలంటే భారత ప్రభుత్వ సహాయం తప్పనిసరని పేర్కొంది. వీరికి సమన్లు అందజేయమని ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి భారత ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖను కోరుతున్నా ఇప్పటి వరకు ఉలుకూపలుకు లేదని ఎస్ఈసీ కోర్టుకు తెలిపింది.

● ఐస్‌మేక్ రిఫ్రిజిరేషన్.. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.111.63 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.1.47 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.180.82 కోట్లుగా ఉండగా లాభం రూ.11.66 కోట్లుగా ఉంది. ఇన్‌పుట్ వ్యయాల్లో ఆటుపోట్లు, వ్యయాలు పెరిగిపోవటంతో పాటు ఇన్వెంటరీలను సర్దుబాటు చేసుకోవటం పనితీరుపై ప్రభావం చూపించిందని కంపెనీ తెలిపింది. కాగా వ్యాపార వాతావరణం పటిష్ఠంగా ఉన్నప్పటికీ స్వల్పకాలంలో మాత్రం పనితీరుపై ప్రభావం చూపించే వీలుందని పేర్కొంది.

● రెమెడియం లైఫ్‌కేర్ లాభాల బాటపట్టింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.4.64 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ 2.04 కోట్ల నష్టాలను నమోదు చేసింది. సమీక్షా కాలంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం రూ.113.36 కోట్లుగా ఉంది. రానున్న త్రైమాసికంలో ఇదే జోరును కొనసాగించవచ్చని అంచనా వేస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.

## 8 ఏళ్ల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: కూరగాయలు, తృణ ధాన్యాలు సహా పలు ఆహార వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా జూలై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 8 ఏళ్ల కనిష్ఠ స్థాయి 1.55 శాతానికి దిగి వచ్చింది. ఇది జూన్ నెలలో 2.1% ఉండగా గత ఏడాది జూలైలో 3.6% ఉంది. 2017 జూన్‌లో నమోదైన కనిష్ఠ ద్రవ్యోల్బణం 1.46% తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

## బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం మళ్లీ నష్టాల్లో ముగిశాయి. రోజంతా తీవ్ర ఊగిసలాటలకు లోనైన సెన్సెక్స్ చివరికి 368.49 పాయింట్ల నష్టంతో 80,235.59 వద్ద స్థిరపడింది. 80,997 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని, 80,164 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసిన సూచీ.. మొత్తంగా 833 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 97.65 పాయింట్లు కోల్పోయి 24,487.40 వద్ద క్లోజైంది.

# మా అబ్బ పార్టీ అనుకునే వారి వల్లే రాష్ట్రంలో బీజేపీ నాశనం

- వచ్చే రోజుల్లో రాక్షసులు నాశనమవుతారు
- పార్టీలో కొత్తగా చేరే వారు ఆలోచించాలి
- మీరు కోరుకున్నది ఏదీ జరగదు
- టికెట్ ఇస్తారనే గ్యారెంటీ ఏమీ ఉండదు
- 11ఏళ్లుగా అణిచివేత ఎదుర్కొంటున్నా
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): "హిందూత్వానికి, దేశానికి, సమాజానికి చాలా మంచి చేస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ. కానీ, ఇది మా అబ్బ పార్టీ. మేం చెప్పిందే జరిగి తీరుతుంది.. మేం రాసిందే రాజ్యమవుతుంది.. అని అనుకునే వాళ్ల వల్లే తెలంగాణలో బీజేపీ సర్వనాశనం అవుతుంది" అని ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. ఈ రోజు కాకపోతే రేపైనా తెలంగాణలో రాక్షసులు నాశనమవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "బీజేపీలో చేరుతున్న వారందరూ అప్రమత్తంగా ఉండాలి. పార్టీలో చేరే ముందు కొన్ని మాటలు యాది పెట్టుకోవాలి. వీలైతే రాసి పెట్టుకోవాలని ఆయన సూచించారు. పార్టీలో చేరిన తర్వాత మీరు కోరుకున్నది మీ నియోజకవర్గంలో, మీ జిల్లాలో జరగదు. మీ పై విశ్వాసంతో బీజేపీలో చేరిన కార్యకర్తలకు ఏ పదవీ ఇప్పించలేరు. ఎన్నికల వేళ మీకే టికెట్ వస్తదన్న గ్యారెంటీ కూడా ఉండదు. బీజేపీలో చేరే ముందు మీరు తొలి వరుస సీటులో ఉంటారు.. ఆ తర్వాత క్రమేణా చివరి సీటుకు వెళ్లిపోతారు. పార్టీలో చేరాక కొన్ని బాధలు కూడా భరించే శక్తిని పెంచుకోవాలి" అని సూచించారు. తన నియోజకవర్గంలో 11 ఏళ్లుగా అణచివేతను ఎదుర్కొంటున్నానని, మూడు సార్లు ఎమ్మెల్యేగా చేసినా.. కార్యకర్తల కోసం ఏమీ చేయలేకపోతున్నానని పేర్కొన్నారు. పార్టీలో చేరే వారు.. కొందరితో చర్చించుకొని వస్తే బాగుంటుందని అన్నారు. విజయశాంతి, జితేందర్ రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి.. ఇలా చాలా మంది వేరే పార్టీ నుంచి బీజేపీలో చేరి.. ఆ తర్వాత వెళ్లిపోయారని, అలాంటి వారితో చర్చలు జరిపితే బాగుంటుందన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని పేర్కొన్నారు.

# బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ సర్కార్

- ఆ రెండు పార్టీలు ఒక్కటే
- కాంగ్రెస్ డిక్లరేషన్‌లకు విలువ లేదు
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సర్కార్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ ఏ పద్ధతులైతే అవలంబించి ప్రజల ఛీత్కారానికి గురైందో ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ కూడా అదే విధానం కొనసాగిస్తోందని విమర్శించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బాలరాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రకటించిన డిక్లరేషన్‌లకు విలువలేదని స్పష్టం చేశారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా విపక్ష గొంతు నొక్కుతోందని ఆరోపించారు. అయితే ఈ అంశంలో బీఆర్‌ఎస్‌కు వెసులుబాటు ఇచ్చారన్నారు. 'మేం కాకుంటే మీరు.. మీరు కాకుంటే మేం అధికారంలో ఉంటాం.. అన్నట్లుగా ఆ రెండు పార్టీలు కూడబలుక్కుని వ్యవహరిస్తున్నాయి. అందులో భాగంగానే వాటి విమర్శలు, ప్రతివిమర్శలు ఉంటున్నాయి' అని బాలరాజు ఆరోపించారు. ఇక, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పొర్లుదండాలు పెట్టినా ప్రధాని కాబోరని విమర్శించారు.

# అన్నదమ్ములమని మాట ఇచ్చినప్పుడు తెలియదా?

- రేవంత్ రెడ్డికి సీఎం పదవి ఇచ్చినప్పుడు.. మాకు మంత్రి పదవులిస్తే తప్పేంటి..?
- అధిష్ఠానాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



నల్లగొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేవంత్ రెడ్డికి సీఎం పదవి ఇచ్చినప్పుడు తమ అన్నదమ్ముళ్లకు మంత్రి పదవులిస్తే తప్పేంటని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. తనను పార్టీలోకి ఆహ్వానించినప్పుడు.. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండోసారి మాట ఇచ్చినప్పుడు తాము ఇద్దరమూ అన్నదమ్ములమని తెలియదా..? అని నిలదీశారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఎలగలగూడెంలో మంగళవారం గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో తనకు మంత్రి పదవి ఇవ్వాలనే అంశంపై మరోసారి వ్యాఖ్యలు చేశారు. "నాకు మంత్రి పదవి ఇవ్వడానికి సమీకరణాలు కుదరలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అంటున్నారు. ఏ సమీకరణలు కుదరలేదు. మనసుంటే మార్గం ఉంటుంది. నాకు మంత్రి పదవి రాకుండా ఎవరు పుల్ల పెడుతున్నారు" అని ప్రశ్నించారు. వారి వ్యవహార శైలి ఒడ్డు దాటే వరకూ ఓడ మల్లయ్య, ఒడ్డు దాటాక బోడి మల్లయ్యలా ఉందని విమర్శించారు. "సమీకరణాలు కుదరలేదంటున్నారు. మరి, తొమ్మిదిమంది ఎమ్మెల్యేలున్న ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులుండగా, 11 మంది ఎమ్మెల్యేలున్న నల్లగొండకు ముగ్గురు మంత్రులుంటే తప్పా..?" అని ప్రశ్నించారు. తమ అన్నదమ్ముళ్లం తక్కువోళ్లమేం కాదని, ఇద్దరికీ ఇద్దరమేనని, గట్టి వాళ్లమేనని చెప్పారు.

### బీఆర్ఎస్ బీసీ సభ వాయిదా

ఈ నెల 14వ తేదీన కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన బీసీ సభ వాయిదా పడింది. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు. ఈ సభ తదుపరి నిర్వహణ తేదీని త్వరలో ఖరారు చేస్తామని వెల్లడించారు.

### క్షమాపణ చెప్పాకే సభపెట్టాలి: మేడిపల్లి సత్యం

రాష్ట్రంలోని బీసీలకు క్షమాపణలు చెప్పిన తర్వాతనే బీఆర్ఎస్ పార్టీ బీసీ సభ పెట్టుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హితవు పలికారు. పదేళ్ల పాలనలో బీసీలను పట్టించుకున్న పాపాన పోని ఆ పార్టీ నేతలకు బీసీ సభ పెట్టడానికి ఏం అర్హత ఉందని ఆయన ప్రశ్నించారు. ఒక వైపున ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ప్రభుత్వం ఉంటే.. మరో వైపున నిరుద్యోగులు, ప్రభుత్వం మధ్య అగాథాన్ని సృష్టించేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ ఆరోపించారు. అశోక్ అనే రాజకీయ శిఖండి డబ్బు సంపాదనకు రుచిమరిగి, ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాడని విమర్శించారు. అయన బీఆర్ఎస్ పార్టీ ఏజెంట్ అని ధ్వజమెత్తారు.

### బీజేపీ, ఎంఐఎం ఒకే నాణేనికి బొమ్మ, బొరుసులు

- ఓటు చోరీ అంశంపై ఫిరోజ్ ఖాన్

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఎంఐఎం పార్టీలు ఒకే నాణేనికి బొమ్మ, బొరుసులాంటివని కాంగ్రెస్ పార్టీ నాంపల్లి నియోజకవర్గ ఇంచార్జి ఫిరోజ్‌ఖాన్ అన్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం పార్టీ చేస్తున్నట్లుగానే దేశంలో బీజేపీ ఓట్లను చోరీ చేస్తోందని ఆయన ఆరోపించారు. నాంపల్లిలో నకిలీ ఐడీలతో దొంగ ఓట్లు వేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ మనుషులను గతంలో పట్టుకొని ఈసీకి ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోలేదని అన్నారు. ఎంఐఎం దొంగ ఓట్లపైన తాము ఐదేళ్లు కొట్లాడితే చనిపోయిన వారి పేర్లను మాత్రం తీసేశారన్నారు. నాంపల్లిలో ఓటు చోరీపైన తనవద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, కావాలంటే ఈసీకి డిక్లరేషన్ ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఓటు చోరీ అంశాన్ని రాహుల్‌గాంధీ వెలుగులోకి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. బీజేపీకి బీ టీమ్ అసదుద్దీన్ ఒవైసీ అని, ఓల్డ్ సిటీని చెత్తబుట్టగా మార్చిన ఆయనకు బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డును ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.

### బీజేపీ జేబు సంస్థగా ఈసీ : బీవీ రాఘవులు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం బీజేపీ జేబు సంస్థలా పని చేస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆరోపించారు. ఎన్నికల సంఘం ఎన్డీయే కూటమిలో ఓ పార్టీలా వ్యవహరిస్తోందని, అందులో భాగంగానే బిహార్‌లో ఎస్ఐఆర్(ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) చేపట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా 'రాజ్యాంగం- ఎన్నికల కమిషన్- దొంగ ఓట్లు' అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన హిట్లర్ రాజ్యాంగాన్ని తొలగించారని, మోదీ ప్రభుత్వం కూడా అదే తరహా పాలన చేస్తుందని తెలిపారు. బీజేపీ నియో ఫాసిస్టు విధానాలపై సెప్టెంబరు 12 దాకా నెల రోజుల పాటు దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కమ్యూనిస్టులంటే భయమని రాఘవులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా, మోదీ హయాంలో పార్లమెంట్‌కు ప్రాధాన్యం ఉండడం లేదని, ఎంపీలు ప్రశ్నిస్తే అణిచి వేస్తున్నారని ఈ సదస్సులో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు.

### వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

- ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే రాజీనామా చేస్తా: వీరయ్య

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచే బాధ్యత తాను తీసుకుంటానని, అలా చేయకపోతే చైర్మన్ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తానని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. స్థానిక సంస్థల్లో వికలాంగుల రిజర్వేషన్ల సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. 4.83 లక్షల మందికి రూ.200 కోట్ల పెన్షన్ ఇస్తోందని, కేంద్రం ఇవ్వాల్సిన పెన్షన్ విషయంలో మోసం చేస్తోందని ఆరోపించారు. వికలాంగుల పెన్షన్‌ను కేంద్రం రూ.300 నుంచి రూ.3 వేలకు పెంచే బాధ్యత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీసుకోవాలని, లేకపోతే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజకీయంగా ఎదగడం కోసం చివరికి వికలాంగులను కూడా వాడుకుంటోందని ఆరోపించారు. రాంచందర్‌రావు, కవిత వికలాంగుల సంక్షేమంపై బహిరంగ చర్చకు రావాలని వీరయ్య సవాల్ విసిరారు.

# 'అమ్మవారికి కుంకుమార్చన' ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

గృహనిర్బంధం చేయడం పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా పలువురు నేతలు మండిపడ్డారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వం ఇటీవల స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల స్థలంలో అమ్మవారి ఆలయం ఉండేది. అయితే గత నెలలో కొందరు ఈ ఆలయాన్ని విస్తరించేందుకు స్లాబ్ నిర్మిస్తుండగా.. షేక్‌పేట రెవెన్యూ అధికారులు తొలగించారు. దీనిని నిరసిస్తూ ధార్మిక సంఘాలు, బీజేపీ నేతలు కొద్దిరోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆ స్థలంలో చిన్న షెడ్డు ఏర్పాటు చేసి.. అందులో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం 'ఈ నెల 12న అమ్మవారికి బోనం సమర్పించడంతోపాటు, కుంకుమార్చన నిర్వహించాలి' అంటూ సోషల్ మీడియా వేదికగా ధార్మిక సంస్థలు ప్రచారం చేశాయి. దీంతో పోలీసులు మంగళవారం అక్కడికి వెళ్లే అన్ని దారులను మూసివేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా.. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేచినేని శ్రీనివాసరావు సహా పలువురు నేతలు అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి అమ్మవారి చిత్రపటానికి కుంకుమార్చన నిర్వహించారు. అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తార్నాకలోని ఆయన నివాసంలో గృహ నిర్బంధం చేసిన పోలీసులు

### రాంచందర్‌రావు గృహనిర్బంధం..

ధార్మిక సంస్థల పిలుపు నేపథ్యంలో పోలీసులు పలువురు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును తార్నాకలోని ఆయన నివాసంలో ఓయూ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాధవీలత, బీఆర్ఎస్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌ను గృహనిర్బంధం చేశారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులను అరెస్టు చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. కాగా, గృహనిర్బంధం విధించిన రాంచందర్‌రావు నివాసానికి పలువురు బీజేపీ నేతలు చేరుకుని ఆయనకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా యాత్రకు బయలుదేరేందుకు సిద్ధమవుతున్న తనను.. పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతున్నానంటూ హౌస్ అరెస్టు చేశారని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల అవివేకమైన చర్య అని మండిపడ్డారు. తనతోపాటు నగర వ్యాప్తంగా బీజేపీ శ్రేణులను ముందస్తు అరెస్టు చేయడం చూస్తే పెద్దమ్మ గుడి ధ్వంసం ఘటనలో రాష్ట్ర ప్రభుత్వ తప్పిదం ఉన్నట్లు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ హిందూ వ్యతిరేక ప్రభుత్వంగా మారిందని ఆరోపించారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకుంటానన్నారు.

### రాష్ట్రంలో అరాచక పాలన..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేయడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పెద్దమ్మ గుడికి హిందువులు పోతే తప్పేంటి? రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?" అని సంజయ్ ప్రశ్నించారు. ఆలయాన్ని కూల్చిన గూండాలను అరెస్టు చేయకుండా.. శాంతియుతంగా పూజలు నిర్వహించే హిందూ సంఘాల నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఒక వర్గం ఓట్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తోందని ఒక ప్రకటనలో ఆరోపించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నేతలను పోలీసులు గృహనిర్బంధం చేయడం దారుణమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. దేశభక్తి కార్యక్రమం (హర్ ఘర్ తిరంగా) చేయడం నేరమా?ఆలయ పూజలో పాల్గొనడం తప్పా? అని ప్రశ్నించారు. రాంచందర్‌రావును గృహ నిర్బంధం చేయడంపై ఆ పార్టీ నేతలు గంగిడి మోహన్‌రెడ్డి, ఎన్.వి.సుభాష్, కాసం వెంకటేశ్వర్లు తదితరులు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహ కార్యదర్శి చింతల వెంకన్న, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, ధర్మ ప్రసార్ రాష్ట్ర కోకన్వీనర్ సుభాష్ చందర్ ఆరోపించారు.





# సంజయ్.. సారీ చెప్పండి!

- బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసు
- 'ట్యాపింగ్'లో నాపై నిరాధార ఆరోపణలు
- మీ వ్యాఖ్యలతో నా పరువుకు భంగం
- వారంలో క్షమాపణ చెప్పకపోతే చర్యలు: కేటీఆర్
- లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు
- ఆట మొదలైంది: సంజయ్

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు తానే బాధ్యుడినంటూ సంజయ్ తనపై నిరాధార ఆరోపణలు చేశారని, దాంతో తన పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగిందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏడు రోజుల్లోగా తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో తనపై, తన కుటుంబ సభ్యులపై నిరాధార ఆరోపణలు చేయకుండా ఉండాలని బండి సంజయ్‌కి సూచించారు. లేదంటే ఆయనపై చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని బండి సంజయ్ అన్నారు. కేటీఆర్ పంపిన నోటీసులపై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. "ఆట మొదలైంది. లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు. నిజం ఒక సింహం.. దానిని విడిచిపెడితే అది తనను తాను రక్షించుకుంటుంది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా జీవితాలను నాశనం చేసిన నేరస్తులు బయటపడతారు. సత్యమేవ జయతే" అని సంజయ్ పోస్ట్ చేశారు.

# 'హ్యామ్'లో మార్పులు.. ఫైల్ మళ్లీ క్యాబినెట్‌కు!

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ యాన్యుయిటీ మోడ్ (హ్యామ్) విధానంలో రోడ్ల అభివృద్ధి అంశంలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ ఫైలు మళ్లీ క్యాబినెట్‌కు వెళ్లనుంది. మంగళవారం ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కార్యాలయంలో కాంట్రాక్టర్లు, బ్యాంకర్లు, వర్క్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యామ్‌పై కాంట్రాక్టర్లు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆర్ అండ్ బీలో 350 కి.మీ. మేర మాత్రమే రోడ్ల విస్తరణ పనులు ఉన్నాయని, మిగిలిన 4,840 కి.మీ. మేర అభివృద్ధి చేయాల్సిన రోడ్లేనన్నారు. ఈ పనులను హ్యామ్‌లో తీసుకుని, 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపట్టాలంటే ఆమోదయోగ్యం కాదని తెలిపారు. ఈ పనులు కోట్ల రూపాయల్లో ఉన్నాయని, చిన్న కాంట్రాక్టర్లు అంతపెద్ద మొత్తంలో ఎలా చేయగలరని ప్రశ్నించారు. ఓ కాంట్రాక్టర్ మాట్లాడుతూ 2015లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.3 వేల కోట్లతో 6-7వేల కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు, కొత్తవి నిర్మించామని, ఇప్పటికీ అవి ఎక్కడా పెద్దగా దెబ్బతినలేదన్నారు. మళ్లీ ఇప్పుడు అవే రోడ్ల అభివృద్ధికి హ్యామ్‌ను అనుసరించడంపై పునరాలోచన చేయాలని సూచించారు. ఒక రోడ్డు విస్తరణకు, దాని నిర్వహణకు కాంట్రాక్టరు వెచ్చించే సొమ్మును ప్రభుత్వం 15 ఏళ్లలో ఎలా, ఎంత చెల్లిస్తుందనే విషయంపై స్పష్టత ఇవ్వాలని కాంట్రాక్టర్లు అడిగారు. హ్యామ్‌లో కాంట్రాక్టర్లు 60 శాతం నిధులను బ్యాంకుల నుంచి తీసుకున్న తర్వాత ప్రభుత్వం సమయానికి బ్యాంకులకు చెల్లించకపోతే తమ రేటింగ్‌లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. చాలాచోట్ల సింగిల్ లేన్లనే అభివృద్ధి చేయాల్సి వస్తోందని, భవిష్యత్ అవసరాలకు దృష్టిలో ఉంచుకుని వాటిని విస్తరించాలని కొంతమంది కాంట్రాక్టర్లు సూచించారు. దీనికి తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధికారులకు సూచించారు. హ్యామ్‌లో మార్పులు చేర్పుల అంశాన్ని వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### డిప్లొమా ఇన్ మ్యాజిక్ కోర్సులకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025 విద్యా సంవత్సరానికిగాను డిప్లొమా ఇన్ మ్యాజిక్ కోర్సులో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు తమ దరఖాస్తులను అందజేసి నేరుగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన వారందరూ అర్హులేనని, వివరాల కోసం కోర్సు సమన్వయకర్త, ప్రముఖ మెజీషియన్ సామల వేణును 9059794553, 9246150156 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# తెలంగాణ రైజింగ్‌లో కాంట్రాక్టర్ల భాగస్వామ్యం కావాలి

- రోడ్ల అభివృద్ధితో ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి
- హ్యామ్ రోడ్ల సమావేశంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ప్రజలకు మెరుగైన రోడ్లు, సౌకర్యాల కల్పనే లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి
- తండాలు, పల్లెలకు రహదారి వ్యవస్థ బలోపేతం: మంత్రి సీతక్క







హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రోడ్ల అభివృద్ధితో పలు రూపాల్లో ఆదాయం పెరుగుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ హైటెక్స్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలోని పలు రోడ్లను హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్)లో అభివృద్ధి చేయాలని గుర్తించిన నేపథ్యంలో కాంట్రాక్టర్లు, బ్యాంకర్లు, వర్క్ ఏజెన్సీలతో నిర్వహించిన అవగాహన సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. హ్యామ్‌లో చిన్న కాంట్రాక్టర్లకు కూడా అవకాశం కల్పిస్తామని, తెలంగాణ రైజింగ్‌లో కాంట్రాక్టర్లు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్‌లో 7,947 కి.మీ, ఆర్అండ్‌బీలో 5,190 కి.మీ మేర రోడ్లను మొదటిదశలో అభివృద్ధి చేయాలని గుర్తించామన్నారు. కాంట్రాక్టర్లకు ప్రోత్సాహం కల్పించేందుకు బ్యాంకర్లతోనూ సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. గత ప్రభుత్వ పెద్దలు రూ.1.75 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ఒప్పందాలు చేసుకుని, రూ.45వేల కోట్ల విలువైన పనులకు టోకెన్లు జారీ చేశారని కానీ బకాయిలు చెల్లించకుండా వాటిని తమకు వారసత్వంగా ఇచ్చారని విమర్శించారు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ఇంకా కొన్ని రోడ్లను నాలుగులేన్లకు విస్తరించాల్సి ఉందని, వాటి జాబితా కూడా త్వరలో రూపొందించాలని అధికారులకు సూచించారు. కాగా తాము నిర్మించేది కేవలం రోడ్లే కాదని, తెలంగాణ ప్రజల జీవరేఖలని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ఆర్అండ్‌బీ పరిధిలో మొత్తం 12వేల కి.మీ రోడ్లను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయనున్నామని, వీటిలో మొదటిదశ కింద ఇప్పటికే 5,190 కి.మీలను గుర్తించామని చెప్పారు. మిగిలిన 6,810 కి.మీలకు డిసెంబరు తర్వాత టెండర్లు పిలిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం రీజినల్ రింగురోడ్డు, విజయవాడ-హైదరాబాద్ విస్తరణ, అలాగే హైదరాబాద్- అమరావతి కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని, త్వరలోనే వీటిని పట్టాలెక్కించేలా పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో మారుమూల పల్లెలు, తండాలకు రహదారి వ్యవస్థను బలోపేతం చేసేందుకు హ్యామ్ ప్రాజెక్టుతోనే శ్రీకారం చుట్టామని మంత్రి సీతక్క అన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన రహదారి వ్యవస్థను నిర్మించాలన్నదే సీఎం రేవంత్, ప్రజా ప్రభుత్వం సంకల్పం అన్నారు.

# పాత డ్రయర్.. నిర్వహణా లేదు!

**తుప్పు పట్టినా సిగాచీ యాజమాన్యం పట్టించుకోలేదు.. 12 ఏళ్ల నాటి స్ప్రే డ్రయర్ పేలడంతోనే ప్రమాదం**

- అగ్నిమాపక శాఖ ఎన్వోసీ తీసుకోలేదు
- ప్రమాదకర పరిశ్రమలో తీవ్రమైన లోపాలు
- యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- విచారణ కమిటీ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాశమైలారంలోని సిగాచీ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత కంపెనీ యాజమాన్యానిదేనా? ప్రమాదకరమైన పరిశ్రమ అని తెలిసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారా? అంటే విచారణ కమిటీ నివేదిక అవుననే అంటోంది. జూన్ 30న సిగాచీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. 41 మంది ఘటనా స్థలంలోనే మృతిచెందారు. 35 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు ఈ ఘటనపై విచారణకు కమిటీని ఏర్పాటు చేశారు. జూలై 5న కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అది మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసు, పరిశ్రమలు, అగ్నిమాపక శాఖ, వైద్యఆరోగ్యం, టీజీఐఐసీ, కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థలు జరిపిన విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలను ఈ నివేదికలో వెల్లడించారు. ఔషధ తయారీల్లో ఉపయోగించే మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ (ఎంసీసీ)ను ఈ కంపెనీ తయారుచేస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం ఇది రెడ్ క్యాటగిరీ పరిశ్రమ. తీవ్రమైన కాలుష్యంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశమూ ఎక్కువే. అయినప్పటికీ భద్రతా చర్యలు తీసుకోవడంలో కంపెనీ యాజమాన్యం విఫలమైందని నివేదికలో పేర్కొన్నారు.

### నిర్వహణను విస్మరించిన యాజమాన్యం..

ఎంసీసీ తయారీ సమయంలో ఈ ప్రమాదం జరిగింది. చెక్క గుజ్జును 120 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద రియాక్టర్‌లో వేడి చేశాక ఫిల్టర్ చేస్తారు. తర్వాత 80% నీటితో స్లరీగా మారుస్తారు. దీన్ని అటామైజర్ ద్వారా స్ప్రే డ్రయర్‌కు పంపుతారు. హాట్ ఎయిర్ జనరేటర్‌తో ఉత్పత్తి చేసిన వేడి గాలిని డ్రయర్‌లోకి పంపుతారు. ఇక్కడ ఉష్ణోగ్రత 205 డిగ్రీలుంటుంది. ఎంసీసీ తయారీ ప్రక్రియలో డ్రయర్ పాత్ర అత్యంత కీలకం. ఇలాంటి యంత్రాల వద్ద ప్రమాద అవకాశాలూ ఎక్కువే కాబట్టి నిపుణులు, సుశిక్షితులైన వారికే ఇక్కడ బాధ్యతలు అప్పగించాలి. యాజమాన్యం ఈ విషయాలను పట్టించుకోలేదు. 12 ఏళ్ల క్రితం గుజరాత్ నుంచి తెప్పించిన డ్రయర్‌నే ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు. డ్రయర్ నిర్వహణా సరిగా లేదు. ఇది పేలడం వల్లే ప్రమాదం జరిగింది. మండే స్వభావమున్న ముడిసరుకు భారీగా ఉండడంతో ప్రమాదం తీవ్రత పెరిగింది. పేలుడును నిరోధించే వెంట్‌లు, భద్రతా వాల్వులు లేవు. పాత డ్రయర్, కొన్ని చోట్ల తుప్పు పట్టినా యాజమాన్యం గుర్తించలేదు. రెడ్ క్యాటగిరీ పరిశ్రమ అయినప్పటికీ సిగాచీ సంస్థ.. అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్వోసీ) పొందలేదు. కనీస భద్రతా ప్రమాణాలూ పాటించలేదు. 1991లో పాశమైలారం పంచాయతీ నుంచి భవన ప్రణాళిక ఆమోదం పొందిన కంపెనీ.. తర్వాత ఎన్నడూ సవరించిన భవన ప్రణాళిక ఆమోదం తీసుకోలేదని నివేదికలో వెల్లడించింది.

### కనీస శిక్షణ లేని కార్మికులు..

కంపెనీలో పనిచేస్తున్న వారిలో నిపుణులైన సిబ్బంది లేరు. ఇలాంటి పరిశ్రమలో పనిచేసే కార్మికులకు భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. అయితే ఇక్కడి కార్మికులకు కనీస శిక్షణ కూడా లేదు. ప్రమాద సమయంలో ఉన్న 125 మందిలో 30 మంది రోజువారీ పనులు చేసే తాత్కాలిక కార్మికులున్నారు. వారిలో ఈఎస్ఐ ప్రయోజనం తక్కువ మందికి లభిస్తుంది. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 10 మందికి కంపెనీ ఎలాంటి బీమా ప్రయోజనం ఇవ్వలేదని నివేదిక తేల్చింది. ప్రమాదకరమైన కంపెనీ అయినప్పటికీ సొంత అంబులెన్స్ లేదని, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహనా కల్పించలేదని పేర్కొంది.

## ఔటర్ వెలుపలకు కాలుష్య పరిశ్రమల తరలింపు వేగవంతం

» అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెలుపలకు కాలుష్య కారక పరిశ్రమలను తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సబ్ కమిటీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్ సమావేశంలో పాల్గొన్నారు. వాణిజ్య పన్నులు, ఖనిజాలు - భూగర్భ వనరుల శాఖలు ఆదాయ ఆర్జనలో మెరుగైన పనితీరు కనబర్చాయని సబ్ కమిటీ సభ్యులు అభినందించారు. సమావేశంలో రాజీవ్ స్వగృహ, హౌజింగ్ బోర్డు కార్యకలాపాల ప్రగతి పైనా సమీక్షించారు

## పెట్టుబడులపై భట్టి, దుద్దిళ్లతో యూకే బృందం భేటీ

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులతో యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రతినిధి బృందం మంగళవారం సమావేశమైంది. వీరితో రాష్ట్రంలో మాల్స్, ఆస్పత్రులు, ఆతిథ్య (హోటల్) రంగాల్లో పెట్టుబడులకున్న అవకాశాలపై ఈ బృందం చర్చించింది. యూకే బృందంలో జైల్స్ మెంబ్రే, మార్క్ అప్టన్, కోనల్ ఫెర్రేట్, నాగెన్ సనత్‌కుమార్, సాయి రత్నాకర్ పెంటపాటి, ఫణి గుడివాడ, అభి కొమ్మాని తదితరులు ఉన్నారు.

## ప్రాజెక్టుల డిజైన్లపై దృష్టి పెట్టండి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో)ను ఆధునికీకరించాలని, సకాలంలో ప్రాజెక్టుల డిజైన్లు అందించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లికల్లు, డిండి ఎత్తిపోతల పథకం డిజైన్ల త్వరగా ఖరారు చేయాలని సూచించారు. మంగళవారం సీడీవో విభాగంపై నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజనీర్లు, ఇతర అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సీడీవోను బలోపేతం చేయడానికి తక్షణమే కొత్త నియామకాలు చేపట్టాలని సూచించారు. వందేళ్ల కింద డిజైన్ చేసి, నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉందని, అప్పట్లో డిజైన్లు సిద్ధం చేసిన వారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సిఫారసులతో సీడీవో ప్రతిష్ఠ మసకబారిందని చెప్పారు. సీడీవో పనితీరు పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని.. దీనికి ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. నీటిపారుదల శాఖలో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇంజనీర్లు ఉన్నారని, వారిని సీడీవోలో నియమించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సందర్భంగా సీడీవోలో సమస్యలపై మంత్రి ఆరా తీయగా.. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పరికరాల కొనుగోలులో జాప్యం జరుగుతోందని, తగిన శిక్షణ కూడా అవసరమని అధికారులు మంత్రికి తెలిపారు. ఆయా అంశాల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సీడీవో చీఫ్ ఇంజనీర్‌ను మంత్రి ఆదేశించారు.

## ఏపీతో తదుపరి చర్చల్లేవు!

» సాగునీటి ప్రాజెక్టులపై అటకెక్కిన అంతర్రాష్ట్ర కమిటీ

» బనకచర్లపై చర్చలు అవసరం లేదని సర్కార్ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గోదావరి నదులపై సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలపై చర్చల కోసం ఇరు రాష్ట్రాల అధికారులతో అంతర్రాష్ట్ర కమిటీ ఏర్పాటు విషయంలో ముందుకెళ్లరాదని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. గత నెల 16వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబుతో నిర్వహించిన సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. తెలంగాణ నుంచి ఐదుగురు, ఏపీ నుంచి ఐదుగురు, కేంద్ర జల వనరుల సంఘం నుంచి ఇద్దరు.. మొత్తం 12 మంది అధికారులతో ఇందుకు కమిటీ వేయాలని అప్పట్లో సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. వారం రోజుల్లో కమిటీ వేయాలని నిర్ణయించగా.. నెల రోజులు కావస్తున్నా.. ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ అక్రమంగా నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆ రాష్ట్రంతో చర్చలు జరపాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాకే.. కమిటీ దిశగా ముందుకు వెళ్లరాదని నిర్ణయించినట్లు సమాచారం.

## 24 నుంచి మహేశ్‌గౌడ్ పాదయాత్ర

జనహిత పేరుతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ చేపట్టిన పాదయాత్ర ఈ నెల 24న పునః ప్రారంభం కానుంది. 24న చొప్పదండి నియోజకవర్గంలో యాత్ర మొదలవుతుంది. 25న వర్ధన్నపేట నియోజకవర్గంలో కొనసాగుతుంది. 26న సాయంత్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంతో పర్యటన ముగుస్తుంది. ఆ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు(డీసీసీ), ఉమ్మడి జిల్లాల వారీ ఇన్‌చార్జ్‌లతో బుధవారం మీనాక్షీ నటరాజన్, మహేశ్ గౌడ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. స్థానిక ఎన్నికలు, పార్టీ నిర్మాణం, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై అభిప్రాయాలు తీసుకోనున్నట్లు సమాచారం.

## రెగ్యులర్ బస్సుల్లో చార్జీల పెంపు అవాస్తవం:ఆర్టీసీ

రాఖీ పౌర్ణమి సందర్భంగా రెగ్యులర్ బస్సుల్లో కూడా టికెట్ చార్జీలు పెంచినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని టీజీఎస్‌ఆర్టీసీ స్పష్టం చేసింది. కొంతమంది పనిగట్టుకుని ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా చేస్తున్నారని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఈనెల 7 నుంచి 11 వరకు నడిచిన స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలను సవరించామని, రెగ్యులర్ బస్సుల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేసింది.

## మరో రూ.1000 కోట్ల అప్పు

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఆ రుణాన్ని సేకరించింది. 7.33 శాతం వార్షిక వడ్డీ, 35 ఏళ్ల కాల పరిమితితో ఈ అప్పు తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణతో కలిపి దేశంలోని ఆరు రాష్ట్రాలు రూ.8,450 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి.

## దివ్యాంగుడి సమస్యపై కదిలిన అధికారులు

» ముత్యంపేటలో ఆర్డీవో విచారణ

మల్లాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రాజ గంగారాం అనే దివ్యాంగుడి పట్ల సిబ్బంది అమానుషంగా ప్రవర్తించడంపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో అతడి సమస్య పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాలతో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి మంగళవారం వెళ్లి దివ్యాంగుడు రాజ గంగారాం ఇంటిని సందర్శించి అతడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తన ఇంటికి దారి లేదని.. ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు స్పందించడం లేదని కొద్ది రోజుల క్రితం ప్రజావాణి కార్యక్రమంలో రాజ గంగారాం కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆర్డీవో ముత్యంపేట గ్రామానికి తహసీల్దార్ రమేష్‌తో కలిసి వెళ్లి రాజ గంగారాం సమస్యకు కారణాలు తెలుసుకొన్నారు. కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని ఆర్డీవో ఈ సందర్భంగా తెలిపారు.

# ఓరుగల్లు.. అతలాకుతలం!

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. అంతా ఇంటి డాబాలపైకి ఎక్కారు. గుడిసెలు, రేకుల ఇళ్లలోని వారు వరద మొదలవగానే ఇళ్లు విడిచి ఎత్తయిన ప్రాంతాలకు వెళ్లిపోయారు. సహాయక చర్యలు చేపట్టిన విపత్తు నిర్వహణ సిబ్బంది వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద బాధితుల కోసం ఐదు చోట్ల శిబిరాలు ఏర్పాటు చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లోకి భారీగా వరద చేరి పట్టాలు మునిగిపోయాయి. తర్వాత మెల్లగా వరద తగ్గడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగలేదు. మరోవైపు భారీ వర్షాలతో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో చిలుకల వాగు ఉధృతితో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో వందల ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సింగరేణి ఓపెన్ కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలు నిండిపోవడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీనితో హైదరాబాద్ నగరం పరిధిలో మూసీ నదిలో వరద పెరిగింది. ముందుజాగ్రత్తగా ముసారాంబాగ్ బ్రిడ్జిని తాత్కాలికంగా మూసివేశారు. కాగా, వరంగల్ జిల్లాలో భారీ వర్షాలకు ఆకేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఇక్కడి పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి కందికట్ల ఉప్పలయ్య (65) ఆకేరు వరదలో గల్లంతయ్యారు. సంగారెడ్డి జిల్లా యూసుఫ్‌పూర్ శివారులోని బ్రిడ్జిని దాటుతుండగా శ్రీనివాస్ అనే వ్యక్తి నీటి ఉధృతిలో కొట్టుకుపోయారు. మరోవైపు జనగామ జిల్లా రఘునాథపల్లి రైల్వే ట్రాక్ సమీపంలోని పెద్దవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. ఆ మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు.. అతడికి సుమారు 40-45 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు.

### 5 జిల్లాల్లో స్కూళ్లకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో.. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భువనగిరి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ బుధ, గురువారాలు సెలవు ప్రకటించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉదయం పూట మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని సూచించింది.



హైదరాబాద్‌లోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసిన దృశ్యం

### మంచంపై నిద్రపోయి.. అలాగే నీట మునిగి..

భారీ వర్షంతో వరంగల్‌లోని కాశికుంట వాంబే కాలనీలో ఒక్కసారిగా వరద పోటెత్తింది. ఆ వరద ఇంట్లోకి చొచ్చుకురావడంతో మంచంపై నిద్రిస్తున్న మానసిక వికలాంగురాలు పసునూటి బుచ్చమ్మ (80) అలాగే నీట మునిగి మృతిచెందారు. ఆమె కుమారుడు గతంలోనే మరణించడంతో.. కోడలు కళావతి, మనవరాలు కృపతో కలిసి ఉంటున్నారు. ఆమె మృతితో వారు విషాదంలో మునిగిపోయారు.



వరంగల్ హంటర్‌రోడ్డులో నీట మునిగిన లోతట్టు ప్రాంతం

### నేడు, రేపు అతిభారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లోని కొన్ని మండలాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఖమ్మం జిల్లాలోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో అతిభారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో మోస్తరు వానలు పడతాయని తెలిపింది గురువారం ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో కొన్ని మండలాల్లో 20 సెంటీమీటర్లకుపైగా, మిగతా చోట్ల 11-20 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ భారీ వర్షం పడుతుందని పేర్కొంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం.. వరంగల్ జిల్లా సంగెంలో అత్యధికంగా 20 సెంటీమీటర్ల వాన పడిందని, సూర్యాపేట జిల్లా నాగారంలో 18.7, తిరుమలగిరిలో 18, వరంగల్ జిల్లా ఖిలావరంగల్‌లో 15.7, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 13.2, వర్ధన్నపేటలో 12.8, జనగామ జిల్లా కొడకండ్లలో 12.3, సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

## ఐటీ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రం హోం' ఇవ్వండి

కంపెనీలు, ప్రభుత్వానికి హైడ్రా సూచన

2 రోజులు వాహనాలు బయటికి తీయొద్దని పిలుపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఐటీ ఉద్యోగులకు ఇంటి నుంచే పనిచేసే (వర్క్ ఫ్రం హోం) అవకాశం కల్పించాలని కంపెనీలను, ప్రభుత్వాన్ని కోరారు. వరద నీరు, ఇతర కారణాలతో ఏర్పడే ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రజలు వీలైనంత వరకు రెండు రోజుల పాటు వాహనాలు బయటికి తీయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డీఆర్ఎఫ్ హెల్ప్ లైన్ నంబర్లు 040-29560521, 90001 13667, 91541 70992, జీహెచ్ఎంసీ కాల్ సెంటర్ 040 - 21111111కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు.




### వానొస్తే బడి సంద్రమే!

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులను అధికారులు ట్రాక్టర్‌లో బయటికి తీసుకువస్తున్న దృశ్యమిది. ఇందులో 240మంది విద్యార్థినులు చదువుతున్నారు. సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పాఠశాల చుట్టూ భారీగా నీరు చేరింది. దీనితో అధికారులు సెలవు ప్రకటించి విద్యార్థినులను వారి ఇళ్లకు పంపారు.



### అంబులెన్సు రాలేక.. మంచంలో

భారీ వర్షంతో వరంగల్ జిల్లా సంగెం మండలం ఎల్గూరు రంగంపేట వెళ్లే దారిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరింది. గ్రామానికి చెందిన వడ్లకొండ పరమేశ్వర్‌కు మంగళవారం ఉదయం గుండెపోటు వచ్చింది. అంబులెన్సు గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో.. కుటుంబ సభ్యులు ఆయనను మంచంపై మోసుకుంటూ రైల్వే ట్రాక్ దాటివచ్చి అంబులెన్సులో ఎక్కించారు.

## గాంధీలో అందుబాటులో ఏడు ఎక్స్‌రే యంత్రాలు

ఈ నెలాఖారుకు మరో రెండు ఏర్పాటు

'గాంధీలో ఎక్స్‌రే రంధీ'పై

వైద్యాధికారుల స్పందన

అడ్డగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గాంధీలో తొమ్మిది ఎక్స్‌రే యంత్రాల్లో ఏడు అందుబాటులో ఉన్నాయని, ఈ నెలాఖారు నాటికి మరో రెండు యంత్రాలను ఏర్పాటు చేస్తామని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పేర్కొన్నారు. 'గాంధీలో ఎక్స్‌రే రంధీ' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానంపై ఆయన స్పందించారు. ఎక్స్‌రే యంత్రాల పనితీరు కారణంగా రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కావడం లేదని, ఒక రేడియాలజీ యంత్రాన్ని గచ్చిబౌలి టిమ్స్ నుంచి తీసుకొచ్చారని, దానిని ఏర్పాటు చేసే పని జరుగుతోందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం కొనుగోలు చేసిన యంత్రాల ఏర్పాటు ప్రక్రియ 22వ తేదీ నాటికి పూర్తవుతుందని చెప్పారు. స్మార్ట్‌ఫోన్ ఆన్ ట్యూన్ నివేదికలను తక్షణ చికిత్స, ప్రణాళిక కోసం ఏర్పాటు చేశామన్నారు. స్టాటిక్ ఫిల్మ్ అవసరం ఉన్న చోట, రోగుల వద్ద మొబైల్ ఫోన్లు లేకపోతే ఎక్స్‌రే ఫిల్మ్‌లను అందిస్తారన్నారు.

### మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్

'గాంధీ ఆస్పత్రిలో ఎక్స్‌రే రంధీ' అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, రేడియాలజీ విభాగం వైద్యులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం మధ్యాహ్నం రేడియాలాజీలోని పాడైపోయిన యంత్రాలను మరమ్మతు చేయడానికి ఓ టెక్నిషియన్ ఆస్పత్రికి చేరుకని పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో రెండు మినహా ఎనిమిది ఎక్స్‌రే యంత్రాల్లో కంపెనీ గ్యారంటీలో ఉన్న ఎక్స్‌రే యంత్రాలను బాగుచేయనున్నట్లు తెలిసింది.

# జల.. భద్రం!



## మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు

» కార్యాచరణతో అప్రమత్తంగా ఉండండి

» ఉద్యోగులకు సెలవులు రద్దు..

» అవసరమైతే బడులకు సెలవులివ్వండి

» కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాబోయే 72 గంటలపాటు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముందస్తు కార్యాచరణపై రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తప్పిదాలకు తావు లేకుండా.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న మూడు రోజులు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని నిర్దేశించారు. ఆకస్మిక వరదలు వస్తే లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు హెలికాప్టర్లను సిద్ధం చేసి పెట్టుకోవాలని చెప్పారు. హైదరాబాద్‌తోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండేందుకు వీలుగా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, వరదల సమయంలో రాకపోకలు లేకుండా చూడాలని సూచించారు. "పశువులు, మేకలు, గొర్రెల కాపర్లు తరచూ వరదల్లో చిక్కుకుపోతున్నారు. వారిని అప్రమత్తం చేయాలి. పశు నష్టం జరగకుండా చూడాలి" అని సూచించారు. అధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. "రెండు రోజుల్లో ఎంత వర్షపాతం వస్తుంది.. దానిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మనకు మాన్యువల్స్ ఉన్నాయి. కానీ, వాతావరణ మార్పులతో రెండు గంటల్లోనే రెండు నెలల వర్షపాతం కురుస్తోంది. క్లౌడ్ బరస్ట్‌తో ఊహించనంత నష్టం వాటిల్లుతోంది. ఈ పరిస్థితులను ఎదుర్కొనే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి. ఊహించనంత వర్షపాతం కారణంగానే గతంలో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ప్రాణ నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అటువంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లో పునరావృతం కావడానికి వీల్లేదు" అని నిర్దేశించారు. ఒకవేళ, పిడుగుపాటుతో పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే ఎఫ్ఐఆర్ నమోదు చేయించి బాధితులకు పరిహారం అందేలా చూడాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

### లోతట్టు ప్రాంతాల ప్రజలను హెచ్చరించాలి

ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి వచ్చే వరద నీటిపై అవగాహనతో ఉండాలని, నీటి విడుదలపై పూర్తి సమాచారం లోతట్టు ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలని, వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటల కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, అత్యవసర సమయంలో వినియోగించేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు, స్తంభాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పీహెచ్‌సీల్లో అత్యవసర మందులు సిద్ధం చేసి పెట్టుకోవాలన్నారు. గర్భిణులను తక్షణమే తరలించేలా అంబులెన్సులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

### హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భారీ వర్షాల నేపథ్యంలో నగరంపై కీలక శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సమన్వయంతో పని చేయాలని సీఎం రేవంత్ సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీసు, పురపాలక, విద్యుత్తు, విపత్తుల నిర్వహణ.. ఇలా అన్ని శాఖలూ సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు. వర్షాల తీవ్రతపై విద్య, ఐటీ శాఖ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష చేసుకుని అవసరమైతే పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని, ఐటీ కంపెనీలతో మాట్లాడి ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని హైడ్రాకు సూచించారు. అత్యవసర సమాచారాన్ని ఎఫ్ఎం రేడియో ద్వారా కూడా ప్రజలకు చేరవేయాలని తెలిపారు. వాతావరణ హెచ్చరికలను ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని, అదే సమయంలో మీడియా చానళ్లు ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్, డీజీపీ తదితరులు పాల్గొన్నారు.


# మూడో సారి తెరుచుకున్న శ్రీశైలం గేట్లు

» 4 గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కుల విడుదల

» సాగర్‌లో 18గేట్ల ద్వారా 1.44లక్షల క్యూసెక్కులు

» ఆల్మట్టి నుంచి జలాశయాలన్నీ ఫుల్

హైదరాబాద్/గద్వాల/నాగార్జున సాగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో మూడో సారి శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. భీమా, తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలానికి 2.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో నాలుగు గేట్లను ఎత్తి 1.08 లక్షల క్యూసెక్కులను సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల నుంచి 66 వేలు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,818, కల్వకుర్తి ఎత్తిపోతలకు 800, పోతిరెడ్డిపాడుకు 32,000 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదు అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.35 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరోవైపు.. ఎగువన ఆల్మట్టి ప్రాజెక్టుకు 32వేల క్యూసెక్కుల మేర వరద వస్తుండగా.. దిగువకు 30వేల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ నుంచి 64వేల క్యూసెక్కులు, తుంగభద్ర రిజర్వాయర్ నుంచి 31వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 1.77 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 18 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,44,864 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 7,086 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 3,910 క్యూసెక్కులను తరలిస్తుండగా.., విద్యుదుత్పత్తి కోసం 28,420 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(సామర్థ్యం 312.04టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 589.50 అడుగులుగా(310.5510 టీఎంసీలు) నమోదైంది. కృష్ణా బేసిన్‌లో అన్ని రిజర్వాయర్లు నిండుగా ఉండడంతో.. వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. కాగా, గోదావరిలో ఎగువ నుంచి పెద్దగా ప్రవాహం లేకపోవడంతో మహారాష్ట్రలోని జైక్వాడి తప్ప.. ఏ రిజర్వాయర్ కూడా నిండుగా లేదు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 5184 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 18 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దిగువ గోదావరిలో భారీ ప్రవాహం ఉన్నా.. నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. గోదావరిలో చిట్టచివరన రాజమహేంద్రవరంలో ఉన్నకాటన్ బ్యారేజీకి 1.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో కూడా అంతే ఉంది. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటిదాకా కృష్ణా పరిధిలో 105 టీఎంసీలు, గోదావరి పరిధిలో 894.724 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి.



## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.13.3కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

» బ్యాంకాక్ నుంచి తీసుకొస్తుండగా పట్టుకున్న డీఆర్ఐ

శంషాబాద్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన మహిళ గంజాయి తీసుకొస్తుండగా.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) అధికారులు పట్టుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ దాదాపుగా రూ.13.3 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన గుల్సాబాను అనే ప్రయాణికురాలు మంగళవారం తెల్లవారుజామున 6ఈ1088 ఇండిగో విమానంలో బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా, ముందస్తు సమాచారంతో డీఆర్ఐ అధికారులు ఆమె బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 13.3 కేజీల హైడ్రోపోనిక్ గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

### క్యాబ్ పికప్ పాయింట్ తిరిగి సీ పాయింట్‌కు

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్యాబ్ పికప్ పాయింట్‌ను తిరిగి సీ పాయింట్‌కు మార్చారు. గతంలో క్యాబ్ పికప్ పాయింట్‌ను హెచ్ పాయింట్‌కు మార్చడంతో తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ నిరసన వ్యక్తం చేసింది. ఈ నిరసనల కారణంగా విమానాశ్రయ నిర్వహణ అధికారులు పికప్ పాయింట్‌ను తిరిగి సీ పాయింట్‌కు మార్చాలని నిర్ణయించారు. ఈ మార్పు వల్ల ప్రయాణికులకు, క్యాబ్ డ్రైవర్లకు సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నిర్ణయం పట్ల క్యాబ్ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.7.10 కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయం

» సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ దాడుల్లో బయటపడ్డ వ్యవహారం

ఆమనగల్లు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం పోలేపల్లి గేటు సమీపంలోని సాయిరామ్ రైస్‌మిల్లుపై మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో రూ.7.10 కోట్ల సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశానుసారం ఈ దాడులు నిర్వహించారు. 2022-23 రబీ సీజన్‌లో సాయిరామ్ రైస్ మిల్లుకు సివిల్ సప్లై ద్వారా 3,347.96 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అందజేశారు. అందులో 1,980.13 మెట్రిక్ టన్నుల ధాన్యంతో పాటు గన్ని బ్యాగులు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. పక్కదారి పట్టిన ధాన్యం, గన్ని బ్యాగుల విలువ సుమారు రూ.7.10 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. మిల్లు యజమాని సత్యంపై కేసు నమోదు చేసినట్లుఅధికారులు తెలిపారు.

## 15 నుంచి ఫాస్టాగ్ ఉంటేనే తిరుమలకు

తిరుమల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తిరుమలకు ప్రయాణించే వాహనాలకు ఇక నుంచి ఫాస్టాగ్ తప్పనిసరి. ఆగస్టు 15 వేకువజాము 3 గంటల నుంచి దీనిని అమలు చేస్తారు. ఫాస్టాగ్ లేని వాహనాలను అలిపిరి టోల్‌గేట్‌లో ఆపేస్తారు. ఫాస్టాగ్ లేకుండా వచ్చిన వాహనదారులు ఇబ్బంది పడకుండా ఇక్కడి పొల్యూషన్ కౌంటర్ వద్ద ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో ఫాస్టాగ్ జారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

## బెట్టింగ్ యాప్ సంస్థల్లో ఈడీ సోదాలు

» హైదరాబాద్ సహా 15 చోట్ల తనిఖీలు

» రూ.2000 కోట్ల లావాదేవీల గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న పలు బెట్టింగ్ యాప్ సంస్థల కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో తనిఖీలు జరిపారు. ఈ సంస్థలు అంతర్జాతీయ స్పోర్ట్స్, బెట్టింగ్ సంస్థ 'పరిమ్యాచ్' పేరిట అక్రమంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు ఈడీ గుర్తించింది. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, జైపూర్, మదురై, సూరత్ తదితర 15 ప్రాంతాల్లో ఈడీ ముంబై జోనల్ యూనిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ముంబై సైబర్‌క్రైమ్స్ పోలీస్‌స్టేషన్‌లో 2024లో నమోదైన ఎఫ్ఐఆర్ మేరకు మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. ఈ అక్రమాల్లో దాదాపు రూ.2000 కోట్ల లావాదేవీలు చోటుచేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని సమాచారం.

## గురుకులాల్లో కలుషిత ఆహారంపై వివరణ ఇవ్వండి

» ప్రభుత్వాన్ని కోరిన హైకోర్టు

హైదరాబాద్, నాగర్‌కర్నూల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో ఇటీవల జరిగిన కలుషిత ఆహార ఘటనలపై ఈ నెల 28లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. జాతీయ బాలల హక్కుల కమిషన్ 2018లో జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, పరిశుభ్రమైన, నాణ్యమైన పోషకాహారం అందజేయాలని సూచించింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విషాహారం తిని 111 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 'పిల్'కు అనుబంధంగా న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ అప్లికేషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 3కు వాయిదా పడింది.

## గోషామహల్‌లో ఓజీహెచ్ నిర్మాణం సర్కారు నిర్ణయం

» హైకోర్టుకు నివేదించిన అడ్వకేట్ జనరల్

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్) నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అది ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయమని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఓజీహెచ్‌ను గోషామహల్ స్టేడియానికి తరలించడం చెల్లదని, అది స్థానిక ప్రజల హక్కులు, పర్యావరణం, జోనల్ రెగ్యులేషన్స్‌కు విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిగింది. దీనిపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏజీ వాదనలు వినిపిస్తూ ఇప్పటికే అన్ని అనుమతులు పొంది, నిర్మాణాలు సైతం ప్రారంభించినట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 26కు వాయిదా వేసింది.

## 118 ఏపీపీ పోస్టుల భర్తీకి 2 వారాల్లో నోటిఫికేషన్

» హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి రెండు వారాల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పరిధిలో 118 ఏపీపీ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ జూన్‌లో అనుమతి ఇచ్చింది. స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీ చేయనున్నారు. మొత్తం 262 ఏపీపీ పోస్టులు ఖాళీగా ఉండగా 118కి భర్తీకి అనుమతి లభించింది. ఆర్థిక శాఖ ఓకే చెప్పినా నోటిఫికేషన్ జారీ చేయడం లేదంటూ రామాంతపూర్‌కు చెందిన బొడ్డుపల్లి శ్రీనివాసులు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై మంగళవారం చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

## గురుకులాల్లో పార్ట్‌టైమ్ టీచర్ల నియామకం

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ గురుకుల పాఠశాలల్లో పార్ట్‌టైమ్ టీచర్ల నియామకానికి బుధవారం డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కొన్ని ఖాళీలు ఉండగా.. రాష్ట్ర స్థాయిలో కొత్తగా నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నియామక ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులు హైదరాబాద్‌లోని షేక్‌పేట ఎస్సీ గురుకుల పాఠశాల, మహిళా అభ్యర్థులు సరూర్‌నగర్‌లోని ఎస్సీ గురుకుల పాఠశాలలో హాజరు కావాల్సి ఉంటుంది.

# ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టండి



అటవీ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి సురేఖ

## అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెరిగేలా సౌకర్యాలు కల్పించాలి

» అటవీ జంతువుల దాడి బాధితులకు తక్షణ పరిహారమివ్వాలి

» అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని, మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే నదులు, జలపాతాలు ఉన్నందున ఉన్న వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెరిగేలా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అటవీ జంతువుల దాడిలో మృతి చెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రాన్ని సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. శాఖలో ప్రమోషన్లు, ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్తమ పనితీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని సూచించారు.

# 'ఖజానా'లో కాల్పులు

## చందానగర్‌లో పట్టపగలే రెచ్చిపోయిన దోపిడీ దొంగలు




హైదరాబాద్ సిటీ/చందానగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ మహానగరంలో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. చందానగర్‌లోని ఖజానా జువెలరీలో బీభత్సం సృష్టించారు. దుకాణం తెరిచిన కొద్దిసేపటికే.. చేతిలో పిస్తోళ్లతో లోపలికి దూసుకొచ్చి.. సిబ్బందిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి.. చేతికి దొరికిన వెండి ఆభరణాలతో ఉడాయించారు. వారి కాల్పుల్లో దుకాణం సిబ్బందిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఖజానా జువెలరీ దుకాణాన్ని ఎప్పట్లాగానే మంగళవారం ఉదయం 10.30 గంటలకు తెరిచారు. ఆ తర్వాత ఐదు నిమిషాలకే ద్విచక్రవాహనాలపై 10 మంది అక్కడికి వచ్చారు. వారిలో నలుగురు బయటే ఉండగా.. ఆరుగురు చేతిలో తుపాకులతో వేగంగా లోపలికి వెళ్లారు. లాకర్ తాళాలు ఇవ్వాలని సిబ్బందిని అడిగారు. తమవద్ద లేవని వారు చెప్పడంతో.. 'తాళాలు ఇస్తారా? చస్తారా?' అంటూ తమ తుపాకులను చూపించి పెద్దగా అరుస్తూ బెదిరించారు. తాళాలు ఇవ్వనందుకు.. దుకాణం డిప్యూటీ మేనేజర్ సతీష్ కాలుకు గురిపెట్టి కాల్చారు. దీంతో ఆయన అక్కడే పడిపోయారు. అనంతరం దుండగులు అక్కడే ఉన్న అప్రైజర్ ధనంజయ్‌ను.. గల్లా పెట్టె తాళాలు ఇవ్వాలని అడిగారు. ఆ తాళాలు తనవద్ద లేవని అతడు చెప్పడంతో.. అతడి ముఖంపై కొట్టి.. అక్కడే ఉన్న వెండి ఆభరణాలను తమ వెంట తెచ్చుకున్న బ్యాగుల్లో నింపుకొని అక్కణ్నుంచీ పారిపోయారు.

### ఆ సమయంలోనే ఎందుకు?

జాతీయ రహదారి పక్కనే.. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో.. ఉన్న దుకాణంలో ఉదయం 10.30 గంటల సమయాన్ని దోపిడీకి ఎందుకు ఎంచుకున్నారంటే.. ఆ సమయంలో ఉద్యోగులు తప్ప వినియోగదారులు పెద్దగా ఉండరనే ఉద్దేశంతోనే వారు ఆ సమయాన్ని ఎంచుకున్నట్టు భావిస్తున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు, కార్యాలయాలకు వెళ్లే వారితో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రద్దీగా ఉండే ట్రాఫిక్.. 10.30 గంటల సమయానికి కాస్తంత తగ్గుతుంది. చోరీ చేశాక అక్కణ్నుంచీ వేగంగా తప్పించుకోవడం సులువవుతుంది. దీనికితోడు.. షోరూం నుంచి బయటకు వచ్చాక పారిపోయేందుకు జాతీయ రహదారితో పాటు ఇతర దారులు ఉన్నాయి. అర కిలోమీటరు దూరంలో ఉన్న ధర్మపురి క్షేత్రం వైపు దట్టమైన చెట్లు ఉండడం, పాపిరెడ్డికాలనీ- హఫీజ్‌పేట్ మధ్యలో అడవులను తలపించే విధంగా చెట్లు ఉండడంతో అటుగా పారిపోవచ్చని దొంగలు భావించారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆస్పత్రిలో సతీష్..

దుండగుల కాల్పుల్లో గాయపడ్డ షోరూం డిప్యూటీ మేనేజర్ సతీష్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని పీఆర్‌కే అసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వైద్యులు ఆపరేషన్ చేసి ఆయన కాలిలో ఉన్న బుల్లెట్‌ను బయటకు తీశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. దుండగుల ఆచూకీ కనిపెట్టేందుకు ఖజానా జువెలరీతోపాటు.. చుట్టుపక్కల దుకాణాల బయట ఉన్న సీసీ ఫుటేజ్, జాతీయ రహదారి నుంచి వివిధ రాష్ట్రాలకు వెళ్లే రహదారులపై ఉన్న సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. షాపులోని సీసీ కెమెరాల్లో ఉన్న ఫుటేజ్ ఆధారంగా.. నిందితుల ముఖచిత్రాలను వారు గుర్తించినట్టు సమాచారం. కొన్ని నెలల క్రితం.. ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో, నగరంలోని ఓ ఏటీఎంలో దోపిడీకి పాల్పడిన దుండుగులు ఇలాగే కాల్పులు జరిపారు. దీంతో.. ఈ మూడు ఘటనల వెనుకా ఒకే ముఠా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దోపిడీకి ముందస్తుగా రెక్కీ నిర్వహించి పథకం ప్రకారమే వచ్చారని.. లోపలికి రాగానే దుకాణం హెడ్ అసిస్టెంట్ మేనేజర్ వద్దకు వెళ్లి లాకర్ తాళాలు అడగడంతోపాటు, ఇవ్వకపోవడంతో అతడిపైనే కాల్పులు జరపడమే ఇందుకు నిదర్శనమని పోలీసులు భావిస్తున్నారు. కాగా.. షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్ థియేటర్లతో సందడిగా ఉండే చందానగర్‌లో పట్టపగలే కాల్పులు జరగడంతో స్థానికులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

### త్వరలోనే పట్టుకుంటాం

ఉదయం 10.35 గంటల ప్రాంతంలో ఆరుగురు దొంగలు ఆయుధాలతో లోపలికి వచ్చారు. సిబ్బందిని బెదిరించి.. నగల దోపిడీకి ప్రయత్నించారు. సిబ్బందిలో ఒకరికి గాయమైంది. ఆయన ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం బాగానే ఉంది. దొంగలు దోచుకెళ్లిన వెండి వస్తువుల విలువ ఎంతో ఇంకా తెలియదు. షాపులోని సీసీ టీవీపైనా కాల్పులు జరిపారు. 10.35 గంటలకు వచ్చి 10.45 గంటలకు బయటకు వెళ్లిపోయారు. కేసు దర్యాప్తు కోసం 12 బృందాలను రంగంలోకి దించాం. త్వరలోనే దుండగులను పట్టుకుంటాం.

- అవినాశ్ మహంతి, సీపీ, సైబరాబాద్

## కన్నబిడ్డ పట్ల దుర్మార్గానికి ఒడిగట్టిన ఆ తల్లికి 20 ఏళ్ల జైలుశిక్ష

» తాను వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని బాలికపై తల్లి ఒత్తిడి

» అంగీకరించనందుకు ఆమెపై దాడి

» తీర్పు వెలువరించిన నల్లగొండ న్యాయస్థానం

నల్లగొండ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మైనర్ అయిన తన కుమార్తెను తాను వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసేందుకు ఆ తల్లి ప్రయత్నించింది. ఇందుకు అంగీకరించలేదనే కోపంతో ఆ బిడ్డపై విచక్షణారహితంగా దాడి చేసింది. కుమార్తెను అభ్యంతరకర రీతిలో వీడియోలు తీసేందుకు తన ప్రియుడిని ప్రోత్సహించింది. రెండేళ్ల క్రితం నల్లగొండలో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన కేసులో నల్లగొండ కోర్టు న్యాయమూర్తి రోజారమణి మంగళవారం తీర్పు వెలువరించారు. బాలిక తల్లికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. లైన్‌వాడకు చెందిన గ్యారాల శివకుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతడు పట్టణ పరిధిలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ మహిళ కూతురుపై కన్నేసి.. ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఇందుకు ఆ బాలిక నిరాకరించింది. అతడినే పెళ్లి చేసుకోవాలని బిడ్డను తల్లి ఒత్తిడి చేసింది. పెళ్లికి ఒప్పించేందుకు శివ కుమార్‌తో బాలికను అభ్యంతరకర రీతిలో వీడియోలు తీయించింది. బాధితురాలైన బాలిక.. బంధువులతో కలిసి 2023 మే 8న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాలను సేకరించారు. కాగా మరికొద్దిసేపట్లో తీర్పు వెలువడనుందనగా నిందితుడు శివకుమార్ పరారయ్యాడు. బాధితురాలి తల్లిని, శివకుమార్‌ను పోలీసులు మంగళవారం కోర్టుకు తీసుకొచ్చారు. నిందితుడు మరుగుదొడ్డికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లి.. కోర్టు ఆవరణ నుంచి తప్పించుకున్నాడు. ఏ-1గా ఉన్న శివకుమార్‌పై కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మళ్లీ అతడిని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టిన రోజే శిక్షను ప్రకటిస్తారు. ఏ-2గా ఉన్న బాలిక తల్లికి పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.5వేల జరిమానా, బాల్య వివాహ నిషేధ చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం మరో రెండేళ్ల జైలు శిక్ష విధించారు.

## 'కాళేశ్వరం' రక్షణకు తీసుకున్న చర్యలేంటి?

» గత ఆదేశాల అమలుపై నివేదిక ఇవ్వండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు రక్షణ కోసం తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 39 ప్రకారం చేయాల్సిన పనుల అమలుపైనా వివరాలు సమర్పించాలని ఆదేశించింది. 2023లో ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వరదలు సంభవించిన నేపథ్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ నిబంధనలు అమలు చేయాలని, కాళేశ్వరం ప్రాజెక్టు రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ డాక్టర్ చెరుకు సుధాకర్, కే శ్రవణ్‌కుమార్ తదితరులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం ఎదుట మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ.. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రక్షణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల నష్టం మరింత పెరుగుతుందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇదే పిటిషన్‌పై గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై నివేదిక సమర్పించడం తోపాటు ప్రస్తుత పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియజేయాలని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 28కి వాయిదా పడింది.

# ఏసీబీకి చిక్కిన లంచాధికారులు

» కలెక్టరేట్ నుంచి తహసీల్దార్‌కు ఫైలు పంపేందుకు రూ.15 వేలు లంచం

» వికారాబాద్‌లో పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ సుజాత

» ఫోన్ పే ద్వారా రూ.10 వేలు లంచం

» పెద్దపల్లిలోసర్వేయర్, అరెస్టు

» పదవీ విరమణ పొందిన ఉద్యోగి నుంచి డబ్బు తీసుకుంటూ చిక్కిన పీహెచ్‌సీ జూనియర్ అసిస్టెంట్

వికారాబాద్, నస్పూర్, పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించేందుకు లంచాలు తీసుకున్న ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఓ ప్రైవేటు సర్వేయర్ వేర్వేరు ఘటనల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు మంగళవారం పట్టుబడ్డారు. ఓ పట్టాకు సంబంధించి కలెక్టర్ ఆమోదం పొందిన ఫైలును సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి పంపేందుకు రూ.25 వేలు లంచం డిమాండ్ చేసిన వికారాబాద్ కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్ సుజాత ఏసీబీకి చిక్కారు. బాధితుడి నుంచి ఆమె రూ.15వేలు నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఏసీబీ కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా వట్టిమీనపల్లికి చెందిన ఓ రైతు తన రెండెకరాల భూమిని తల్లి పేరును పట్టా చేసేందుకు నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత ఫైలు కలెక్టర్ ముందుకు వెళ్లేందుకు జూనియర్ అసిస్టెంట్ సుజాత సదరు రైతు నుంచి రూ.5వేలు లంచం తీసుకున్నారు. కలెక్టర్ ఆమోదం పొందిన ఫైలును తిరిగి నవాబుపేట తహసీల్దార్ వద్దకు పంపేందుకు సుజాత మరో రూ.20వేలు డిమాండ్ చేశారు. గతంలో రూ.5వేలు ఇచ్చాను కదా ? అని రైతు అంటే మొత్తం రూ.25వేలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. దీంతో ఆ రైతు ఏసీబీని ఆశ్రయించాడు. అనంతరం రైతు నుంచి రూ.15 వేలు తీసుకుంటున్నప్పుడు సుజాతను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరో ఘటనలో భూమి హద్దులు నిర్ణయించేందుకు ఫోన్ పే ద్వారా ఓ రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకున్న పెద్దపల్లి మండల సర్వేయర్ పెండ్యాల సునీల్, అతనికి సహకరించిన ప్రైవేటు సర్వేయర్ కే.రాజేందర్ రెడ్డిని ఏసీబీ మంగళవారం అరెస్టు చేసింది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. పెద్దపల్లికి చెందిన ఓ రైతు తన భూమిని సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించి నివేదిక ఇవ్వాలని సర్వేయర్ సునీల్‌కు ఎనిమిది నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. పని జరగాలంటే రూ.20 వేలు లంచం ఇవ్వాలని సునీల్ డిమాండ్ చేశాడు. ప్రైవేట్ సర్వేయర్ కె రాజేందర్ రెడ్డి ద్వారా మంతనాలు జరిపిన సునీల్ చివరికి రూ.10వేలకు అంగీకరించారు. కానీ సదరు రైతు జూలై 2న ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఏసీబీ సూచన మేరకు ఆ రైతు నగదు ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ప్రైవేట్ సర్వేయర్ రాజేందర్ రెడ్డికి ఫోన్‌పే ద్వారా పంపాలని సర్వేయర్ సూచించాడు. దీంతో సదరు రైతు జూలై 9న రాజేందర్ రెడ్డికి రూ.10వేలు ఫోన్ పే చేయగా అదే రోజు ఆ సొమ్ము రాజేందర్ రెడ్డి నుంచి సునీల్‌కు బదిలీ అయింది. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు సునీల్, రాజేందర్ రెడ్డిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

### పదవీ విరమణ పొందిన ఉద్యోగి నుంచి లంచం

మంచిర్యాల జిల్లా కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్ గడియారం శ్రీనివాసులు.. ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తి నుంచి రూ. 6వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. చెన్నూరు మండలం అంగ్రాజుపల్లి పీహెచ్‌సీ ఉద్యోగి శ్రీనివాసులు.. కోటపల్లి పీహెచ్‌సీలో ఇన్‌చార్జి జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రెండు డీఏ బకాయి బిల్లులను తయారు చేసి డీడీవోకు పంపించేందుకు పదవీ విరమణ పొందిన ఓ ఉద్యోగి నుంచి శ్రీనివాసులు రూ. 6వేలు డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం బాధితుడి నుంచి రూ.6వేలు తీసుకుంటున్నప్పుడు శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కోర్టులో హాజరు పరిచారు.

# 'సృష్టి' కేసులు సిట్‌కు బదిలీ

» మొత్తం 9 కేసులు.. 25 అరెస్టులు

» నిందితులపై గతంలోనే 15 కేసులు

» ఏజెంట్లకు భారీగానే కమిషన్

» వెల్లడించిన డీసీపీ రష్మీ పెరుమాళ్

» నమ్రతగా పేరు మార్చుకున్న నీరజ

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ కేంద్రం మోసాలపై నమోదైన తొమ్మిది కేసులను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు బదిలీ చేసినట్లు ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు మరింత లోతుగా జరగాల్సి ఉండడం.. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు.. పకడ్బందీగా సాంకేతిక ఆధారాల సేకరణ వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సి ఉన్నందున పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలతో ఈ కేసులను సిట్‌కు బదిలీ చేశామన్నారు. ఇప్పటి వరకు నమోదు చేసిన 9 కేసుల్లో 25 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె పలు వివరాలను వెల్లడించారు. ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతపై 2010-20 మధ్యకాలంలో తెలుగు రాష్ట్రాల్లో 15 కేసులు నమోదైనట్లు తెలిపారు. జూలైలో బాధితుల ఫిర్యాదుతో సరగసీ చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. "డాక్టర్ సూరి శ్రీమతి అనే 90 ఏళ్ల వయసున్న గైనకాలజిస్టు లైసెన్సుతో నమ్రత క్లినిక్‌ను ప్రారంభించారు. డాక్టర్ సూరి శ్రీమతి పేరుతోనే లెటర్‌హెడ్‌లు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లను వినియోగించారు. ఈ విషయం సూరి శ్రీమతికి తెలియదు. దాంతో.. ఆమె కూడా మాకు ఫిర్యాదు చేశారు. కొందరు బాధితులను నమ్రత కుమారుడు జయంత్ బెదిరించేవాడు." అని డీసీపీ వివరించారు. సికింద్రాబాద్, కొండాపూర్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, రాజమండ్రి, భువనేశ్వర్, కోల్‌కతాలో నమ్రత 'సృష్టి' క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన వద్దకు వచ్చేవారిని సరగసీకి ఒప్పించేవారన్నారు. దంపతుల అండాలు, వీర్యకణాల తీరును పరిశీలించకుండానే.. సరగసీ పేరుతో పిల్లల అక్రమ రవాణా ముఠా నుంచి కొనుగోలు చేసే శిశువులను వారికి అంటగట్టేవారని చెప్పారు. "కొన్ని కేసుల్లో.. ఇతర రాష్ట్రాల్లోని పేద గర్భిణులకు వలవేసేవారు. వారిని వైజాగ్‌కు పిలిపించి, డెలివరీ చేసేవారు. వారి శిశువులను రూ.80 వేల నుంచి రూ.90 వేలకు కొనుగోలు చేసేవారు. నకిలీ డీఎన్ఏ సర్టిఫికెట్లతో ఆ శిశువులను సరగసీ పేరుతో పిల్లల్లేని దంపతులకు అంటగట్టేవారు. ఇందుకోసం ఆ దంపతుల నుంచి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసేవారు. ఏజెంట్ల సాయంతో చిన్నారుల అక్రమ రవాణా ముఠాల ద్వారా కూడా శిశువులను కొనుగోలు చేసేవారు. ఆడశిశువుకు రూ.3.5 లక్షలు, మగ శిశువుకు రూ.4.5 లక్షల చొప్పున చెల్లించేవారు" అని డీసీపీ వెల్లడించారు.

### నమ్రతగా మారిన నీరజ

డాక్టర్ నమ్రత అసలు పేరు నీరజ. ఆమె మూడున్నర దశాబ్దాల క్రితం వైజాగ్‌లోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివినట్లు సమాచారం. అయితే.. మోసాలతో దందా చేస్తున్నందుకు పోలీసులకు పట్టుబడే అవకాశాలుండడంతో ఆమె డాక్టర్ నమ్రత పేరుతో చలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ పోలీసు కేసులు నమోదైతే.. అసలు పేరుతో విదేశాలకు పారిపోవచ్చని ఆమె స్కెచ్ వేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## 9 పార్టీలకు ఈసీ నోటీసులు

25 లోపు జవాబివ్వాలి

### కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సత్తాతోపాటు గుర్తింపు లేని 8 రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలని ఆ పార్టీలకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు ఈ నెల 25 లోపు సమాధానం ఇవ్వడంతోపాటు సరైన ఆధారాలు సమర్పించాలని మంగళవారం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఈసీ నోటీసులు అందుకున్న పార్టీల్లో ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ (హైదరాబాద్), ఆల్ ఇండియా బీసీ ఓబీసీ పార్టీ (మేడ్చల్- మల్కాజ్‌గిరి), బీసీ భారతదేశం పార్టీ (హైదరాబాద్), భారత లేబర్ ప్రజా పార్టీ (భద్రాద్రి-కొత్తగూడెం), లోకసత్తా పార్టీ (హైదరాబాద్), మహాజన మండలి పార్టీ (హైదరాబాద్), నవ భారత్ నేషనల్ పార్టీ (మేడ్చల్- మల్కాజ్‌గిరి), తెలంగాణ ప్రగతి సమితి (మేడ్చల్-మల్కాజ్‌గిరి), తెలంగాణ ఇండిపెండెంట్ పార్టీ (మేడ్చల్-మల్కాజ్‌గిరి) ఉన్నాయి. హైదరాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, భద్రాద్రి-కొత్తగూడెం) జిల్లాల కలెక్టర్లకు ఈ నోటీసులను పంపిన సీఈఓ.. సదరు పార్టీల పేర్లను దిన పత్రికలు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచురించి ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.